ఆంధ్రప్రదేశ్ శాసనసభ చర్చలు
అధికార నివేదిక
(పదకొండవ శాసనసభ)
(మొదటి సమావేశము: మూడవ రోజు)

---

శుక్రవారము, నవంబరు 12, 1999.

---

(సభ ఉదయం 9-00 గంటలకు సమావేశమైనది)
(గౌ. సభాపతి అధ్యక్షస్థానములో వున్నారు)

## సభాపతి రూలింగ్

## సభ్యుల ప్రమాణము లేక ప్రతిజ్ఞా స్వీకారము గురించి

మేడమ్ స్పీకర్:- నన్ను గౌరవ సభ్యులు రూలింగ్ ఇవ్వమని కోరడం జరిగింది. ప్రొటెం స్పీకర్‌గారు రూలింగ్‌ను రిజర్వ్ చేసారు. ఇప్పుడు నేను రూలింగ్ ఇవ్వదలచుకొన్నాను.

Soon after the House assembled for its sitting on 11th November, 1999 Sri M.V. Mysoora Reddy raised a point of order enquiring whether the second oath administered to Members under Rule 5 of the Rules of Procedure and Conduct of Business in the House was valid before the Member signed in the Roll of Members after making oath under article 188 of the Constitution of India. He has also raised another point of order whether the oath taken by certain members in the name of political leaders or in the names of their kith and kin was valid as it did not conform to the format set out in the Third schedule to the Consitution. He requested a Ruling on he points raised by him.

Sri Y.S. Rajasekhar Reddy enquired as to when the Speaker Protem is going to take the second oath as required under the Rules as the Speaker Protem did not take such a oath before the governor.

The Speaker Protem reserved the Ruling over the points raised by Sri M.V. Mysoora Reddy.

I am happy that I was called upon to decide the question of constitutional importence with far reaching consequences immediaely after assuming the office of Speaker. As you all know art. 188 stipulates that every member of the Assembly before takin his seat in the House is required to make or subscribed before the Governor or some person appointed in that behalf by him a oath or affirmation according to the format set out for the purpose in the Third Schedule to the Constitution. The requirement of the Constitution is that a Mamber elected to the House should take oath before the Governor or a person appointed by him according to the format set out in the Constituion. This Article does not require a Member to sign the Roll of Members. The moment a member takes oath under Art. 188, he is entitled to discharge his duties and obigations arising by or under the Constitution. The mere fact that a member did not sign in the Roll does not disentitle him to ful-fil his obligations. Every Member is free to discharge his obligations. The moment he took oath under Art.188. Sri M.V. Mysoora Reddy seems to be under a mistaken impression that the oath taking completes only after signing the Roll of Members. The signing in the Roll serves as a piece of evidence that a particular member taken his oath. The non-signing in the Roll of Members does not disentitle a Member to take the oath prescribed under the Rules. I, therefore, rule that the second oath administered to members before signing in the Roll of Members is in order. In these aspects there is no need to administer the same again.

Regarding the other point raised by Sri M.V. Mysoora Reddy whether the oath taken in the names of leaders of political parties and near relatives etc., I feel that strictly speaking such a procedure is not in conformity with the format set out in the Constitution. I, therefore, direct that such of members who have not taken the oath according to

the format set out in the Constitution may do so again. The Special Secretary will be calling their names in due course.

Regarding enquiry made by Sri Y.S. Rajasekhar Reddy about the second oath to be administered to the Pro-tem speaker, I am calling Sri Kolla Appala Naidu to take the same now.

## ప్రమాణము లేక ప్రతిజ్ఞా స్వీకారము

9.10 ఉ. ముందుగా ప్రొటెం స్పీకర్‌గారు సభలో ఉన్నట్లయితే వారు ఓత్ తీసుకొంటారు. పిదప ఓత్ తీసుకొని సభ్యులెవరైనా సభలో ఉంటే వారు ఓత్ తీసుకొంటారు. ఆ తరువాత నేను రూలింగ్ ఇచ్చిన విధంగా మిగిలిన సభ్యులు ఓత్ తీసుకొంటారు.

(తరువాత ఈ క్రింద పేర్కొనబడిన గౌరవ సభ్యులు ప్రతిజ్ఞ/ప్రమాణ స్వీకారం చేసారు.)

| క్రమ సంఖ్య. | గౌరవ సభ్యుని పేరు. | నియోజక వర్గం. |
|---|---|---|
| 1. | శ్రీ బి. గోపాలకృష్ణారెడ్డి | శ్రీకాళహస్తి |
| 2. | శ్రీ పి.వి. నరసింహారాజు | భీమవరం |
| 3. | శ్రీ కొళ్ళ అప్పలనాయుడు | ఉత్తరాపల్లి |
| 4. | శ్రీ నోముల నర్సింహయ్య | నకిరేకల్ |
| 5. | శ్రీ నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి | కోవూరు |
| 6. | శ్రీ పి. రఘునాథరెడ్డి | నల్లమడ |
| 7. | శ్రీమతి గల్లా అరుణకుమారి | చంద్రగిరి |
| 8. | శ్రీమతి కె. సురేఖ | శాంపేట |
| 9. | శ్రీ టి. సన్యాసి అప్పలనాయుడు | గజపతినగరం |
| 10. | శ్రీ చల్లా రామకృష్ణారెడ్డి | కోయిలకుంట్ల |
| 11. | శ్రీమతి జి. ఉమ | తెనాలి |
| 12. | శ్రీ డి. ఉమామహేశ్వరరావు | నందిగామ |
| 13. | శ్రీ ఎం. శివన్నాయుడు | పార్వతీపురం |
| 14. | శ్రీ డి. శ్రీధర్ బాబు | మంథని |

9-20 ఉ. డా. ఎం.వి. మైసూరా రెడ్డి (కమలాపురం):- మేడం స్పీకర్, రాజ్యాంగ సార్వభౌమాధికారాన్ని కాపాడినందుకు అభినందనలు.

Madam Speaker, point of clarification!

Madam Speaker:- What is your clarification?

Sri M.V. Mysoora Reddy:- Madam Speaker, if a Member sits or votes in the House without making and subscribing to the oath or affirmation he is liable in respect of each day on which he sits or votes to a penalty of Rs.500-00 to be recovered from his pay.

దయచేసి ఇది కూడా ఇంప్లిమెంట్ చేస్తే చాలా బాగుంటుంది. సాంప్రదాయం అవుతుంది.

## ప్రకటనలు

### 1. ప్యానల్ ఆఫ్ ఛైర్మన్ నియామకము గురించి

Madam Speaker:- I am to announce to the House that I am nominating the following Members on the Panel of chairmen for the first session.

1. Sri C. Mutyam Reddy,
2. Sri M.V. Krishna Rao,
3. Smt. P. Varalakshmi,
4. Sri D.S. Redya Naik,
5. Dr.R. Ravindranath Reddy.

### (II) డా. వై.యస్. రాజశేఖరరెడ్డిని ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించుట గురించి.

Madam Speaker:- I am to announce to the House that in accordance with the direction 56(i), the Congress Legislature Party with a strength of ninty one Members is recognised as the main opposition party in the Assembly and its leader

Dr.Y.S. Rajasekhar Reddy, M.L.A., is recognised as the Leader of Opposition.

(III) గవర్నరుగారి ప్రసంగపు ప్రతిని సభాసమక్షంలో ఉంచుట గురించి: కృతజ్ఞతలు ప్రతిపాదనకు సవరణలను ప్రతిపాదించుట గురించి.

Madam Speaker:- I am to announce to the House that on 11th November, 1999 the Governor was pleased to address the Members of this House. A true copy of the Address has been laid on the Table of the House. (అనుబంధము)

సభాసమక్షంలో పెట్టిన పత్రము

Madam Speaker:- The Paper to be placed on the Table of the House is deemed to have been placed.

1. A copy of the report on the decisions of the Business Advisory committee taken at its meeting held on 11th November, 1999.

Madam Speaker:- Now, Sri G. Butchiah Chowdary will move the motion of thanks to the Governor's Address.

గవర్నరుగారి ప్రసంగం పట్ల కృతజ్ఞతా ప్రతిపాదన

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి (రాజమండ్రి):- అధ్యక్ష మహాశయా, గవర్నరు గారు 1999, నవంబర్ 11వ తేదీన శాసన సభను ఉద్దేశించి దయతో చేసిన ప్రసంగానికి గాను 11వ ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రథమ సమావేశంలో సమావేశమయిన సభ్యులు గాఢ కృతజ్ఞతా బద్ధులై ఉన్నారు.". అని ప్రతిపాదిస్తున్నాను.

శ్రీ ఎస్. చంద్రమోహన్ రెడ్డి (సర్వేపల్లి):- అధ్యక్షా, నేను ప్రతిపాదనను బలపరుస్తున్నాను.

## ప్రకటన:

## (4) గవర్నర్‌గారి ప్రసంగంపట్ల కృతజ్ఞతా ప్రతిపాదనకు సవరణలను ప్రతిపాదించుట గురించి.

Madem Speaker: Iam to announce to the House that the House that the amendments to the Motion of Thanks to the Governor's Address will be received by the Special Secretary, A.P. Legislature upto 5.00 p.m., on 12th November, 1999.

## గవర్నరు గారి ప్రసంగం పట్ల కృతజ్ఞతా ప్రతిపాదనపై చర్చ.

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి:- అధ్యక్షా, నూతనంగా ఎన్నికయి 11వ శాసనసభలో ప్రవేశించిన సహచర శాసన సభ్యులకు హృదయపూర్వకంగా స్వాగతం చెబుతూ ఈ ప్రథమ సమావేశంలో గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు చెప్పే తీర్మానం ప్రతిపాదించే అవకాశం నాకు ఇచ్చినందుకు గౌరవ ముఖ్యమంత్రిగారికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు చెబుతున్నాను. 4వ సారి శాసన సభకు ఎన్నికయి వచ్చిన అవకాశాన్ని మహాభాగ్యంగా భావిస్తున్నాను. ఈనాడు 11వ శాసనసభకు వచ్చిన సందర్భంగా రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు ఏ పరిస్థితులలో జరిగాయో, గతంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అందరి ఆలోచనలకు భిన్నంగా, అధికారంలోకి రావడం జరిగింది. సహజంగా ఈ మధ్య కాలంలో ఒకసారి ఎన్నికయిన పార్టీ మళ్లీ అధికారంలోకి రావడం లేదనే భావన ఉంది. అనేక రాష్ట్రాలలో ప్రభుత్వాలు మారుతున్న పరిస్థితికి భిన్నంగా మళ్లీ టి.డి.పి. యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్‌కు భిన్నంగా అధికారంలోకి వచ్చింది అంటే దీనికి కారణం ఏమిటి. ప్రజలు ఏ విధంగా స్పందించారు అనేది ఒక్కసారి ఆలోచించవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. గతంలో ఒకే పార్టీ కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలో ఉండేది. సరైన ప్రతిపక్షం లేకుండా, ఏకచ్ఛత్రాధిపత్యంగా ప్రభుత్వం నడిపినా, ఈ దేశం కానీ, రాష్ట్రం కానీ సరిగ్గా అభివృద్ధి చెందలేదనే ఉద్దేశంతో ఎప్పటికప్పుడు అసమానతలు తొలగిస్తూ ప్రాంతీయ పార్టీలు ముందుకు వచ్చి, ఈ దేశంలో ముందుకు సాగుతున్న విధానాన్ని ఒకసారి గుర్తు తెచ్చుకోవాలి. గవర్నరుగారు తమ ప్రసంగంలో చెప్పిన విధంగా పనిచేస్తే ఫలితం ఉంటుందని, ప్రజలు తమ బాగోగులు చూసి, ఎవరయితే అభ్యున్నతికి పాటుపడతారో ఆ ప్రభుత్వం పట్ల, ఆ నాయకత్వం పట్ల సంపూర్ణ విశ్వాసం ప్రకటించి, తిరిగి అధికారాన్ని కట్టబెడతారని, ఈ ఎన్నికలలో విజ్ఞులయిన ప్రజానీకం రుజువు చేశారు. ఈ విధానం రాబోయే ఎన్నికలకు కానీ, అన్ని పార్టీల నాయకులకు కానీ కనువిప్పు అవుతుందని, పనిచేస్తే హర్షించి, పట్టం కడతారనేది రుజువయింది. కనుక ఈ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం ఏ విధంగా అమలు చేసిందీ చూసి అదే విధానం అమలు చేస్తే వారు కూడా ముందుకు రాగలరు అని ఈ దేశంలో ప్రతి నాయకునికి, ప్రతి పార్టీకి గుర్తుగా, చిహ్నంగా మిగులుతుందని మనవి చేస్తున్నాను. ఈ రోజున ఈ రాష్ట్రం భారతదేశానికి ఆదర్శప్రాయంగా నిలవాలి అనే ఆలోచనతో పోతున్నాము. ఆ రకంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ ప్రశంసలను మన ముఖ్యమంత్రి గారు, పొందుతున్న విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఎవరయినా పని

చేసే నాయకులకు సరైన అవకాశం ఇవ్వక పోతే ఎందుకు పని చెయ్యాలి, ఎవరి కోసం పని చెయ్యాలి అనే భావం నాయకులలో వచ్చి, ఏదో 5 సంవత్సరాలు ఉంటాము. ఓడిపోతాము, ఆ తరువాత ఆ ప్రభుత్వం మీద వ్యతిరేకత వస్తుంది, మళ్ళీ అధికారినికి వస్తాము అనే భావనకు వస్తే ఎవరూ ఏమీ చెయ్యలేరు. ఈ రాష్ట్రాన్ని, దేశాన్ని ఎవరూ బాగు చెయ్యలేరు. కనుక ఒక నూతన విధానంలో ముందుకు సాగుతున్నాము. ధైర్యం, దృఢ సంకల్పంతో, వినమ్రతతో పనిచేస్తే ఫలితం ఉంటుందని రాష్ట్రప్రజలు విజ్ఞతతో తేల్చి చెప్పారు.

9.30 ఉ. ఇక ముందు ఏపార్టీకైనా, ఏ నాయకుడికైనా ఇదే ఆదర్శమని మనవి చేస్తున్నాను. మనం తెలుసుకోవాలే కాని అసాధ్యయం అనేది ఏమీ లేదు. 19వ శతాబ్దాన్ని మనం చూశాము. మనం ఈ శతాబ్దంలో ఎంతో సాధించగలిగాము. అంతరిక్షానికి వెళ్ళగలిగాము. ఎన్నెన్నో సమస్యల్ని పరిష్కారం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకుని ముందుకు సాగుతున్నాము. మరి కష్టపడి పనిచేశాము కనుకనే అసాధ్యం అనుకున్నది కూడ సుసాధ్యం చేసుకుని ముందుకు సాగాము. కనుకనే ఈరోజున 20 వ శతాబ్దపు ముంగిట్లో ఉన్నాము. గతంలో సాధించిన అపార అనుభవం ఎన్నెన్నో సాధించిన ఘన విజయాలు ముందు, ముందు మానవాళికి ఉపయోగపడనున్నవి. అహంకారాన్ని జయించి శాంతి కాముకులంగా పరస్పర గౌరవాభిమానంతో పని ఆరాధనతో పడిరవెల్లనుంది. కనుకనే ఈ దిశలోనే మనం కూడా నడవాలి. అభివృద్ధిని సాధించాలి. ఈ రాష్ట్రాన్ని సర్వతోముఖంగా అభివృద్ధి చేసి, ప్రజాళికా బద్ధంగా కార్యక్రమాలను నడిపి, నూతన విజ్ఞానాన్ని, పనితనాన్ని మిళితం చేసి, ప్రజల భాగస్వామ్యంతో, పారదర్శకతతో, ఈ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని మనం భావించుకుంటున్నాము.

అందుకే నారా చంద్రబాబు నాయుడి గారి సారథ్యంలో విజన్ 2020 డాక్యుమెంట్ రూపుదిద్దుకున్నది. దీనికి ప్రజల ఆమోదం లభించింది. దీని ఆధారంగానే మనం వెళ్ళాం. దాని పర్యవసానంగానే తిరిగి అధికారంలోకి రాగలిగాము. దేనికైనాసరే ముందుచూపు అవసరం. గతంలో మహాకవి శ్రీ శ్రీ గారు ఒక గేయం వ్రాశారు. అదేమంటే 'ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూసి మోసపోకుమా, నిజం మరచి నిదురపోకుమా'. అని శ్రీశ్రీగారు అన్నట్లుగా ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఆశిస్తే అది అయ్యేది కాదు. మనం స్వయంగా పూనుకున్నప్పుడే, కష్టపడినపుడే మనం ఏదయినా సరే ఫలితాన్ని సాధిస్తామని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. చీకటి గురించి మనం చింతిస్తూ కూర్చుంటే అయ్యేది ఏమీ ఉండదు. చిరుదివ్వెను వెలిగించడానికి ప్రయత్నం చేస్తేనే చీకటిని పారద్రోలగలం. మనం చక్కటి విధానంతో కార్యక్రమాన్ని తీసుకున్నాము. అలాగే ముందుకు సాగాలని మీ ద్వారా సభకు మనవి చేస్తున్నాను. తెలుగుదేశం పార్టీ యొక్క సిద్ధాంతం, జన్మభూమి యొక్క సిద్ధాంతం ద్వారా ప్రజలకు అధికారం–స్వయం గ్రూపుల ద్వారా ప్రజలకు భాగస్వామ్యం – సాంఘిక సంక్షేమాన్ని అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకు వెళ్ళడానికి – రాష్ట్రానికి పరిశ్రమలను, పెట్టుబడులను ఆకర్షించి

అదనపు ఉద్యోగాల కల్పన, అదనపు ఆదాయాలు, టాక్సేషన్ రూపాన రాబట్టి అభివృద్ధి సాధన, శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించి రౌడీయిజం, ఫ్యాక్షనిజం, ఎక్స్‌ట్రీమిజం, కమ్యూనల్ ఎలిమెంట్స్‌ను సమూలంగా అరికట్టడం, అడ్మినిస్ట్రేటివ్ రీఫారమ్స్‌ను, ప్రైవేజరును సింప్లిఫై చేసి రెడ్ టేపిజాన్ని అరికట్టడం – ఎక్కడ వీలయితే అక్కడ విచక్షణాధికారాన్ని పారదర్శకం చేయడం – కార్యక్రమాలను, విధానాలను ఆధునీకరించడం, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం– రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అన్ని రంగాలలో, వివిధ కోణాలలో పరిశీలించి మార్పులు చేసి అభివృద్ధిని సాధించడం–అందుకే మన యొక్క ఆశయం స్వర్ణాంధ్రప్రదేశ్ దీనికి స్ఫూర్తి జన్మభూమి. దీనికి విజన్ 2020 అని మనం చేస్తున్నాము. అందుకే భారతదేశంలోనే మన ఆంధ్రరాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడం మన లక్ష్యం కనుకనే కొన్ని నిర్దేశిత లక్ష్యాలు పెట్టుకున్నాము. శుష్క వాగ్దానాలు చేసి, శూన్య హస్తాలు చూపించకుండా వాస్తవ దృక్పథంతో వ్యవహరించి, కార్యాచరణలో ముందుకు సాగాలి. ఓట్ల కోసం వాగ్దానాలు చేసి ఆ తరువాత ప్రజలను వారి కర్మకు వదిలివేసే విధానం సరయినది కాదని మనవి చేస్తున్నాను.

అందుకే మనం విజన్ 2020 ద్వారా కార్యక్రమాలను తీసుకుంటున్నాము. ఈ ప్రభుత్వం ఇంకో అయిదు సంవత్సరాలు కొనసాగుతుంది కనుక ఈ అయిదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని ఏవిధంగా ముందుకు తీసుకువెళ్ళాలనే ఆలోచన చేసి మనం కొన్ని కార్యక్రమాలు నిర్దేశించుకున్నాము. ఎందుకంటే ఇదే మొట్టమొదటి సమావేశం కనుక మన లక్ష్యాలను చెప్పవలసిన అవసరం ఉంది. ఈ రోజున 40 లక్షల నిరుపేద కుటుంబాల పేదరికాన్ని తొలగించాలని ఈ అయిదు సంవత్సరాలలో దానిని సాధించాలని తెలుగుదేశం ప్రభుత్వం భావన. అంతేకాకుండా నిరక్షరాస్యత నిర్మూలన కోసం ఇప్పుడున్న 44శాతం అక్షరాస్యతా శాతం నుంచి 2005 నాటికి 83 శాతానికి పెంచాలని ఆలోచన. దీనికోసం ప్రత్యేకంగా 2005 నాటికి ప్రతి నియోజక వర్గానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్, 2010 నాటికి ప్రతి మండలానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ తెరవాలని 29 లక్షల మంది పిల్లలను అంగన్‌వాడిలలో చేర్చాలని 2002 నాటికి వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వం యొక్క లక్ష్యం.

జనాభా సంఖ్య మనకు తెలుసు. ఈ రోజున ఈ దేశం యొక్క ప్రధానమైన సమస్య అధిక జనాభా. ఎన్ని వనరులు పెరుగుతున్నా కూడ ప్రజల సమస్యలు పరిష్కారం కాకుండా పోవడానికి కారణం పెరుగుతున్న జనాభాను అరికట్టలేకపోవడమే. కమ్యూనిస్టు దేశమైన చైనాలాంటి దేశంలో జీరో శాతానికి తగ్గించుకోగలిగింది. మనం ఎంతో కొంత సాధించకపోతే ప్రపంచంలోనే రెండవ పెద్ద దేశంగా ఉన్న ఈ భారతదేశాన్ని మనం సమస్యల సుడిగుండంలో నుంచి తప్పించలేము. తప్పించాలి అంటే జనాభాని అరికట్టాలి. కనుకనే మనం కూడా జనాభా పెరుగుదల రేటును 0.83 శాతానికి తగ్గేలా చూడడం, తద్వారా అందరికీ ఆరోగ్యం కల్పించాలన్నది తెలుగుదేశం పార్టీ యొక్క లక్ష్యం.

అంతేకాదు మహిళా అభివృద్ధి కోసం కీర్తిశేషులు నందమూరి తారక రామారావుగారి నాటి నుంచి కూడ, ఈనాడు చంద్రబాబు నాయుడు గారు కూడ మహిళాభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్నారు. మీరే చూశారు. గ్రామాలలో మహిళా చైతన్యం వెల్లివిరుస్తున్నది. రాబోయే 20వ శతాబ్దంలో మహిళా ప్రభంజనం రాబోతున్నది. ఈరోజున తమరు అధ్యక్ష స్థానం వహించారు. ఈ శాసన సభలో దాదాపు 26 మందిపైకు మహిళలు ప్రవేశించారు. ఇది తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న విధానాల ఫలితమే అని మీ ద్వారా మనవి చేస్తున్నాను. ఆనాడు భారత దేశంలో ప్రప్రథమంగా మహిళా రిజర్వేషన్ కల్పించింది తెలుగుదేశం పార్టీ. ఈరోజు అత్యధిక సంఖ్యలో సీట్లను కేటాయించి మహిళలను ముందుకు తీసుకు రాగలిగింది తెలుగుదేశం పార్టీ అని మనవి చేస్తున్నాము. ఏదయితే పార్లమెంట్‌లో బిల్లును ప్రవేశపెట్టాలని కోరుతున్నారో చట్టసభలో మూడవ వంతు మహిళలకు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ 1996లోనే ఈ సభలోనే తీర్మానం చేసిన విషయాన్ని మీ ద్వారా సభకు గుర్తు చేస్తున్నాము. అందుకే మహిళలకు సముచిత స్థానం వచ్చింది. వారు కూడా సంఘంలో ముందుకు రావాలనే, వారికి ఆర్థిక స్వాలంబన లభించాలనే భావంతో మనం ముందుకు పోతున్నాము. కనుక ఈ రోజు స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలపడే కార్యక్రమాలు అందిస్తున్నాము. ఏదయితే సంక్షేమాన్ని కూడ మనం ఒక పట్టాన తీసుకు రావాలనే భావంతో 2005 నాటికి 25 లక్షల ఇళ్లస్థలాలు ఇవ్వాలని, 35 లక్షల పేద వారికి ఇళ్లు కట్టించాలనే లక్ష్యంతో ఉన్నాము. ఇది అసాధ్యం అని మనం అనుకోవడం లేదు. గత 4, 5 సంవత్సరాలలో ఏదయితే చెప్పారో పట్టాలిచ్చే విధానంలో 10 లక్షలమందికి పట్టాలు ఇచ్చే కార్యక్రమం కూడ, ఇళ్ళు కట్టే కార్యక్రమం కూడ సక్రమంగా అమలు చేశాము కనుక ఇదీ సాధించగలమన్న నమ్మకం ఉంది. అని ఈ సందర్భంలో మనవి చేస్తున్నాము.

అదే విధంగా మన యొక్క నిర్దేశిత లక్ష్యంలో 2005 నాటికి రెండువేల మంది ఉన్న గ్రామానికి తారు రోడ్డు వేయాలని, రెండు వందల మంది జనాభా కలిగిన చిన్న హేబిటేషన్స్‌కు కూడ మంచి నీరు అందించాలని మన లక్ష్యం.

ముఖ్యంగా పారిశ్రామికంగా కంటే వ్యవసాయకంగా ముందు ఉన్న రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ప్రోత్సాహం ఇవ్వాలని, వృత్తి పనులలో ఉన్న వారికి కూడ ప్రస్తుతం ఉన్న 3.7 శాతం నుంచి 6 శాతానికి పెంచాలని గవర్నరు గారు తమ ప్రసంగంలో చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తున్నాము. అంతే కాకుండా ఇప్పుడున్న పంటల అభివృద్ధి పరచడం కోసం, పంటల ఉత్పత్తిని నాలుగు రెట్లు అభివృద్ధి చేయాలని దాని ద్వారా రైతులకు, రైతు కూలీలకు న్యాయం చేయాలనే తెలుగు దేశం పార్టీ యొక్క విధానాలను మీ ద్వారా మనవి చేస్తున్నాను.

అదేవిధంగా ఇప్పటికే రాయలసీమ ప్రాంతంలో కాని, కృష్ణానదీ పరివాహక ప్రాంతంలో కాని అనేక ప్రాజెక్టులు నిర్మిస్తున్నాము. ఈ ప్రాజెక్టులన్నీ వ రెండువేల సంవత్సరం నాటికి మన హక్కులను కోల్పోతామని వడివడిగా ప్రాజెక్టులను ప్రారంభించి

అన్నిటికి ఒకేసారి న్యాయం చేసుకోలేకపోయాము. ఉన్న దానిలో నిధులు సక్రమంగా వినియోగించుకోవడంలో, మన హక్కులను సాధించుకోవడానికి ప్రయత్నం చేశాము. ఇదే సందర్భంలో గోదావరి జలాలను వినియోగించుకునే దానికి ఒక అథారిటీని ఏర్పాటు చేయాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే 2012 నాటికి 778 టి.ఎం.సిల నీటిని ఉపయోగించి 28 లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందించాలన్నది తెలుగుదేశం ప్రభుత్వం యొక్క లక్ష్యం. అదే విధంగా ఇప్పుడు కొరతలో ఉన్నాము. డిమాండ్‌కి సప్లయ్‌కి మధ్య వ్యత్యాసం ఉంది. విద్యుత్ ఉత్పత్తిని అత్యధికంగా పెంచవలసిన అవసరం ఉంది. మన రాష్ట్రమే కాకుండా అనేక రాష్ట్రాలలో ఇవే పరిస్థితులున్నాయి. కనుకనే దానిని సమూలంగా మార్చడం కోసం మనం ఈ రోజున కొన్ని కార్యక్రమాలు తీసుకున్నాము విద్యుత్ ఉత్పాదనలో ఎందువల్ల మనం వెనుకబడిపోయామన్న దానికి కూడా కారణం వున్నది. ఆనాడు కేంద్ర ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించక, సరైన

9-40 ఉ. పర్మిషన్లు యివ్వక మనం ప్రాజెక్టులు చేపట్టలేక పోయాము. కానీ పి.వి. నరసింహారావుగారి టైమ్‌లో తీసుకున్న నిర్ణయాలు ఈ రోజున భారతదేశంలో కొన్నిమార్పులకు కారణం అయినాయి. దాని పర్యవసానంగా ఈ రోజున ప్రాజెక్టుల క్లియరెన్స్ అంతా కూడా త్వర, త్వరగా తీసుకోడానికి రాష్ట్రాలకు స్వేచ్ఛ లభించినది గనుకనే ఈ రోజున మనం స్వావలంబన దిశగా ముందుకు సాగుతున్నాము. ఈరోజున తీసుకున్న నిర్ణయాలు రోబోయే అయిదు సంవత్సరాల్లో పూర్తి చేసుకున్నప్పుడు మనకు విద్యుచ్ఛక్తి రంగంలో మిగులు వచ్చి అవసరాలు తీర్చుకోడానికి అవకాశం లభిస్తుందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అదే విధంగా పారిశ్రామికంగా ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం మనం పారిశ్రామిక రంగానికి పెట్టుబడులను ఆకర్షించడం కోసం కార్యక్రమం తీసుకున్నాము. ముఖ్యంగా భారత దేశంలో కానీ, ప్రపంచ వ్యాప్తంగా కానీ క్రెడిబిలిటీ వున్న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుగారు ఈ రోజున మన ముందుకు వచ్చారన్న విషయాన్ని సభకు మనవిచేస్తున్నాను. ఫలితంగానే ఈ రోజున అనేక దేశాల వారు ఈ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం కోసం ముందుకు వస్తున్నారు. స్థిరమైన ప్రభుత్వం వుంటుందని, స్థిరమైన నిర్ణయాలు తీసుకుంటుందని, అభివృద్ధికి ఆటంకం వుండదని భావించారు గనుకనే పెట్టుబడులు-పెట్టే దానికి కానీ, ఈ రాష్ట్రానికి సహకారం అందించేదానికి కానీ ముందుకు వస్తున్నారని మనవిచేస్తున్నాను. ఈ సందర్భంగా ఒకటి నేను గుర్తు చేస్తున్నాను. కేంద్ర ప్రభుత్వం అక్కడ అణుపాటవ పరీక్షలు జరిపిన తరువాత అనేక దేశాలు మన దేశం మీద ఆంక్షలు విధించాయి. అలాంటి పరిస్థితులలో కూడా మన రాష్ట్రానికి సహకారం అందించడం కోసం ప్రపంచ బ్యాంక్ కానీ, ఇతర సంస్థలు కానీ ముందుకు వచ్చాయంటే ఈ రాష్ట్రంలో తీసుకుంటున్న నిర్ణయాలు సక్రమంగా వున్నాయని, ప్రపంచంలో జరుగుతున్న పెను మార్పులను దృష్టిలో పెట్టుకొని వెనుకబడి పోకుండా వుండాలనే విధానంతో ఈ రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా వ్యవహరిస్తున్నదని భావించారు గనుకనే ఈ రోజున పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నారు. ఎవరు కూడా వట్టిగా మాట్లాడడానికి సిద్ధంగా లేరు. ఏదయినా ఈ రాష్ట్రంలోనో, ఈ దేశంలోనో ఒకరికి ఒకరు కాకాలు పట్టుకోవచ్చేమో కానీ ప్రపంచంలో

అసాధ్యం. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో నిజమైన విలువలకు కట్టుబడి వుంటారు. ఎవరయితే చెప్పిన మాటకు నిలబడతారో, చెప్పిన విధంగా అభివృద్ధి చేస్తారో ఆ ప్రభుత్వాలకు కానీ, ఆ నాయకులకు కానీ మద్దతు ఇస్తారు గనుకనే ఈ రోజున ఈ రాష్ట్రం వైపు అందరి కళ్ళు మళ్ళాయని మనవిచేస్తున్నాను. కనుకనే దానిని అభివృద్ధి చేయడం కోసం సంవత్సరానికి 11 శాతం పారిశ్రామికంగా అభివృద్ధిని సాధించి దాని ద్వారా రెండు కోట్ల మందికి ఉపాధి కల్పనావకాశలు కల్పించాలని భావిస్తున్నాము. ఎందుకంటే వ్యవసాయ రంగంలో ఇంకా ఎక్కువగా ముందుకు వెళ్ళడానికి అవకాశం లేదు. కోట్లాది మంది నిరుద్యోగులు వుంటున్నారు ఈ సమస్య పరిష్కారం కావాలంటే పారిశ్రామిక ప్రగతి తప్పనిసరి. ఎన్నో సమస్యలు వున్నాయి. ప్రతి వారు కోర్కెలు కోరుతున్నారు. రోడ్లు కావాలంటున్నారు. ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని అంటున్నాము. కానీ నిధుల గురించి మాట్లాడవలసిన అవసరం వున్నది. దురదృష్టవశాత్తు ఈ దేశంలో హక్కుల గురించి ఎక్కువగా మాట్లాడుతున్నాము. బాధ్యతల గురించి తక్కువగా మాట్లాడుతున్నాము. ఫలితంగానే అడ్మినిస్ట్రేషన్ అన్ని రాష్ట్రాలలో ఫెయిల్ అయిపోతున్నది. ఈ రోజున మనం ఆలోచించి పని చేసే విధానానికి, పనికి గౌరవం లభించే విధానానికి రూపకల్పన చేయాలి. ఏ అధికారి అయితే సక్రమంగా పని చేస్తారో, ఏ ప్రజా నాయకుడు నీతివంతంగా వ్యవహరిస్తారో అలాంటి వాళ్ళకు ప్రోత్సాహం లభించేలాగా చూడవలసిన బాధ్యత అందరి మీద వున్నదని మనవిచేస్తున్నాను. సక్రమ కార్యాచరణతో పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తే ట్యాక్సేషన్ రూపేణా వేలాది కోట్ల రూపాయలు మనకు లభించే అవకాశం వున్నది. ఆ డబ్బుతోటి మన అప్పులు తీర్చుకుంటాము. అభివృద్ధిని సాధించుకుంటాము. నిరుద్యోగాన్ని తొలగించుకుంటాము. ఇప్పుడున్న తలసరి ఆదాయం కేవలం రు.2,643 మాత్రమే వున్నది. ప్రపంచంలో అతి తక్కువ వున్న దేశాలలో భారతదేశం ఏ విధంగా వున్నదో రాష్ట్రాలలో కూడా అదే విధంగా వున్నది. కనుకనే దీనిని 2020వ సంవత్సరం నాటికి, మన విజన్ ప్రకారం తొమ్మిది రెట్లుగా పెంచాలని మనం ఆలోచిస్తున్నాము. నీతివంతమైన, సమర్థవంతమైన ప్రభుత్వాన్ని అందించడం మన లక్ష్యం. కనుకనే ఈ విధానం కోసమే మనం కార్యక్రమాలు తీసుకున్నాము. ఉన్నంతలో ఎన్నెన్నో కార్యక్రమాలు మనం చేశాం. అవి ఏమిటో అందరికి తెలుసు. ఎవరు ఏ విధంగా విమర్శించినా మనం తీసుకున్న నిర్ణయాలు కొన్ని వున్నాయి. ప్రజల భాగస్వామ్యం కల్పించాలని జన్మభూమి పథకంలో ఎన్నో కార్యక్రమాలు తీసుకున్నాము. ఇంటిలో ఎలుకలు పడ్డాయని ఇంటిని తగులబెట్టుకోలేము గదా! ఏదయినా సరే ఎలుకలను తొలగించడానికి ప్రయత్నం చేయాలి. ప్రభుత్వం తీసుకునే కార్యక్రమాలలో కొన్ని లొసుగులు రావచ్చు. వాటిని తొలగించడానికి ప్రయత్నం చేయాలి. ఎలుకలు వున్నాయని ఇల్లు తగులబెట్టుకున్నట్లు ఈ కార్యక్రమాలన్నీ రద్దు చేస్తామనే విధానం సరైనది కాదని మనవిచేస్తున్నాను. మనం ఈ జన్మభూమి పథకం క్రింద సాధించిన ఫలితాలు భారీ ఎత్తున వున్నాయని మనవిచేస్తున్నాను. ఎన్నెన్నో కార్యక్రమాలు మనం సాధించగలిగాము. ఎకౌంటబులిటీ వచ్చేలాగా మనం చేయగలిగాము. గ్రామసభలలో ప్రజల సమక్షాన

నిర్ణయాలు చేసి వాటిని అమలు చేసిన పర్యవసానంగా పారదర్శకత ఈ రోజున మన ముందుకు వచ్చింది. కౌన్సెలింగ్ విధానాన్ని ప్రవేశ పెట్టాము. గతంలో ట్రాన్స్‌ఫర్స్ విషయంలో కానీ, ఉద్యోగ నియామకాల విషయంలో కానీ ఎలాంటి అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నదో అందరికీ తెలుసు. ఈ రోజున వాటినన్నిటిని సమూలంగా తొలగించడం కోసం కౌన్సెలింగ్ పెట్టి ఎక్కడికక్కడ నిర్ణయాలు చేసిన ఫలితంగా 1,20,000 మంది ఉపాధ్యాయులను, వేలాది మంది ఇంజనీర్లను, డాక్టర్లను నియమించినా ఒక్క ఆరోపణ కూడా లేకుండా కార్యాచరణ చేయగలిగామని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అందుకనే ప్రజలు హర్షించారు, ఆమోదించారు ఎవరో ఒకరిద్దరికి వారు చెప్పిన పని కాలేదనో, మన రెకమెండేషన్స్ వలన పని కాలేదని కొంత మందనవచ్చు కానీ మెరిట్ ప్రాతిపదికగా నిర్ణయాలు చేసిన ఫలితంగా వేలాది మందికి మేలు జరుగుతుంది. అది ఆమోదయోగ్యమయినది అని కూడా ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. అందుకనే ప్రజల భాగస్వామ్యంతో మానవ వనరుల అభివృద్ధి, ఉపాధి కల్పన సాధించగలిగామనేది తెలుగుదేశ ప్రభుత్వం యొక్క సిద్ధాంతం అని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను. ప్రపంచంలో మేలైన విధానాలను మనం తీసుకోవాలి. బూజు పట్టిన సిద్ధాంతంతో మనం ఏమీ చేయలేము. ఇవాళ సోషలిస్ట్ కంట్రీలు ఏమైతే వున్నాయో ఆ దేశాలన్నీ వెనుకబడిపోయాయి. ఆ సిద్ధాంతాలన్నీ కూడా బూజుపట్టి పోయాయి. ఆ సిద్ధాంతాలను వదలి ప్రపంచంతోటి ముందుకు సాగాలని ఆదేశాలు కూడా నిర్ణయం తీసుకొంటున్నాయి. అందుకని మనం ఈ రోజున విద్యుచ్ఛక్తి రంగంలో ఎన్నెన్నో మార్పులు తీసుకోవడం జరుగుతున్నది. జెన్‌కో, ట్రాన్స్‌కో ఏర్పాటును చేసుకున్నాము.

ఈ సందర్భంగా నేను ఒక విషయాన్ని మనవిచేయాలనుకుంటున్నాను. ఈ రోజు ప్రతిపక్షంగా వున్న కాంగ్రెస్ పార్టీ ఎ.ఐ.సి.సి. మ్యానిఫెస్టోలో కొన్ని నిర్ణయాలు చెప్పడం జరిగింది. "The Congress attaches the highest priority to regulate the organisational, legal and financial resoures in the Power Sector to enable it to run in a commercial manner which will have to be supported by innovative programmes being undertaken by various State Governments. Public investment in Power Sector will receive top priority even as efforts are made to encourage Indian and Foreign companies with the objective of achievement of at least 8,000 MWs of Generation Capacity every year." ఇది కాంగ్రెస్ పార్టీ ఎ.ఐ.సి.సి. మ్యానిఫెస్టోలో చెప్పింది. కానీ రాష్ట్రాలకు వచ్చేసరికి దానికి భిన్నంగా ఇక్కడ కార్పొరేషన్ను విభజించడాన్ని నేరంగాను, కార్పొరేషన్ను నష్టాల బారి నుంచి తప్పించి లాభాల పంథాలో నడిపి మేలైన సౌకర్యాలు కల్పించాలన్న నిర్ణయం తప్పుగాను చెప్పారు. మరి ఈ రోజున 18 లక్షల పైచిలుకు అగ్రికల్చరల్ పంపుసెట్లు ఈ రాష్ట్రంలో

వున్నాయి. కేవలం నామమాత్రపు రేటుకు విద్యుచ్ఛక్తి సరఫరా చేస్తున్నాము. మనకు ఉత్పత్తి అవుతున్న విద్యుచ్ఛక్తి సరిపోక బయట రాష్ట్రాల నుంచి కొనుక్కుని కూడా తక్కువ ధరకు సబ్సిడీ మీద సప్లై చేయగలుగుతున్నాము. విద్యుత్ మండలి మీద పెనుభారం పడి నిర్వీర్యం అయి మూసివేసే పరిస్థితి వచ్చినప్పుడు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకున్న ఫలితంగా టైం టు టైం మానిటర్ చేసిన పర్యవసానంగా ఈ రోజున 9 గంటలు ఖచ్చితమైన విద్యుత్‌ను రైతాంగానికి అందించడానికి ప్రభుత్వం నిర్ణయించి అమలు చేసిందని మనవిచేస్తున్నాను. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భాలలో కూడా లాస్ లేకుండా పవర్ రైతాంగానికి అందించడం జరిగింది. గతంలో ఎన్నెన్నో మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా కూడా నెలల తరబడి మార్చకుండా రైతాంగం ఇబ్బందులను ఎదుర్కొన్న సందర్భాన్ని గుర్తు చేస్తున్నాను. ఆ పరిస్థితి రాకుండా వుండడం కోసం ఖచ్చితమైన సమయాలలో

(సి పార్టీ నుంచి అంతరాయం)

కళ్ళు వుండి చూడలేని వాళ్ళకు, చెవులు వుండి వినలేని వాళ్ళకు ఏమీ చెప్పలేము. ఎందుకంటే కళ్ళు వుండి కనపడనట్లు నటించే వారికి, చెవులు వుండి వినపడనట్లు నటించే వారికి ఏమీ చెప్పలేము. కళ్ళకు కట్టినట్లు రైతాంగానికి కనిపిస్తూ వుండడంతో ఈ రోజున శాసన సభకు మనందరిని ఎన్నిక చేసి పంపించారు.

(అధికార పక్షం నుంచి చప్పట్లు)

అడిగిన వాళ్ళకంతా కరెంటు ఇచ్చేస్తాము, బకాయిలు చెల్లించవలసిన అవసరం లేదు, బోర్డును మూసివేయించి అంధకారంలో రాష్ట్రాన్ని వుంచుతామని అంటే ఈ రాష్ట్రాన్ని భగవంతుడే రక్షించాలి.

(కాంగ్రెస్ పార్టీ నుంచి అంతరాయం)

అధ్యక్షా, ఈ రోజు ప్రభుత్వం ఎటు నడిస్తే మనం అటే నడవాలనే విషయాన్ని మిత్రులకు గుర్తుచేస్తున్నాను. ఎందుకంటే మనం బావిలో కప్పలాగా వుండిపోతే ఎక్కడ వున్న వాళ్ళు అక్కడే వుండిపోతాము. స్వాతంత్రం వచ్చి 52 సంవత్సరాలు అయినా కూడా పేదరికాన్ని తొలగించుకోలేక అవినీతిని అరికట్టలేకపోతున్నందుకు సిగ్గుతో తలవంచుకోవలసివచ్చింది. అవినీతి విషయంలో ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో మనం వున్నామంటే ఇక ఎక్కడ వున్నామో ఆలోచించండి. దానికి సరైన నిర్ణయాలు చేయవలసిన కఠిన సమయం ఆసన్నమయిందని మనవిచేస్తున్నాను. ప్రతిపక్షం అని కాదు, అధికారపక్షం అని కాదు, అందరికి నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇవాళ కొంచెము ఇబ్బందికరమైనా సరే కొన్ని నగ్న సత్యాలను మనం మాట్లాడుకోవలసిన అవసరం వున్నది. ఎన్నికలలో పోటీ చేసి గెలిచి శాసన

సభకు వచ్చాము. ఎంత ఖర్చును చూపిస్తున్నాము. ఎంత ఖర్చు అవుతున్నది అనేది ఒకసారి ఆలోచించాలని నేను మనవిచేస్తున్నాను. రిఫార్మ్స్ రావలనే విషయం నేను
9.50 ఉ. మనవి చేస్తున్నాను. ఎన్నికలలో రిఫార్మ్స్ రావలసిన అవసరం ఎంతయినా వుంది అడ్మినిస్ట్రేషన్‌లో పాతుకుపోయిన అవినీతిని అరికట్టినప్పుడే ఈ దేశంలో ఏ కార్యక్రమమైనా ముందుకు నాగుతుందని మనవిచేస్తున్నాను. మా మిత్రులు చెబుతున్నారు. 31.3.99 నాడు విద్యుత్ రంగంలో, పబ్లిక్ సెక్టార్‌లో 5362 మెగావాట్ల విద్యుచ్ఛక్తి, ప్రైవేట్ సెక్టార్‌లో 292.40 మెగావాట్లు, సెంట్రల్ సెక్టార్‌లలో 885 మెగావాట్లు, మొత్తం కలిపి 6539 మెగావాట్ల యిన్‌స్టాల్డ్ కెపాసిటీ మనకు వుండగా, డిమాండ్ 5000 మెగావాట్ల దిల్లర వుంది. అక్టోబర్ 31 నాటికి స్టేట్ సెక్టార్‌లో పవర్ యిన్‌స్టాల్డ్ కెపాసిటీ 5612 మెగావాటు కాగా, ప్రభుత్వం తరపున 250 మెగావాట్లు, ప్రైవేట్ సెక్టార్‌లో 583.93 మెగావాట్లు, అదేవిధంగా సెంట్రల్ సెక్టార్ నుండి ఏమీ రాలేదు. మన రాష్ట్రానికే యిన్‌స్టాల్డ్ కెపాసిటీ 601 మెగావాట్లు అదనంగా వచ్చింది. 5022 మెగావాట్లవరకు వున్న డిమాండ్ 6318 మెగావాట్లకు పెరిగిపోయింది. పర్ క్యాపిటా కంజమ్షన్ గతంలో 350 కెడబ్ల్యుహెచ్ నుండి 363 కెడబ్లుహెచ్ వరకు వుండగా నేడు 570 కెడబ్ల్యుహెచ్‌కి పెరిగింది. విద్యుదుత్పాదన అదనంగా ఎంత అవసరమో ఒక్కసారి ఆలోచించవలసిందిగా కోరుతున్నాను. ఈ రంగంలో ఎంతచేసినా యింకా చేయవలసింది ఎంతో వుంటుంది. ఈరోజు రాష్ట్రప్రభుత్వం తీసుక్ను నిర్ణయం ఫలితంగా 5,94,420 సికెయం నుండి 6,19,495 సికెయం వరకు లైన్స్ పెంచడం జరిగింది. అదేవిధంగా సబ్‌స్టేషన్స్‌ను 1683 నుండి 1944కి పెంచడం జరిగింది. అంటే 261 సబ్‌స్టేషన్స్‌ను తక్కువ సమయంలో పెంచడం జరిగింది. అదే విధంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను స్వల్పకాలంలోనే పెంచడం జరిగింది. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్‌ను 30,600 కలుకొని పవర్‌ను స్ట్రెంగ్తెన్ చేయడం జరిగిందని తమ ద్వారా మనవిచేస్తున్నాను.

విద్యుచ్ఛక్తిని అదనంగా యిస్తామని చెప్పేముందు, వాగ్దానాలు చేసేముందు మనకున్న సప్లయ్, డిమాండ్‌లను దృష్టిలో వుంచుకొని, మనకున్న వనరులను దృష్టిలో వుంచుకొని కార్యక్రమాలను చేయవలసి వుంటుంది. అప్పుడే కార్యక్రమం అనుకున్న విధంగా విజయవంతమవుతుందని ఈ సందర్భంగా మనవిచేస్తున్నాను.

రేషన్ కార్డుల విషయం తీసుకుందాము. అందరికి రేషన్ కార్డ్సు అంటున్నాము. రేషన్ కార్డ్సు విషయంలో వున్న లోపాలను గురించి మనందరికీ తెలుసు. నిరుపేదల కోసం పెట్టిన ఈ రేషన్ కార్డులకు సంబంధించి ఫలితాలు నిరుపేదలకు పూర్తిగా అందకుండా చాలాచోట్ల దుర్వినియోగం అవుతున్న విషయం మనందరికీ తెలుసు. కానీ కొన్ని రాజకీయ కారణాల వల్ల అధికార పక్షం కానివ్వండి, ప్రతిపక్షాలు కానివ్వండి అందుకు సిద్ధం కావడంలేదు. ఏ నిరుపేదల కోసం అయితే తెల్ల రేషన్ కార్డులను ప్రవేశపెట్టామో అవి సద్వినియోగం కాకుండా తద్భిన్నంగా జరుగుతోంది. ఈ రాష్ట్రంలో లెక్కల ప్రకారం చూసినప్పుడు తక్కువ సంఖ్యలో వుండవలసిన కార్డ్సు యిప్పటికే ఒక కోటీ 26 లక్షలు

వున్నాయి. అయినా యింకా కార్డ్స్ అందవలసిన వారు చాలా మందే వున్నారు. దీన్ని సమూలంగా మార్చవలసిన అవసరం ఏర్పడిందని తమద్వారా మనవిచేస్తున్నాను.

ఈనాడు సబ్సిడీల భారం పెనుభారంగా మారింది. రేషన్ కార్డులపై సబ్సిడీ ప్రభుత్వానికి పెనుభారంగా వుంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నందున ప్రతివారూ రేషన్ కార్డులు కావాలని కోరుతున్నారు. దీన్ని సరిదిద్దాలంటే ఈ దేశంలోనే ఒక మార్పురావలసిన అవసరం వుంది. మల్టీపర్పస్ ఇడెంటిటీ కార్డ్స్ రావలసిన అవసరం వుంది. నేడు ప్రతిఒక్కరు రేషన్ కార్డుల గురించి ప్రయత్నిస్తున్నారు. ప్రతి అవసరానికి రేషన్ కార్డు కావాలని అడుగుతున్నందున ఈ పరిస్థితి ఏర్పడింది. వున్నవారు, లేనివారు తెల్ల కార్డులకోసం ఎగబడడంవల్ల సమస్య జటిలమౌతోంది. దీన్ని తగ్గించడం కోసం 'అమెరికన్ సోషల్ సెక్యూరిటీ కార్డ్స్' టైపులో ఐడెంటిటీ కార్డులు పెట్టి, రేషన్ కార్డులను డిలింక్ చేసినప్పుడు మాత్రమే అందులోని లోటుపాట్లను సరిదిద్దుకోగలమని తమద్వారా మనవిచేస్తున్నాను.

పవర్ సెక్టార్‌లో కానివ్వండి, యితర రంగాల్లో కానివ్వండి మనం చేసిన అభివృద్ధి అందరికీ తెలుసు. జన్మభూమి కార్యక్రమం ద్వారా మనం చేసిన ఎఛీవ్‌మెంట్స్ తమకు కూడా తెలుసు. కొందరు ప్రతి దాన్ని విమర్శించేస్వభావం కలిగి వుంటారు. నీటితీరువా సంఘాలను ఏర్పాటు చేసినప్పుడు తెలుగుదేశం పార్టీ వారి జేబులు నింపడం కోసం ఏర్పాటు చేసినట్లుగా ఆరోపణలు చేశారు. అవే నీటితీరువా సంఘాలు ప్రతి పైసా సద్వినియోగం చేస్తూ మురుగు కాల్వలను కానివ్వండి, పంట కాల్వలను కానివ్వండి సక్రమంగా త్రవ్వినందున 10 లక్షల ఎకరాల భూమికి అదనంగా సాగునీరు అందించగలగడం, తద్వారా అధిక దిగుబడి రావడానికి కారకులు కావడం జరిగిందని తమద్వారా మనవి చేస్తున్నాను. భారతదేశం మొత్తంలోనే ఈ విధానం ఆదర్శవంతంగా వుందని, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలవారు యిక్కడికి వచ్చి మన విధానాలను పరిశీలించి, వారి రాష్ట్రాలలో కూడా ఇదేమాదిరి నీటితీరువా సంఘాలను ప్రవేశపెట్టడానికి ముందుకువచ్చారంటే, యిది ఎంతటి ఆదర్శవంతమైన విధానమో ఆలోచించవలసిందిగా మనవిచేస్తున్నాను.

అడవులు నరికివేయబడి, నీటివనరులు అడగంటి మనం ఎడారుల పాలు అవుతున్నందున, అలా కాకుండా వృక్షసంపదను పెంపొందించాలనే వుద్దేశంతో వనసంరక్షణ సమితులను ప్రవేశపెట్టడం జరిగింది. ఈనాడు ఈ వనసంరక్షణ సమితుల్లో లక్షలాదిమందిని యిన్‌వాల్వ్ చేసినందున కోట్లాది మొక్కలను నాటి ఈ రాష్ట్రాన్ని సశ్యశ్యామలం చేయడానికి మార్గం సుగమం చేయడం జరిగింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం దేశమంతటా ప్రశంశాపాత్రమైనదని తమ ద్వారా మనవిచేస్తున్నాను. 'జన్మభూమి' కార్యక్రమం గురించి ఎన్నికల సందర్భంగా విమర్శలు చేసినవారికి ఒక విషయం మనవిచేస్తున్నాను. జనవరి 1997 నుండి మే 1999 వరకు జన్మభూమి కార్యక్రమం ద్వారా 58,753 వార్డ్స్, హ్యాబిటేషన్స్ కవర్ చేయడం జరిగింది.

1371 టీమ్స్‌ను కాన్స్టిట్యూట్ చేసి 53,605 గ్రామసభలను పెట్టి కొన్ని నిర్ణయాలు చేయడం జరిగింది. అనేక పశువైద్య శిబిరాలను, ఆరోగ్య శిబిరాలను పెట్టడం జరిగింది. ఈ శిబిరాల ద్వారా పేదవారిని ఆదుకొని వారికి సౌకర్యాలను కల్పించడం జరిగింది.

గతంలో పెన్షన్స్ యిచ్చేటప్పుడు ఎన్నో అవకతవకలు జరగేవి. మహిళా జన్మభూమి 'కార్యక్రమం సందర్భంగా గ్రామసభలు పెట్టి వితంతు పెన్షన్స్, వృద్ధాప్యపు పెన్షన్స్‌ను అక్కడికక్కడే ప్రజల సమక్షంలో యివ్వడం వల్ల నిజమైన పేదవారికి, నిజమైన లబ్ధిదారులకు ప్రజల సమక్షంలోనే న్యాయం చేసినట్లయింది. గతంలో జరిగిన లోటుపాట్లను సరిదిద్దడం జరిగిందని తమద్వారా మనవిచేస్తున్నాను. అనేక కార్యక్రమాలను మనం అర్గనైజ్ చేస్తున్నాము. ఈరోజు ఈ రాష్ట్రంలో ప్రతిఒక్క కార్యక్రమం వినూత్నంగా సాగుతోంది. ఇతర రాష్ట్రాల వారు మన రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాలను గురించి ఆలోచిస్తున్నారు.

టెక్నాలజీ విషయంలో భారతదేశం మొత్తంలోనే అగ్రగామిగా మన రాష్ట్రం నిలబడింది. మన రాష్ట్రంలో మనకున్న భూవనరులను వినియోగించి, యిన్ఫర్మేషన్ టెక్నాలజీ, యితర రంగాలకు భూమిని కేటాయించి, కొంతమంది కబంధహస్తాలలోకి పోతున్న భూములను దోపిడీ దారులనుండి రక్షించి, ఆ భూములను సద్వినియోగం చేసుకోగలిగాము. అందువల్లనే అనేక సంస్థలు ఈ రాష్ట్రంలో ఏర్పడుతున్నాయి. టెక్నాలజీని అభివృద్ధి చేసిన పర్యవసానంగా పొరుగుదేశాలకు పోతున్న మన బిడ్డలు, ఉద్యోగులు అక్కడికి పోకుండా యిక్కడే మెరుగైన జీవితం గడపడం కోసం ఆలోచించే అవకాశం లభించింది. ఇప్పటికే విదేశాలకు పొయ్యేవారు పోవాలను కున్నవారు వెనుదిరుగు తున్నారు. పొరుగుదేశాలకు వెళ్ళడంకంటే మన రాష్ట్రంలోనే తమ మేధస్సును ఉపయోగించి తగిన జీతభత్యాలను పొందవచ్చుననే ఆలోచన ఏర్పడుతోంది. ఇతర దేశాలకు వెళ్ళిన వారు కూడా మన రాష్ట్రానికి తరలివస్తున్నారు. ఈ రాష్ట్రంవైపు ప్రతిఒక్కరూ కళ్ళెత్తిచూస్తున్నారు. అనేక మంది మన రాష్ట్రాన్ని పొగుడుతున్నారు. వాజ్‌పాయిగారు, అద్వానీగారు, దిగ్విజయ్‌సింగ్ గారు, బెనర్జీగారు, యస్.యం. కృష్ణ మొదలైనవారు ఈ రాష్ట్రంలో జరుగుతున్న కార్యక్రమాలను గమనించి, ముఖ్యమంత్రిగారిని, ఈ పథకాలను ప్రశంశిస్తున్నారు.

(అధికార పార్టీ సభ్యులనుండి చప్పట్లు)

పార్టీలకు అతీతంగా కన్‌స్ట్రక్టివ్ క్రిటిసిజం వుండాలని ఆశిస్తున్నాము. నిర్మాణాత్మకమైన విమర్శనలను చేయమనండి. వాటిని సవినయంగా స్వీకరించడానికి, ఈ రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోవడానికి సిద్ధంగా వున్నాము. గతంలో ప్రతిపక్షాలు చెప్పింది వినవలసిన అవసరం లేదనే అభిప్రాయంతో అధికారపక్షం, అధికార పక్షం చేసే ప్రతి పని విమర్శించడమే ధ్యేయంగా ప్రతిపక్షం వ్యవహరించేవి. ఆ విధానం మార్చవలసిన అవసరం

వుంది. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు చేద్దాము. ఆ తరువాత అభివృద్ధి వైపు దృష్టిని సారిద్దాము. అన్ని నియోజక వర్గాలు అభివృద్ధి సాధించే విధంగా పేదరిక నిర్మూలన, నిరక్షరాశ్యత తొలగింపు, అందరికీ ఆరోగ్యం చేకూరే విధంగా, కోరుకున్న విధానాలతో ముందుకు సాగాలంటే సరియైన విధానాలను అవలంబించాలని మనవిచేస్తున్నాను.

10.00 ఉ. అధ్యక్షా, మహాశయా, 1983లో 43 పైసల సబ్సిడీ ఉంటే బియ్యం క్రింద రూ.70 కోట్లు మనకు ఖర్చు అయ్యేది. అదే, 1990లో 174 పైసల సబ్సిడీ ఉంటే రూ.365 కోట్ల 54 లక్షలను మనం భరించేవాళ్ళం. 1998 నాటికి వచ్చేసరికి రూ.3.78 పైసల సబ్సిడీ ఉంటే రూ.712 కోట్ల రూ.ల భారం మన మీద పడింది. ఈ రోజు 6 రూ.ల సబ్సిడీ, రూ.9 ల ఇష్యూ ప్రైజ్ అన్నీ కూడ కలుపుకొని 1100 కోట్ల రూ.ల మన మీద భారం పడుతున్నది. కాబట్టి అనర్హుల దగ్గర నుండి కార్డులను తీసుకొని అర్హులకు ఇచ్చి, సబ్సిడీ భారాన్ని తగ్గించుకోవలసిన అవసరం ఉంది. ధరలు పెరుగుతున్నాయి. గతంలో కూడ పెరిగాయి. కాని పర్యవసానంగానే "రొట్టె విరిగి నేతిలో పడ్డట్టుగా" కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పడిపోయాయి. మన మిత్రులు కొందరు కొన్ని రాష్ట్రాలలో అధికారం సంపాదించుకోగలిగారు. ఆనాడు ఉల్లిపాయలు, చింతపండు ధరలు పెరిగాయి. దానితో ఆనాటి ప్రభుత్వాలన్నీ తలక్రిందులయిపోయాయి. కాని మన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగారు తీసుకున్న కొన్ని కార్యక్రమాల వల్ల ధరలను స్థిరీకరించడం జరిగింది. ఎవరయితే రైతులు పంటలను పండిస్తున్నారో, వారికి గిట్టుబాటు ధర లభించేలా, అదే విధంగా వినియోగదారునికి సకాలంలో తక్కువ ధరలో సరుకులు లభించే విధంగా ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రైతు బజార్లను పెట్టడం జరిగింది. ధరలను స్థిరీకరించడం జరిగింది. ఎంత డబ్బు ఖర్చు అయినా సరే రైతు బజార్లు పెడదాం, మధ్యదళారీలను తొలగిద్దాం, తద్వారా రైతులకు, వినియోగదారులకు లాభం చేకూరుద్దాం ధరలను మేయిన్‌టేయిన్ చేద్దాం అని ముఖ్యమంత్రి రైతు బజార్లను ఏర్పాటు చేశారు. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకొని, రైతుబజార్లను పెట్టబోతున్నది. 100 కోట్ల రూ.లు ఖర్చు అయినా సరే వినియోగదారులకు రక్షణ కల్పించాలనే సదుద్దేశ్యంతో ఈనాడు రైతు బజార్లు నిర్వహించబడుతున్నాయని ఈ సందర్భంగా తెలియచేస్తున్నాను.

ఈ రోజున రాష్ట్ర ప్రభుత్వం బలహీన, బడుగు వర్గాల వారి సంక్షేమ కొరకు ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తున్నది. గతంలో వికలాంగుల గురించి పట్టించుకొనే నాథుడే ఉండేవాడు కాదు. ఏదో డిపార్టుమెంట వాళ్ళు ఇచ్చేవారు. ఎంత ఇచ్చారో, ఎంత అందేదో తెలిసేది కాదు. అయితే ఈ ముఖ్యమంత్రి వారి కోసం ప్రత్యేకంగా క్యాంప్స్ నిర్వహించి, వికలాంగులకు ఎన్నెన్నో సౌకర్యాలు కల్పించడం జరిగింది. వారికి ట్రైసికిల్స్, పెన్షన్స్, క్యాలిపర్స్ ఇచ్చి ఆదుకోవడం జరిగింది. అదే విధంగా బలహీనవర్గాలకు అయితే

"ఆదరణ" పథకం క్రింద, ఆయా చేతి వృత్తుల వారు తమ పనితీరును మెరుగుపరచుకొనేలుగా, వారి పురాతన పనిముట్ల స్థానే కొత్తగా పనిముట్లను అందచేయడం జరిగింది. ఏదయితే ప్రభుత్వం చెప్పిందో దానినే అమలు చేస్తూ వచ్చింది. ఫలితంగానే ఈ రోజు ఫలితం అనుకూలంగా వచ్చింది. తిరిగి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగల్గిందని మీకు తెలియచేస్తున్నాను. అందుకని ఈ రోజు తీసుకున్న నిర్ణయాలు కాని, ఇతర చర్యలు కాని కఠినంగా ఉండవచ్చు కాక. అయితే జరుగుతున్న అక్రమాలను, అవినీతిని అరికట్టి, నిధుల్ని సక్రమంగా వినియోగించుకోగల్గుతున్నామని మనవి చేస్తున్నాను కొన్ని ప్రాంతాల్లో కొంత మంది రాజకీయ నాయకులు కంట్రాక్టర్లతో, అధికారులతో కుమ్మక్కై, 300 శాతం, 400 శాతం పెంపుదలతో టెండర్లు వేసి, మొత్తం ప్రజా ధనాన్ని దోచుకోవడం జరుగుతున్నది. దానిని అరికట్టడం కోసం టెండర్ కమీషనరేట్‌ను పెట్టి, టెండర్ల విధానాన్ని సరైన విధంగా మార్పు చేయడం వల్ల, టెండర్ల విధానంలో చాల మార్పులు జరుగుతున్నాయి. పనిలో నాణ్యత ప్రమాణాల్ని మనం మెరుగుపరచుకోగల్గుతున్నాం.

ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పంథాలో ముందుకు తీసుకొని వెళ్ళే దాంట్లో మనం విఫలం కావడం లేదు. గతంలో తూర్పు గోదావరి జిల్లాలో తుఫాను వస్తే, తెల్లవారేసరికల్లా ముఖ్యమంత్రి అక్కడ ఉన్నారు. 24 గంటలు గడిచే లోపల జిల్లా యంత్రాంగం కాని, ఇతర ఉన్నతాధికారులను గాని రంగంలోకి దింపి, రెండవ రోజు సాయంత్రం కల్లా రహదార్లను మరమ్మతు చేయించి, అక్కడ ఉన్న పరిస్థితులను చక్కదిద్దిన ఘనత దక్కిన ఏకైక ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడు అని మీ ద్వారా మనవి చేస్తున్నాను. తుఫానులో నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం జరిగింది. పంటలు పోగొట్టుకున్న వారికి వెంటనే కావలసిన అన్ని సౌకర్యాలు సమకూర్చడం జరిగింది. అదే విధంగా ఇటీవల తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన ఒరిస్సా రాష్ట్రానికి కూడ భారతదేశంలో ఏ రాష్ట్రం కూడ స్పందించనంతగా మొట్టమొదటగా స్పందించి, మనకున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఉపయోగించుకొని, మనకు ఉన్న విజ్ఞానాన్ని అంతా మిళితం చేసుకొంటూ అక్కడ సహాయ సహకారాలు అందించగలిగాం. మన రాష్ట్ర ముఖ్యమంత్రి మన అధికారులు ఒరిస్సా రాష్ట్రానికి చేస్తున్న సహాయం గురించి శ్లాఘిస్తూ, ఆ రాష్ట్ర దినపత్రికలు సంపాదకీయాలు వ్రాశాయి. మాకు కూడ చంద్రబాబునాయుడులాంటి ముఖ్యమంత్రి ఉంటే బాగుండని వ్రాశాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అధికారులు కూడ అక్కడ రాత్రింబవళ్ళు కష్టపడి సహాయం అందిస్తున్నారు. మన రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. పేరు ప్రఖ్యాతుల గురించి మనం చేయడం లేదు మానవతా దృష్టితో మన పొరుగున ఉన్న రాష్ట్రాన్ని ఆదుకోవాలని, అక్కడి ప్రజలు బాధ పడుతూ ఉంటే చూడలేక సహాయసహకారాలు అందించాలనే ఉద్దేశ్యంతో ఆహారపదార్థాలను అన్ని రాష్ట్రాలకంటే కంటే ముందు మనం పంపించాం, అని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

అదే విధంగా కార్గిల్ పోరాటంలో వీర మరణం పొందిన వారి పట్ల ముఖ్యమంత్రి వెంటనే స్పందించి, వారి కుటుంబాలకు కావలసిన సౌకర్యాలు కల్పించడంలో గాని, నిధుల కేటాయింపులో కాని మొట్టమొదటగా స్పందించిన ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారే. ఆ తరువాతే దేశంలోని మిగతా రాష్ట్రాలు స్పందించి, కొంతవరకు సహాయం అందించగలిగాయి. స్పందించే మనిషి కావాలి. ఎక్కడ ఏ సమస్య ఉన్నా, ముందుగానే తెలుసుకొని పరిష్కారం కొరకు కృషి చేయాలి. ఈవేళ మనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, హైదరాబాద్ నుండే వివిధజిల్లాల కలెక్టర్లతో, ఇతర అధికారులతో సమస్యలను చర్చించి, పరిష్కరించేందుకు ముఖ్యమంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్‌లు పెట్టి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. అవసరం అయితే తగు ఆదేశాలు ఇచ్చి, వెంటనే వాటిని అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతున్నది. కాబట్టి పనికి తగిన గౌరవం, గుర్తింపు ఉండాలని వారియొక్క వినతి. ఈ రోజున రాష్ట్ర ప్రగతి కోసం కష్టపడి పనిచేసే నాయకులున్నారు. తగిన మేధా సంపత్తి కల్గిన ప్రజలు ఉన్నారు. కాబట్టి వారి శక్తి యుక్తులను ఉపయోగించుకొంటూ, రాష్ట్రాన్ని ముందుకు తీసుకొని వెళ్ళుతున్నారు మన ముఖ్యమంత్రి.

హైదరాబాద్ పరిస్థితి ఎంత అధ్వానంగా ఉండేదో మన అందరికీ తెలుసు. మనం గతంలో శాసనసభ్యులుగా ఎన్నికయినా తరువాత పరిస్థితికి, ఇప్పటి పరిస్థితికి ఎంతో తేడా కనిపిస్తున్నది. గతంలో అంతా అపరిశుభ్రత వాతావరణం ఉండేది. అయితే కేవలం ఈ నాలుగు సంవత్సరాలలో హైదరాబాద్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనే విధంగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవడం జరిగింది. ఏ ముఖ్యమంత్రి అయినా వెళ్ళితే మహా ఒకటి రెండు పార్కు విజిట్ చేసి, ఫోటోల కోసం, వీడియో కోసం వెళ్ళి వస్తారు. అయితే ఈ ముఖ్యమంత్రి మాత్రం నేను పనిచేస్తాను మీరు పని చేయండే పద్ధతిలో అధికారులను ప్రోత్సహించడం చేస్తున్నారు. తప్పు జరిగితే మందలించడం చేసే ముఖ్యమంత్రి ఈ రోజు మనకు ఉన్నారు. పనిచేసే ముఖ్యమంత్రి కాబట్టి ప్రజలు తిరిగి మద్దతు ఇచ్చారు. పట్టం కట్టారు. రాబోయే 5 సంవత్సరాలలో కూడ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా మనకు ఉంది....

శ్రీ డి. నాగేందర్ (ఆసిఫ్‌నగర్):- మేడమ్ స్పీకర్, చిన్న క్లారిఫికేషన్....

మేడమ్ స్పీకర్:- మీరు మాట్లాడేటప్పుడు చెప్పండి....ప్లీజ్ టేక్ యువర్ సీట్.

**Sri D. Nagender:-** There is no controversy in it.

**Madam Speaker:-** Under which rule are you raising the Point of Clarification?

(Interruptions)

Yes, what is your Point of Clarification?

శ్రీ డి. నాగేందర్:- మేడమ్ స్పీకర్, బుచ్చయ్యచౌదరిగారు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను ముఖ్యమంత్రి సుందరనగరంగా తీర్చారని చెపుతున్నారు. కాని ప్రజలకు కావలసిన అత్యవసరమైన మంచి నీటిని అందించలేకపోతున్నారు....

మేడమ్ స్పీకర్:- మీకు అవకాశం ఇచ్చినపుడు మాట్లాడండి.

శ్రీ జి. బుచ్చయ్య చౌదరి:- అధ్యక్షా, ఈ రాష్ట్ర ప్రభుత్వం ఒక నూతన దృక్పథంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌లో ఇంకా సౌకర్యాలు కల్పించవలసిన అవసరం చాలా ఉంది. హైదరాబాద్‌కు గోదావరి జలాలు లేక కృష్ణా జలాలు తీసుకొని రావాలా అనేది చర్చించవలసిన అవసరం ఉంది. దానికి సంబంధించి ప్రజాశీక ప్రభుత్వం దగ్గర ఉంది. దానిని అమలు చేయగలిగే శక్తి, సత్తా ఉంది. అవన్నీ ఈ శాసనసభలో చర్చకు వస్తాయి. నాగేందర్ గారు మరి నగరంలో ఉంటారు. మేమయితే
10.10 ఉ. పట్టణాల నుంచి పల్లెల నుంచి వచ్చి చూస్తున్నాము. హైదరాబాదు పరిస్థితి మీరు, మేము కూడా చూస్తున్నాము. మొత్తం భారత దేశంలో ప్రతి ఒక్కరూ చూస్తున్నారు. విదేశాలలోని లక్షలాది మంది తెలుగు సోదరులు చూస్తున్నారు కనుకనే వారు వారి సహాయ సహకారాలు హైదరాబాదుకు అందిస్తున్నారు. ముందుకు వస్తున్నారు. చేయకపోతే ఎవరూ రారు. చూస్తున్నారు కనుకనే అభివృద్ధి కనబడుతోంది కనుకనే, కళ్ళకు కట్టినట్లు కనబడుతోంది కనుకనే వస్తున్నారు. చేసినది కొంతేనని, చేయవలసింది ఎంతో ఉన్నదనే వినమ్రతతో, సహృదయతతో తీసుకుంటున్నాము. నిధులను సద్వినియోగం చేసుకుంటున్నాము. ప్రతి అంగుళం భూమిని వినియోగించుకుంటున్నాం. కనుకనే ఫ్లైఓవర్ ప్రాజెక్టుకు, మీకు తెలుసు, రాష్ట్ర ప్రభుత్వం నిధులేమీ యివ్వలేదు, వృథా అయిపోతున్న భూములను సక్రమంగా వినియోగించుకుంటూ నిధులను సమకూర్చుకుంటున్నాం. గతంలో వెళ్ళడానికి కూడా వీధుల్లో అవకాశం లేదని, రోడ్ల వైడెన్ చేడంలేదని విమర్శించారు. మరి ఈ రోజున ఆ రహదార్లను విశాలం చేశారు. ప్రమాదాలు తగ్గిపోతున్నాయి. వారందరికీ రిహాబిలిటేషన్ చేశారు. అలాగే రాష్ట్రప్రభుత్వం అనేక పథకాలు ప్రారంభించింది.

నూతన దృక్పథంతో ఆపద్బంధు పథకం తీసుకుంది. ఎవరైతే ప్రమాదాలలో మరణిస్తే వారి కుటుంబాలు అష్టకష్టాలూ పడుతున్నాయో వారిని ఆదుకోడానికి ఆపద్బంధు పెట్టారు. 3,086 మంది పెద్దలు మరణించారు. 509 మంది పిల్లలతో కలుపుకుని మొత్తం 3,595 మంది మరణిస్తే, 2,827 మందికి ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. గతంలో ఏమీ లేనిదానికి ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున వారికి అందించగలిగారు. అంటే ఎన్ని వేల కుటుంబాలకు ఆశ్రయం కల్పించి, సరైన విధంగా రక్షణ కల్పించడం జరిగిందో ఆలోచించాలని కోరుతున్నాము. సరైన ఆలోచన చేస్తే తప్ప యిది సాధ్యం కాదని చెప్పడమే నా ఉద్దేశం. ఇమ్మానెమ్మ స్కీము పెట్టింది దానిని సక్రమంగా అందించేలా చేయగలిగారు.

ఇక చివరిగా శాంతిభద్రతల గురించి ఏవేవో చెబుతున్నారు. ఈ సమస్య మన రాష్ట్రంలోనే కాకుండా మొత్తం భారత దేశంలోనే ఉంది. మారుతున్న పరిస్థితులు, వాతావరణాన్ని బట్టి క్రైము రేటు పెరుగుతోంది. అందువల్ల సక్రమమైన విధానాలను అవలంభించాలి. పోలీసు యంత్రాంగం పటిష్టం చేయాలి. వారు సక్రమంగా వ్యవహరించేలా వారి ట్రాన్స్‌ఫర్సు విషయంలో గాని, నియామకాల విషయంలో గాని ఎలాంటి జోక్యం లేకుండా చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆలోచన చేసింది. ఫ్యాక్షనిజం అన్ని పార్టీల నాయకులు ఏ ఏ పార్టీ అని చెప్పను. అందరూ కాకపోయినా కొందరి నాయకుల యిన్‌వాల్వుమెంటు ఉన్నందువల్ల దానిని అరికట్టడానికి శక్తివంతమైన విధానాలన్నీ ఈ రాష్ట్రప్రభుత్వం ఎన్నుకొంది. ఫలితంగా కొన్ని ఫాక్షనిజం ఉన్న జిల్లాలో పరిస్థితులు మారుతున్నాయి. రాబోయే కొద్ది రోజులలో సక్రమమైన విధానాలను అవలంభించబోతున్నాం. ఇప్పటికే ఫ్యాక్షనిజం ఉన్న గ్రామాలను గుర్తు పెట్టుకుని 266 శాంతి సంఘాలను వేసి పరిస్థితులలో మార్పు తీసుకురావడం జరుగుతోంది. నేను మనవి చేసేది. మనం కొట్టుకున్నాం, మన తాతలు కొట్టుకున్నారు. మన బిడ్డలు కూడా కొట్టుకుని ఈ మారణకాండలో బలైపోవడం మంచిది కాదు. ఆస్తుల కోసం, సంపదల కోసం, రాజకీయాల కోసం ఈ కార్యక్రమాలు చేయడం సరైన విధానం కాదు. దీనిని అరికట్టాల్సిన అవసరం ఉంది. మనందరం భాగస్వాములమై ఒక విధానాన్ని రూపకల్పన చేసి, ఈ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. మనకు అన్ని వనరులూ ఉన్నాయి. రాయలసీమలో, తెలంగాణాలో, ఆంధ్రప్రాంతంలో వనరులు ఉన్నాయి. కొన్ని చోట్ల నీరు లేకపోవచ్చు గాని, గనులున్నాయి. వాటితో పరిశ్రమలు స్థాపించవచ్చు. పారిశ్రామికీకరణ చేయవచ్చు. కాని ముందుగా ఈ ఫ్యాక్షనిజం తగ్గినప్పుడే ఈ పారిశ్రామికాభివృద్ధి సాధ్యం అవుతుంది. పారిశ్రామికాభివృద్ధి సాధ్యమైనపుడే ఉద్యోగాల కల్పన సాధ్యమవుతుంది. ఉద్యోగాలు కల్పించినపుడే ఆర్థిక సంపద సమకూరుతుంది. అప్పుడే ముందుకు పోవడం జరుగుతుంది. 1998, 99 సంవత్సరాలను పోల్చుకుంటే, 1998 సెప్టెంబరులో 2145 మర్డర్సు జరిగితే, 99 సెప్టెంబరు నాటికి అవి 1931కి తగ్గాయి. అంటే 9.98 శాతం తగ్గింది. రయటింగ్సు 1998 సెప్టెంబరులో 2877 అయితే 99 నాటికి 2078 కి తగ్గాయి. అంటే 27.77 కి తగ్గాయి. 98లో డెకాయిటీస్ 384 ఉంటే 99 సెప్టెంబరుకు 211 కు తగ్గి 45.05 శాతానికి తగ్గింది. రాబరీస్ 623 నుంచి 540 కి తగ్గింది. అంటే 13.32 శాతం తక్కువ. మరి 'రేప్స్'. మాత్రం పెరిగిపోతున్నాయి. 98లో 607 అయితే 99 నాటికి 678కి పెరిగిపోయాయి. దీనిని తగ్గించడానికి మనం కొన్ని చర్యలు చేపడుతున్నాం. మారుతున్న పరిస్థితులు, అలవాట్లనుబట్టి అత్యాచారాలు పెరిగి పోతున్నాయి. భారతదేశంలో అన్ని రాష్ట్రాలలోనూ పెరిగిపోతున్నాయి. కనుకనే మహిళలపై చేసే వారికి ఉరి శిక్ష విధించాలని తెలుగుదేశం ప్రభుత్వం నిర్ణయించి, కేంద్రానికి సజెస్టు చేసింది. మహిళలకు సరైన రక్షణ కల్పించాలన్నదే తెలుగు దేశం ప్రభుత్వం యొక్క విధానం. అందుకే పోలీసు యంత్రాంగాన్ని నీతివంతంగా మార్చవలసిన అవసరం ఉంది. ఎక్కడైతే కొన్ని శాఖలకు నియామకాలు చేస్తున్నామో అక్కడ అవినీతిపరులైన అధికారులను నియమిస్తే అక్కడ సక్రమంగా నడిచే అవకాశం లేదు. రాజకీయ పెత్తందార్లు పలుకుబడి ఉపయోగిస్తే పర్యవసానంగా వచ్చే అధికారుల వల్ల అక్రమాలకు అడ్డు లేకుండా

పోతున్నది. కొన్ని నియామకాలలో స్థిర చిత్తంతో మంచి అధికారులను, నీతివంతులైన వారిని వేయగలిగితే శాంతిభద్రతలు సార్థకమవుతాయి. యాంటీ కరప్షనుబ్యూరో, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంటు, సివిల్‌సప్లయిస్ విజిలెన్సు, విజిలెన్సు సెల్ వీటన్నింటినీ సక్రమంగా నడపడానికి సక్రమమైన అధికారులను వేయాలి. పలుకుబడితో అధికారులను వేస్తే వారింకా లంచగొండులుగా మారి అవినీతిని పెంచుతున్నారు. ఎలాంటి రాజకీయ వత్తిడులకు లొంగకుండా సరైన అధికారులను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రిగారికి, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. అవినీతి జాడ్యం పోయినపుడే ప్రగతి సాధ్యం అవుతుంది కనుక సరైన అధికారులను నియమించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంటుందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

గతంలో విధినిర్వహణలో ఎవరైనా చనిపోతే సరైన రక్షణ ఉండేది కాదు. తమ కుటుంబాలకు ఏమైపోతుందోనని, తమ బిడ్డల భవిష్యత్తు ఏమవుతుందోనని అంటే ముట్టినట్టుగా వారు గడిపేవారు. కాని ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వం విధినిర్వహణలో అసువులు బాసిన ఉద్యోగుల కోసం భారీ ఎత్తున కార్యక్రమాలు తీసుకుంది. లక్షలాది రూపాయలు వారికి అందించడమే కాకుండా, వారి కుటుంబాలకు ఉద్యోగ కల్పన గాని, గృహనిర్మాణం గాని చేసి యివ్వడం వల్ల వారు నీతి నిజాయితీలతో యింకా ముందుకు వస్తున్నారు.

రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా సాగుతోంది. ప్రతిదానికీ రాజకీయం పులిమి, ప్రతి దానిని దుర్వినియోగం చేసే విధానాలకు భిన్నంగా పారదర్శకంగా, కౌన్సిలింగ్ విధానాలు చేపట్టి సరైన వారికి ప్రోత్సాహం కల్పించాలనే ఆలోచనతో చేస్తోంది. అనుకనే మనం తీసుకునే నిర్ణయాలు రాష్ట్రంలోనే కాక మొత్తం భారతదేశంలోనే అనేక రాష్ట్రాలకు మార్గదర్శకం అవుతోంది. ఎవరు చూసినా ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తున్నారు. వస్తున్నారు. విదేశీ రాయబారులు చెబుతున్నారు – యిక్కడ సరైన వనరులున్నాయని సరైన పరిస్థితులున్నాయని ఇక్కడ దృష్టి సారిస్తే బాగుంటుందని.. అయితే మనకున్నదల్లా ఒకే ఒక యిబ్బంది. పవర్ సెక్టారులో తీసుకున్న కార్యక్రమాలు రాబోయే కొద్ది రోజులలో ఫలితాలు యిస్తే, పవరు సప్లయి సక్రమంగా చేసి, మౌలిక సదుపాయాలు ఏర్పడిన రోజున తప్పకుండా యిప్పటికే వస్తున్న విధంగా భారీ ఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి వస్తాయి. ఇప్పటికే కోట్ల రూపాయలు పెట్టించడానికి సిద్ధంగా ఉండి, సంప్రదింపులు చేస్తున్నారు. మనం పారిశ్రామికంగా భారతదేశంలో అగ్రస్థానం చేరుకోగలిగాం. గతంలో కంటే యిప్పుడు మార్పు బాగా జరిగింది. 22–21 స్థానాల నుంచి ముందుకు వచ్చాం. ఇంకా ముందుకు పోయి నెంబరు వన్ స్థానానికి చేరుకోగలుగుతాము. ఇప్పటికే టెక్నాలజీ రంగంలో నెంబరు వన్ స్థానంలో ఉన్నాము. పారిశ్రామిక రంగంలో కూడా ఎదగడానికి అవకాశాలు చాలా ఉన్నాయి. ఈరోజు మరొకసారి చెబుతున్నాను. వాగ్దానాలు చేసేటప్పుడు

ఆలోచించి చేయండి. అమలు చేయలేని వాగ్దానాలు, అసాధ్యమైనవాటి విషయంలో ఆలోచించండి. అన్నీ అసాధ్యమనుకుంటే పనులు కూడా కావు. కాని సాధ్యమైనవి ఆలోచన చేసి నిర్ణయాలు చేయవలసిందిగా మనవి చేస్తూ, ఈరోజు గవర్నరుగారి ప్రసంగం భవిష్యత్తు దిక్సూచిగా సాగిందని మనవి చేస్తున్నాను. వారి ప్రసంగంలో అనేక మౌలికమైన సమస్యల పరిష్కారానికి ప్రజల యొక్క భాగస్వామ్యం, మహిళాభ్యుదయం, గ్రామీణాభివృద్ధి మొదలైన అంశాలు ప్రస్తావించడం జరిగింది. అంకెల గారడీ కాకుండా యదార్థ పరిస్థితులలో కార్యక్రమాలు చేపట్టడానికి ప్రయత్నం జరిగిందని భావిస్తున్నాను. సభలో ప్రవేశించిన నూతన సభ్యులందరూ తమ వాగ్ధాటితో, తమ అనుభవంతో, సీనియర్ల అనుభవాన్ని తీసుకుని రాష్ట్రప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయగలరని, మంచి విధానాలతో సభను నడిపించగలరని ఆశిస్తున్నాను. మైకులు విరగ్గొట్టే విధానం కాదు.
10.20 ఉ. చెప్పడానికి ఒక విధానం ఉంటుంది. అమలు చేయడానికి ఒక విధానం ఉంటుంది. ఇవన్నీ రాష్ట్ర శాసనసభ ద్వారా సక్రమంగా వినియోగించుకొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు స్పందించి వాటి పరిష్కార మార్గం ఆలోచించేదానికి వీలుంటుందని మీద్వారా మనవిచేస్తున్నాను. శాసనసభ చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికయిన శ్రీమతి ప్రతిభాభారతి గారికి మరొకసారి నా ధన్యవాదాలు తెలియజేస్తూ నాకు ఈ అవకాశం కల్పించిన ప్రియతమ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సహాయ సహకారాలు బాగానే వున్నాయి. దీపం పథకానికి సంబంధించి ఎన్ని అవాంతరాలు ఎదురయినా ఎన్ని అపవాదులు వచ్చినా ఇవన్నీ వట్టిమాటలే అని చెప్పిన వారికి కనువిప్పు కలిగేలా కేంద్రప్రభుత్వం మన ప్రభుత్వంతో సహకరించడం జరిగింది. కేంద్రానికి మనం మద్దతు ఇస్తున్నామంటే అది సిద్ధాంతపరంగా మద్దతు ఇస్తున్నాము. రాష్ట్రానికి అవసరమయిన సౌకర్యాలు పొందడానికి ప్రయత్నం చేస్తున్నాము. అంతేకానీ బెదిరించి బ్లాక్‌మెయిల్ చేసి కేంద్రంపై వత్తిడి తెచ్చే పద్ధతి కాకుండా ఉదారంగా మద్దతు ఇచ్చి రాష్ట్రానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి, రాష్ట్రానికి రావలసిన హక్కులను సక్రమంగా సాధించడానికి ప్రయత్నం చేస్తున్నాము తప్ప అవసరం వస్తే మద్దతు ఉపసంహరించుకొంటామనీ, మీ ప్రభుత్వాన్ని కూలదోస్తామనే కొన్ని పార్టీల నాయకత్వం మాదిరిగా కాదు. స్థిరమయిన విధానంలో జాతి పటుత్వంగా సక్రమంగా ఉండాలనీ, భారతదేశం ఐకమత్యంగా ఉండాలనీ, దేశ సార్వభౌమాధికారం కాపాడబడాలనేదే ఇందులో ప్రధానోద్దేశ్యం. ఏకపార్టీ యూనియన్ ప్రభుత్వాలకు కాలం చెల్లి అన్ని రాష్ట్రాలు సమైక్యభావంతో అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఒకేమాట మీద ప్రభుత్వం నడపడానికి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం జరుగుతుంది. కానీ బ్లాక్‌మెయిల రాజకీయాలతో ప్రభుత్వాలను దెబ్బ తీయడం కాదనేది మనకు నిరూపించబడిన సత్యం. భారతీయ జనతా పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి ఇదే కారణం. ఎవరయితే డీ స్టెబిలైజ్ చేయడానికి ప్రయత్నం చేస్తారో ఆ పార్టీలకు కనువిప్పు కలిగేలా తిరస్కారం లభించడం జాతీయ

సమైక్యతకు శుభసూచకం అని తెలియజేస్తూ, ఈ తీర్మానానికి మద్దతు పలుకవలసినదిగా గౌరవసభ్యులందరినీ కోరుతూ ఈ అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రిగారికి తమకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ మీదగ్గర సెలవు తీసుకొంటున్నాను. జై జన్మభూమి.

శ్రీ ఎస్. చంద్రమోహన్ రెడ్డి:- అధ్యక్షా, ఈరోజు గవర్నరుగారి ప్రసంగంపై బుచ్చయ్య చౌదరిగారు ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తూ 11 వ శాసనసభలోని సభ్యులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను. ప్రజాస్వామిక చరిత్రలో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం చారిత్రాత్మకమైంది. ఈ విజయం రాష్ట్రప్రజల యొక్క ఉన్నతమయిన ఆలోచనలకు, ధోరణికి అద్దం పడుతుందని మనవి చేస్తున్నాను. ఏ నాయకత్వం అయితే ప్రజల సమస్యల పరిష్కారం కోసం, వారి భవిష్యత్తు కోసం ఈ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం రాత్రనక పగలనక పనిచేసి దేశ విదేశాల వారు కూడా ఏ నాయకత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్ని పార్టీల నాయకులు ఆలోచిస్తున్నారో అటువంటి నాయకుని యొక్క కృషి ఫలితంగా ఈరోజు పాజిటివ్ వోటు ద్వారా ఈ రాష్ట్ర ప్రజలు తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఎన్నుకొన్నారు. నిత్య శ్రామికుడుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు పేరు తెచ్చుకొన్నారు. నాలుగున్నర సంవత్సరాలు అవిరామంగా కృషి చేశారు. ముఖ్యమంత్రి అంటే ఎసి రూములలో కూర్చొని ఎక్కడో విపత్తు జరిగితే వారంరోజుల తరువాత హెలికాప్టర్‌తో వెళ్లి పరామర్శించే పద్ధతికి భిన్నంగా వచ్చిన ఫైల్స్ మీద సంతకం చేసి బాధ్యత తీరిపోయిందనే పరిస్థితులకు భిన్నంగా ఆడంబరాలకు, ఆరాటాలకు దూరంగా మనకు ప్రజలు పట్టం కట్టింది వారి బాగోగులు చూచేదానికి తప్ప స్వంత కార్యక్రమాలు, సత్కారాలు చేసుకొనే దానికి కాదని రుజువు చేసిన చంద్రబాబు నాయుడుగారి నాయకత్వంలో ప్రజలు పనిచేసే వారికి అండగా వుంటామని తీర్పు ఇవ్వడం జరిగింది. రాష్ట్రంలోని ఎన్నికల కొరకు ఇతర రాష్ట్రాలవారే కాక విదేశాల వారు కూడా వేచి చూచారు. నిజంగా ఈరోజు రాష్ట్ర ప్రజల తీర్పు చాలా ఆదర్శవంతమైంది. ఇది ఒక స్ఫూర్తి దాయకమైంది. మిగతా రాష్ట్రాల వారికి కూడా ఎవరయితే కష్టపడి పనిచేస్తారో వారికి తప్పకుండా ఫలితం ఉంటుందనే ధైర్యాన్ని ఇచ్చింది. ఈరోజు అనేకమంది చంద్రబాబు నాయుడుగారి పనితీరును ప్రశంసిస్తున్నారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి దిగ్విజయ్ సింగ్ దగ్గర నుండి మాధవరావు సింధియా దగ్గర నుండి శరద్‌పవార్, జైరామ్ రమేష్, కర్నాటక ముఖ్యమంత్రి టి.ఎస్. కృష్ణ వరకూ, ఇప్పుడు పత్రికలలో చూస్తే మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావు దేశ్‌ముఖ్ కూడా ఐ.టి. రంగంలో చంద్రబాబు గారి సహాయం తీసుకొంటాననీ, తాను కూడా ఒక సంవత్సరం వరకు రాజకీయాలు మాట్లాడనని, చంద్రబాబునాయుడు గారిని ఆదర్శంగా తీసుకొంటానని మాట్లాడిన విషయం ఈరోజు పత్రికలలో వచ్చిందని తమద్వారా ఈ సభకు గుర్తు చేస్తున్నాను. మచ్చలేని మహోన్నత మయిన వ్యక్తిగా పేరు తెచ్చుకొన్న ప్రధానమంత్రి వాజ్‌పాయ్‌గారు కూడా

ముఖ్యమంత్రిగారి పనితీరును గురించి ప్రశంసించిన విషయాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఒక్క మ్యాగజైన్ కాదు, భారతదేశంలోని అనేక మ్యాగజైన్స్ ముఖ్యమంత్రిగారి పనితీరును ప్రశంసించిన విషయం కూడా ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఇవన్నీ నేను మాపార్టీ కాబట్టి మానాయకుడు కాబట్టి గొప్పగా చెప్పడం కాదు. కాంగ్రెస్, బిజెపి నాయకులు చెప్పిన మాటలను కూడా ఈ సభలోని అందరి దృష్టికి తెస్తున్నాను. ఎవరయినా ప్రజా సమస్యలు పట్టించుకొనే ప్రభుత్వానికే పట్టం కడతారనేది రుజువయిన సత్యం. ఆనాడు ఎన్.టి. రామారావుగారు ఆంధ్రుల ఆత్మగౌరావాన్ని జాతీయస్థాయిలో గుర్తింపు తెస్తే, ఈరోజు అంతర్జాతీయ స్థాయిలో ఆంధ్రుల సమర్థతకు, ఆత్మవిశ్వాసానికి గుర్తింపు తెచ్చిన వ్యక్తి చంద్రబాబు నాయుడుగారు అని మనవిచేస్తున్నాను. రాష్ట్రంలో అనేక ప్రజాసమస్యలు వస్తాయి. వాటి పరిష్కారానికి స్పందించిన తీరే ఈరోజు ప్రభుత్వ విజయానికి కారణం అని మనవిచేస్తున్నాము. ఎప్పుడయినా గతంలో సైక్లోన్ వస్తే అధికారులు 2, 3 రోజుల తరువాత పోతే, మంత్రులు, ముఖ్యమంత్రులు వెళ్లేప్పటికి అక్కడ ఏమీ మిగలని పరిస్థితిలో పరామర్శించే రోజులు వెళ్లి అధికారుల కంటే, ప్రజా ప్రతి నిధుల కంటే ముఖ్యమంత్రి తానే స్వయంగా హెలీకాప్టర్‌లో సైక్లోన్ ప్రాంతాన్ని సందర్శించిన సందర్భాలు అనేకం వున్నాయని మనవి చేస్తున్నాను. అందుకే ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగారు పనిచేసే తీరు చూచిన తరువాత అధికార యంత్రాంగంలో కూడా పూర్తి మార్పు వచ్చింది. ప్రజా ప్రతినిధులలో మార్పు వచ్చింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక ప్రజా కార్యక్రమాలు ప్రజల వద్దకే వెళ్లి చేసే పరిస్థితులు మొట్టమొదటిసారిగా ఆంధ్రరాష్ట్రంలో వచ్చాయి. ప్రజల వద్దకు పాలన అనేది

10.30 ఉ. మొట్టమొదటికార్యక్రమం. జన్మభూమి, రెవిన్యూ సదస్సులు, ఫైల్ క్లియరెన్స్ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. గతంలో అనేక మంది ముఖ్యమంత్రులు వచ్చారు, అనేక ప్రభుత్వాలు వచ్చాయి. కాని వాటిని గురించి ఎవరూ కూడా ఆలోచించిన సందర్భాలు లేవు. జన్మభూమి కార్యక్రమంలో మొట్టమొదటిసారిగా ప్రజలు కోరుకున్న పనులకు ప్రజలకు అవసరమైన పనులకు మధ్య దళారీలు లేకుండా, కాంట్రాక్టర్ల జోక్యం లేకుండా మంజూరు ఇచ్చి డబ్బులు ఇచ్చిన మహత్తరమైన కార్యక్రమం జన్మభూమి కార్యక్రమం. ఈరాష్ట్రంలో దాదాపు ఒకటిన్నర సంవత్సరాల కాలంలో రు.1500.00 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఇవన్నీ కూడా రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, ఆఫీసులలో కూర్చుని నిర్ణయించిన పనులు కావు. గ్రామాలలో మాకు ఫలానా పనులు అవసరమని అంటే, ఒక దాత ముందుకు వచ్చి 30 శాతం నిధులను ఇస్తానంటే, వారినే నిర్మాణం చేసుకోమంటూ రూ.1500.00 కోట్ల విలువైన పనులను చేయించిన అద్భుతమైన కార్యక్రమం జన్మభూమి కార్యక్రమం.

దురదృష్టం ఏమిటంటే, అటువంటి జన్మభూమి కార్యక్రమాన్ని కూడా కొంతమంది విమర్శించిన పరిస్థితి వచ్చింది. దానికి ప్రజలు బదులు చెప్పారు. మీరు రద్దు చేసే అవకాశం ఇవ్వము, ఆ కార్యక్రమం మాకు కావాలి, జన్మభూమి కార్యక్రమం

కొనసాగాలని తెలుగుదేశం ప్రభుత్వానికి ఘన విజయాన్ని అందించిన తెలుగు ప్రజలు అభినందనీయులు. ఈ రోజు కాని, రేపు కాని, ఒక మంచి కార్యక్రమాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరు వ్యతిరేకించినా వారికి రాజకీయ భవిష్యత్తు వుండదని ప్రజలు ఎన్నికలలో తీర్పునిచ్చారు.

రెవిన్యూ సదస్సులలో లోటబీగా మండల్ రెవిన్యూ ఆఫీసు యంత్రాంగం గ్రామానికి వెళ్ళి మీకు ఏమి కావాలి? మీకు టైటిల్ డీడ్స్ కావాలా, పట్టాదారు పాస్ పుస్తకాలు కావాలా, ఇన్‌కమ్ సర్టిఫికెట్లు కావాలా, ఏమి కావాలని అడిగి అక్కడికక్కడే వారి సమస్యలను పరిష్కరించడం జరిగింది. ఇలా 6 నెలలకు ఒకసారి చొప్పున దాదాపు 3, 4 సార్లు రెవిన్యూ సదస్సులను నిర్వహించి సమస్యలను పరిష్కరించడం జరిగింది. సైక్లోన్ విషయానికి వచ్చినప్పుడు నేను ఒక విషయాన్ని మరచిపోయాను. నిన్న కాక మొన్న ఒరిస్సాలో సూపర్‌సైక్లోన్ వచ్చింది. ఒరిస్సా మన ప్రక్కనున్న రాష్ట్రం. కేవలం మానవతా దృక్పథంతో అక్కడ వున్న పరిస్థితులను చూసి మన ప్రభుత్వం స్పందించింది. అనేక మంది అధికారులను పంపింది. కోట్లాది రూపాయలను పంపించాము. వాళ్ళకు అసలు కమ్యూనికేషన్లు అనేవి లేకుండా పోయాయి. ఒరిస్సా ముఖ్యమంత్రికి బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతే మన డి.జి.పి.గారు అక్కడకు వెళ్ళి సెటిలైట్ ఫోన్ ఏర్పాటు చేసేటంత వరకు ఒరిస్సా ముఖ్యమంత్రిగారికి రాష్ట్రంలోనూ, బయట ప్రపంచంతోనూ సంబంధాలు లేని పరిస్థితి వుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒరిస్సా ప్రజలను ఏ విధంగా ఆదుకున్నదీ, ఒరిస్సా పత్రికలలో మన ముఖ్యమంత్రిగారిని కొనియాడుతూ వ్రాసిన ఎడిటోరియల్సే ఉదాహరణ. ఆ విధంగా కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో చేసుకుంటూ వచ్చాము.

ముఖ్యమంత్రిగారు ఒకటే చెప్పారు. బాధ్యతలను చేపట్టిన తరువాత రాజకీయాలను మానేస్తామని చెప్పారు. మంత్రులకు, శాసనసభ్యులకు అందరికీ కూడా చెప్పారు. ప్రజా ప్రతినిధులు అందరూ ప్రజల అవసరాలను గమనించండి. ప్రజల మధ్య మెలగండి, రాజకీయాలను మానివేయండి. ఎలక్షన్స్‌లో మాత్రమే రాజకీయాలు మాట్లాడండని చెప్పారు. అధికారాలను తగ్గించుకుంటామని చెప్పారు. అధికార వికేంద్రీకరణను కోరారు. ప్రజల భాగస్వామ్యం కోరారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకే పెత్తనం ఇవ్వాలని ఆశించారు. ఆ విధంగా పథకాలు రూపొందించారు. అందుకు ఉదాహరణ వాటర్ యూజర్స్ అసోసియేషన్.

జన్మభూమి కార్యక్రమంలాగే వాటర్ యూజర్స్ అసోసియేషన్ కార్యక్రమం కూడా చాలా మంచి కార్యక్రమం. రైతులు తమ కాలువలు, చెరువుల మరమ్మతులకు నీటి తీరువా కడుతున్నారు. గతంలో ఆ నీటి తీరువాలో కొంత ఖర్చులకు పోను ఓ.ఎ.ఒ.సి. రూపంలో ఇంజనీర్లకు నిధులు విడుదల చేస్తే, ఈ కాల్వలకు అంచనాలు తయారు చేసారు. తయారు చేయలేరు అని ఆఫీసులో కూర్చుని కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు పంచుకున్నా, ఏమి జరిగిందో తెలియని దౌర్భాగ్యమైన పరిస్థితులలో రైతాంగం వుండేది. ఈ రోజు పరిస్థితి చూస్తే, అది న్యాయం కాదు మీరు కట్టే డబ్బు మీకే ఇస్తాం, మీ ప్రతినిధులన

మీరు ఎన్నుకోండి. మీ కాల్వలను, చెరువులను, స్లూయిస్‌లను, షట్టర్లను మీరే రిపేర్లు చేసుకోండి. స్వయం నిర్ణయాధికారాన్ని మీకే ఇస్తున్నామని చెప్పి, 52 సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం రైతులకు పెత్తనం ఇచ్చి, స్వాతంత్ర్యం ఇచ్చిన ప్రభుత్వం చంద్రబాబు నాయుడుగారి ప్రభుత్వం.

వేలాది కోట్ల రూపాయలను రైతాంగానికి ఇచ్చారు. నీటి వినియోగ దారుల సంఘం కాని, డిస్ట్రిబ్యూటరీల కమిటీ కాని, ప్రాజెక్ట్ కమిటీలు కాని, ఆ పనులను ఎంతో బాధ్యతతో చేయించాయి. వాటిని కూడా రద్దు చేస్తామని చెప్పిన రాజకీయ పార్టీలు, నాయకులు లేకపోలేదు. నీటి సంఘాలకు పార్టీ బేస్డ్ ఎలక్షన్స్ కాదు. పార్టీ రహితంగా రైతులు కూర్చుని ఎంపిక చేసుకున్నారు. వారు చేసిన పనులను రైతాంగం అంతా మెచ్చుకుంటోంది, సంతోషపడుతోంది. అందుకనే ఈ కొద్ది కాలంలో నీటి సంఘాలు కాని, వాటర్‌షెడ్స్ కాని చేసిన పనుల వల్ల 25 లక్షల హెక్టార్ల భూమిని అదనంగా సాగులోనికి తీసుకురాగలిగాము. కల్వలు, చెరువుల మరమ్మతు ఒక ఉద్యమంలాగ సాగుతోంది. ఆ రోజున కాటన్ దొర కాల్వలను త్రవ్వించి పోతే ఈ రోజు మళ్లీ చంద్రబాబు నాయుడి గారి ప్రభుత్వం కాల్వల మరమ్మతులు చేసేదాకా దిక్కులేని పరిస్థితి వచ్చిందని రైతులు చెప్పుకునే పరిస్థితి.

అందుకనే 1998-99 ఆర్థిక సంవత్సరంలో 1-53 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారోత్పత్తులు అదనంగా వచ్చాయి. ఈ రోజు అనేక డిపార్ట్‌మెంట్స్‌లో ప్రభుత్వం సాధించిన ప్రగతి విషయానికి వస్తే, ఎఫ్.ఎస్.ఐ ఒకటి. అంతకు ముందు బిల్డింగ్ కట్టు కోవాలంటే, రూల్స్ వయొలేట్ చేసేసి, మంత్రి దగ్గరకో మరొకరి దగ్గరకో పోతే, ఎగ్జెంప్షన్ తీసుకునే పద్ధతి వుండేది. ఆ పద్ధతికి అలవాటు పడిపోయి, బిల్డింగులను రోడ్ల మీద కట్టిన సందర్భాలు వున్నాయి. విచక్షణాధికారం ప్రభుత్వానికి వుండకూడదని చెప్పి, దీంట్లో కూడా డెసిషన్ తీసుకున్న ప్రభుత్వం ఇది. టోటల్‌గా న్యూ డైరెక్షన్‌లో, కొత్త కాన్సెప్ట్‌లో ఈ ప్రభుత్వం 4 సంవత్సరాలుగా నిర్విరామంగా కృషి చేసింది. ఇప్పుడు కూడా ముఖ్యమంత్రిగారు చెబుతున్నారు. నిర్ణయాలను గ్రామాలలోని గ్రామ సభలకే ఒదిలివేస్తామని అంటున్నారు.

హౌసింగ్ విషయంలో కూడా, పేదల కోసం పక్కాఇల్లు నిర్మించాలని ఈ ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు పెట్టింది. ఇందులో, లబ్ధిదారుల ఎంపిక విషయంలో కూడా నిర్ణయాన్ని గ్రామ సభలలోని ప్రజలకే ఒదిలివేస్తామని ముఖ్యమంత్రిగారి ఉద్దేశ్యం. ఆవిధంగా శాసన సభ్యులో, మంత్రులో, ముఖ్యమంత్రో కాదు అధికారం చెలాయించాల్సింది. ప్రజల భాగస్వామ్యంతో ప్రజలు కూడా నిర్ణయాలు చేయాలని ప్రభుత్వోద్దేశ్యం.

అంతేకాదు, సామాన్యుడికోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ విషయంలో అనేకమంది విమర్శించారు. ఈరోజు ఎం.ఆర్.ఓ. ఆఫీసులో ఒక కంప్యూటర్ ఏర్పాటు చేస్తే, దాని ఖర్చు సుమారు రు.1.50 లక్షలు, అక్కడ వున్న అనేక మంది ఉద్యోగుల జీతభత్యాలు చూస్తే, ఒక ఎంప్లాయికి 12 నెలల కాలంలో జీతం, బెనిఫిట్స్ ఎంతైతే ఇస్తామో, అంత కూడా కాదు పర్మనెంట్‌గా ఒక కంప్యూటర్ కాస్టు. దానివల్ల వచ్చిన నష్టం ఏమిటి? దానిని కూడా రాజకీయానికి ఉపయోగించిన సందర్భాలున్నాయి.

ఒక మండలంలోని మారుమూల ప్రాంతంనుంచి ఒక పేదవాడు క్యాస్టు సర్టిఫికెట్ కోసమో, ఇన్‌కమ్ సర్టిఫికేట్ కోసమో వెళితే, లేక ఇంకా ఏదైనా వివరాల కోసం వెళితే 10 నిమిషాలలో కమ్‌ప్యూటర్ల ద్వారా వివరాలను ఇచ్చే పరిస్థితి వచ్చింది.

10.40 ఉ. గతంలో వి.ఎ.ఓ.లు వ్రాయాలి, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ సర్టిఫై చెయ్యాలి అటుపిమ్మట తీరిక ఉన్నప్పుడు ఎం.ఆర్.ఓ. సర్టిఫై చేయాల్సి ఉండెది. మధ్యలో పేద వారు అనేక స్టేజిస్‌లో అధికార్లకి డబ్బులు ఇచ్చే పరిస్థితులు ఉండేవి. నేడు కంప్యూటర్స్ ఏర్పాటు చేయడం వల్ల వెంటనే సర్టిఫికేట్ తీసుకొనె పరిస్థితులు వచ్చాయని తెలియజేస్తున్నాము. కంప్యూటరైజేషన్ చేయడం వల్ల వచ్చే నష్టమేమిటని నేను అడుగుతున్నాను. దీని విషయమై విమర్శించిన సందర్భాలు ఉన్నాయి.

'కంప్యూటరైజ్‌డ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ రిజిస్ట్రేషన్ డిపార్టుమెంట్' (కార్డు) చేయడం జరిగింది. గతంలో వా ఆస్తి అమ్మాలంటే చెట్టు క్రింద కూర్చొన్న స్టాంప్ వెండార్ వద్దకు వెళ్ళి వారి చేత వ్రాయించి, మూడు నాలుగు రోజులు తిరిగి పర్సెంటేజీ ఇచ్చి స్టాంపులు తెచ్చుకొనే పరిస్థితి ఉండేది. నేడు కేవలం ఒక్క గంట వ్యవధిలో ఏదేని ఆస్తి కొవాలన్నా, అమ్మాలన్నా స్టాంపులు తెచ్చుకొనే పరిస్థితి ఈ 'కార్డు' సిస్టం ద్వారా జరుగుతోంది. ఈ కార్డు సిస్టంని కొంత మంది విమర్శించిన పనిస్థితులు ఉన్నాయని తెలియజేస్తున్నాను.

లేటెస్టు ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా పేద ప్రజలకు సేవచేయడానికి, మధ్య తరగతి ప్రజలకు సేవచేయడానికి వ్యాన్, ట్విన్స్ లాంటి అనేక కార్యక్రమాలు చేయడం జరుగుతోంది. మన రాష్ట్రంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలను చూసి ఇతర రాష్ట్రాల వారు అనుసరిస్తున్నారని తెలియజేస్తున్నాను.

'సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్'. అనేక సోషల్ యాక్టివిటీస్ చేసి ప్రభుత్వం ఇచ్చే కార్యక్రమాల్లో వారు భాగస్వాములై పనిచేస్తున్నారు. మనం ఇచ్చే సబ్సిడీ, మార్జిను మనీలతో ఆయా గ్రూప్స్ కూర్చొని మాట్లాడుకొని అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు.

భారతదేశములో ఉన్న అన్ని రాష్ట్రాలలో అటవీ భూములు ఉన్నాయి. అడవిలోని చెట్లను నరకుట అరికట్టేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాము. ఆంధ్ర రాష్ట్రములో ఆరు వేల వన సంరక్షణ 'సమితుల' ద్వారా 16 లక్షల హెక్టార్లలో 13 లక్షల మంది లబ్ధి పొందే విధంగా భారతదేశంలో రూపొందించిన కార్యక్రమాన్ని అమలు చేసిన రాష్ట్రం మన రాష్ట్రమేనని ఆ ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుందని తెలియజేస్తున్నాను. ఈరోజు అటవీ భూములు ఉంటే జంగల్ క్లియరెన్స్‌కి రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేస్తున్నది. పిట్స్ వేయడానికి, ఎరువులు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దీని వల్ల వచ్చిన ఫలితం ఆయా కమిటీలలో ఉండే సభ్యులకే పంచినోందని తెలియజేస్తున్నాను. 'వన సంరక్షణ సమితి' కార్యక్రమం అద్భుతమైన కార్యక్రమం అని నేను తెలియజేస్తున్నాను.

స్వాతంత్ర్యం వచ్చి 50 సంవత్సరాలైనా అక్షరాస్యతని చూస్తే నూటికి 47 మంది మాత్రమే వ్రాయగల్గే పరిస్థితిలో ఉన్నారు. ముఖ్యంగా దళితుల్లో నిరక్షరాస్యులు ఎక్కువ మంది ఉన్నారు. గిరిజన మహిళల్లో నూటికి 8 మంది మాత్రమే వ్రాయ, చదవ గల్గుతున్నారు. మిగిలిన వారికి ఏమి జరుగుతోందో తెలియని పరిస్థితి ఉంది. ఏ బస్సు ఎటువైపు వెళుతుందో కూడా చదవలేని పరిస్థితి ఉంది. వీరు ఎక్కువ మందిని ఎందుకు కంటున్నారో, కంటే వారి భవిష్యత్తేమిటో కూడా వారికి తెలియదు. అటువంటి పరిస్థితుల నుండి వీరిని అధిగమింపజేయడానికి 'విలేజ్ ఎడ్యుకేషన్ కమిటీ' లను ఏర్పాటు చేసి 35 వేల పాఠశాల భవనాలను నిర్మాణం చేసి చదువు చెప్పించడం జరుగుతోంది. పేద పిల్లల తల్లిదండ్రులతో ఈ కమిటీని ఏర్పాటు చేసి పాఠశాల భవనాలు నిర్మాణం చేసుకొనే పరిస్థితిని కల్పించడం జరిగింది. పాఠశాల ఉపాధ్యాయులు సరైన సమయానికి పాఠశాలలకు రాకపోయినా, పిల్లలకు చదువు సక్రమంగా బోధిస్తున్నారా లేదా? తదితర అంశాలను పాఠశాల విద్యా కమిటీ పర్యవేక్షిస్తోంది. టీచర్స్ కొరత ఉంటే వాలెంటీర్స్‌ని అపాయింటు చేసుకొనే అవకాశం కూడా ఈ కమిటీలకు ప్రభుత్వం ఇచ్చింది. అంతేకాదు 'మదర్స్ కమిటీ' పౌష్టికాహారం పేద పిల్లలకు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో 'ఐ.సి.డి.ఎస్.' ద్వారా ఖర్చు చేయడం జరుగుతోంది. అంగన్‌వాడి బిల్డింగ్స్ నియమించడానికి 'తల్లుల కమిటీలు' పనిచేస్తున్నాయి. ఒక లక్షా 40 వేల రూపాయలతో భవనాలు నిర్మించుకొనే పరిస్థితులను ఈ ప్రభుత్వం కల్పించిందని తెలియజేస్తున్నాను.

రాష్ట్రములలో 'పొదుపు లక్ష్మి' గ్రూప్స్ అనేకం ఏర్పాటు చేసుకొంటే 'డ్వాక్రా' పథకం క్రింద ప్రతి గ్రూప్‌కి ఆర్థిక సహాయం అందించడానికి, కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులు చాలక పోతే 1998-99 ఆర్థిక సంవత్సరానికి గాను 45 కోట్ల రూపాయలు బడ్జెటులో పెట్టి పొదుపు చేసిన ప్రతి గ్రూప్‌కి ఆర్థిక సహాయం ఈ ప్రభుత్వం అందించిందని తెలియజేస్తున్నాను. 1999-2000 సంవత్సరానికి మరొక 45 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది శ్రీ చంద్రబాబునాయుడు ప్రభుత్వం అని తెలియజేస్తున్నాను. పావర్టీలైన్ క్రింద ఉన్న డ్వాక్రా సభ్యులకు వార్షిక ఆదాయం 11 వేల లోపు ఉన్న వారి

జీవితాల్లో వెలుగు చూడాలన్న ఉద్దేశ్యముతో, కాయకష్టం చేసి వంటచెరకు తెచ్చుకొని 'పొగపొయ్యి'లతో ఆరోగ్యం పాడు చేసుకొంటున్న వారి ఆరోగ్యం బాగు చేయ్యాలన్న ఉద్ధేశ్యంతో గ్యాస్ స్టౌలు, గ్యాస్ సిలెండర్లు ఇవ్వడం జరుగుతొందని తెలియజేస్తున్నాను. భారత దేశంలో మొట్టమొదటి సారిగా 10 లక్షల గ్యాస్ కనెక్షన్స్ ఇప్పించడానికి చర్యలు తీసుకొన్న ప్రభుత్వం శ్రీ చంద్రబాబునాయుడు గారి ప్రభుత్వమేనని తెలియజేస్తున్నాను. దీనిపై కొంత మంది ఎన్నికల సంఘానికి పిటీషన్స్ ఇచ్చారు. మళ్లీ ఓట్ల కోసమని వారే వాగ్దానాలు చేశారన్న విషయాన్ని గుర్తుచేస్తున్నాను. 'దీపం పథకం'. అర్బన్ ఏరియాలకు విస్తరింప చేయాలన్న ఉద్ధేశ్యముతో మరో 25 వేల కనెక్షన్స్ కావాలని కేంద్రప్రభుత్వాన్ని ఈ ప్రభుత్వం కోరిందని తెలియజేస్తున్నాను.

మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పురుషులతో సమానముగా వారిని ముందుకు తీసుకెళ్లాలన్న ఉద్ధేశ్యముతో ఉద్యోగాలలో రిజర్వేషన్ తూ.చ తప్పకుండా పాటించాలని ఈ ప్రభుత్వం నిర్ణయించింది. చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్ మహిళలకు కల్పించాలని 10వ శాసనసభలో రెండు పర్యాయాలు సిఫారసు చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి పంపించిన ఘనత శ్రీ చంద్రబాబునాయుడు గారికే దక్కిందని తెలియజేస్తున్నాను. అంతేకాదు మొన్న జరిగిన ఎన్నికల్లో 32 మంది మహిళలకు సీట్లు ఇచ్చి, రాష్ట్రంలో అత్యున్నత స్థానమైన స్పీకర్ పదవికి మహిళను ప్రతిపాదించి 5 మంది మహిళలకు మంత్రివర్గములో స్థానం కల్పించిన ఘనత శ్రీ చంద్రబాబునాయుడు గారికే దక్కుతుందని తెలియజేస్తున్నాను. దీనిని ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్రాలవారు మహిళలకు ప్రోత్సాహం ఇవ్వక తప్పదని తెలియజేస్తున్నాను. త్వరలో కేంద్రంలో మహిళా రిజర్వేషన్ బిల్లు అప్రూవ్ కాకతప్పదని తెలియజేస్తున్నాను.

వెనుకబడిన తరగతుల వారికి ఆధునిక పనిముట్లు అందించడం కోసం 250 కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దళితులకు వందకోట్ల రూపాయలు 'ముందడుగు' కార్యక్రమం క్రింద ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గిరిజనులకు 'చైతన్యం' కార్యక్రమం క్రింద 188 కోట్ల రూపాయలతో ఒక కార్యక్రమం చేస్తోంది. 'చేయూత' 'సుఖీభవ', 'ఆపద్బంధు' 'రోష్ని' తదితర పథకాలు కూడా ప్రభుత్వం చేస్తోంది. ప్రమాదవశాత్తు ప్రమాదానికి గురైన వ్యక్తి చనిపోతే లక్షరూపాయలు ఆ వ్యక్తి కుటుంబీకులకు ఇన్స్యూరెన్స్ ద్వారా ఇవ్వడం జరుగుతోంది. ఇటువంటి కార్యక్రమం భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా అమలౌతోందా అని అడుతున్నాను. అనేక పార్టీలు ఇతర రాష్ట్రాల్లో పరిపాలిస్తున్నాయి. ఆయా రాష్ట్రాల్లో ఇది ఉందా అని అడుగుతున్నాను. సి.ఎం.ఇ.వై. పథకం వేరే రాష్ట్రాల్లో ఉందా అని కూడా అడుగుతున్నాను. దాదాపు 30 శాతం పైగా ఉన్న యువతకి స్వయం ఉపాధి కల్పించడానికి రెండువందల కోట్ల రూపాయలతో సంవత్సరానికి సి.ఎం.ఇ.వై. పథకం ద్వారా లక్ష మందికి ఉపాధి కల్పించింది. ఇటువంటి ప్రభుత్వం భారతదేశంలో ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నిస్తున్నాను. ఈ ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే ధక్కుతుందని తెలియజేస్తున్నాను.

ఇది కూడా తెలుగు తమ్ముళ్ళకి ఇచ్చారని కొందరు అంటున్నారు. నవంబరు రెండవ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ రోజున నా నియోజకవర్గంలో డ్వాక్రా గ్రూప్స్‌లో ఉండే వారికి గ్యాస్ స్టౌలు పంపిణీ చేయడానికి వెళ్లాను. ఫస్ట్‌గ్రూపు ప్రియాంకా గాంధీ పొదుపు లక్ష్మి. వాళ్ళని రమ్మని చెప్పాము. ఆ లేడీస్ ఎంతో సంతోషంగా వచ్చారు. వారికి గ్యాస్ స్టౌలను యిచ్చాము. సి.ఎం.ఇ.వై.లో అనేక గ్రూపులు వున్నాయి. ఇందిరాగాంధీ, నెహ్రూ, ప్రియాంకా వంటి గ్రూపులు చాలా వున్నాయి. ఇక్కడ పార్టీ రహితంగా వారికి ఈ పొదుపు లక్ష్మి కార్యక్రమంలో సి.ఎం.ఇ.వై. క్రింద గ్యాస్ స్టౌలను యిచ్చిన మాట వాస్తవం అవునా కాదా చెప్పండి? అంతేకాదు ఈరోజు రాష్ట్ర అభివృద్ధికోసం ముందు చూపుతో ఎందరు ఏమి అనుకున్నా, వారు అనుకోవడం ముఖ్యం కాదు, ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పని చేసిందని మనవి చేస్తున్నాను. ఆఖరుకు రోడ్ల విషయంలో కూడా, వాటిని వెడల్పు చేయడంలో కొంతమందికి ఇబ్బందులు ఎదురు అయినప్పటికీ, వెనుకాడలేదు. ముందుచూపుతో రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందుకు ప్రజలు హర్షించారు. ఇప్పుడు వారు ఇంకా రోడ్లను వెడల్పు చేయమనే పరిస్థితి వుంది. అటువంటి పనులను చేస్తే, ఎటువంటి పనులు చేయాలి? ఏపనులు చేస్తే ఓట్లు పోతాయని ఆలోచించని ముఖ్యమంత్రి, మన చంద్రబాబునాయుడు గారని నేను మనవి చేస్తున్నాను.

10.50 ఉ.

ఈరోజు 10,266 కి.మీ. రోడ్లను డెవలప్ చేయడం కోసం జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక సహాయ ఏజన్సీల ద్వారా నిధులు పొంది ఆ కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతోందని కూడా తెలియచేస్తున్నాను. అలాగే ఈరోజు ఆర్.ఆర్.ఎం. క్రింద, స్పెషల్ ఆర్.ఆర్.ఎం. క్రింద పంచాయతీరాజ్ రోడ్లను డెవలప్ చేయడంగానే, ఆర్.అండ్ బి లో ఆర్.బి.డి క్రింద ఇంకా ఇతర కార్యక్రమాల క్రింద కోట్లాది రూపాయలను ఖర్చుపెడుతూ వుంటే ఆ ధనం అంతా దుర్వినియోగం కాకుండా వుండటం కోసం అనేక కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఆవిధంగా కఠిన నిర్ణయాలు తీసుకుని ప్రపంచ బ్యాంకు నిధులు యివ్వడం జరిగింది. ఏ దేశంలోనూ ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టిన పనులకు కోట్ చేయడానికి రిస్ట్రిక్షన్స్ లేవు. 100 కి 100 శాతం, 150 శాతం అదనంగా యిచ్చినా వాళ్ళకు కావలసినది క్వాలిటీ. ముఖ్యమంత్రిగారు ఒకటే చెపుతున్నారు ప్రపంచబ్యాంకు నిధులు ఊరికే రావడం లేదు, ప్రజల డబ్బు వడ్డీతోబాటు కట్టవలసి వుంది. అందుకే మీ ఇష్టం వచ్చిన ప్రకారం ఎక్సెస్ శాతం యివ్వడానికి వీలులేదని, 20 శాతం అన్నారు, ఆఖరుకు 15 శాతం యివ్వాలని, అంతకన్నా ఎక్కువ ఎవరయినా యిస్తే నిర్దాక్షిణ్యంగా వాటిని క్యాన్సిల్ చేయాలని చెప్పిన ముఖ్యమంత్రి మన ముఖ్యమంత్రేనని నేను మనవి చేస్తున్నాను.

ఈరోజు రాష్ట్ర ప్రభుత్వ నిధులు, ఇతర సంస్థల నుంచి వచ్చే నిధుల ద్వారా జరిగే కార్యక్రమాల నాణ్యత పెంచడం కోసం, ప్రభుత్వం, ప్రతిపక్షపార్టీలు సభలో రైజ్‌చేస్తే, ఎలిగేషన్స్ చేస్తే ఎంక్వయిరీ వేయడం కాదు, స్యూమోటోగా అందుకుగాను సి.ఎం.టెక్నికల్ అడ్వయిజర్‌గా, శ్రీ సుబ్బిరామిరెడ్డిగారిని ముఖ్యమంత్రిగారు సెలక్టు చేశారు. "నువ్వు ఆర్ అండ్ బి రోడ్లు చూస్తావో, పంచాయతీరాజ్ రోడ్లు చూస్తావో, ఇరిగేషన్ రోడ్లు, చూస్తావో నాకు తెలియదు అన్ని పనులు సక్రమంగా జరిగేట్లు చూడమని నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ చూస్తే చూడు, ఎక్కడయినా డిఫెక్టు వుంటే ఆ విషయాలను నాకు చెపితే, నేను తక్షణ చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రిగారు సుబ్బిరామిరెడ్డితో అన్నారు. కనుక సుబ్బిరామిరెడ్డి ఏ జిల్లాకు వెళితే అక్కడ కంట్రాక్టర్లు గజగజలాడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం, మన చంద్రబాబునాయుడి ప్రభుత్వం వుందని తెలియజేస్తున్నాను. ఈ విధంగా ఈ ప్రభుత్వం ఆంక్షలను పెడుతున్నదని మనవి చేస్తున్నాను.—అనేక మంది టి.డి.పి.- కాంగ్రెసు పార్టీల వారు ఇతరులు కూడా కంట్రాక్టరులుగా వుంటారు. వాళ్ళందరికీ ఈ నిబంధనలవల్ల మనస్తాపం కావచ్చు. అయినా నిబంధనలను సడలించని వ్యక్తి మన ముఖ్యమంత్రిగారని నేను సభ దృష్టికి తెస్తున్నాను.

ఇక పవర్ విషయంలో ప్రస్తుతం వున్న పరిస్థితులు అందరికీ తెలుసు. అనేక నిర్ణయాలు తీసుకున్న మాట వాస్తవం. దాదాపు 2,500 కోట్లరూపాయలు నష్టములలో విద్యుత్ సంస్థ నడుస్తూ వుంటే సంవత్సరానికి 900 కోట్ల రూపాయల నష్టం వస్తూ వుంటే ఏదో ఆయన చేస్తూ వుంటే, ఎలక్షన్స్ ముందు ఓట్ల కోసం వాళ్ళు ఏవేవో మాటలు చెప్పడం జరిగింది. తప్ప మరోటికాదు. ఓట్లకోసం ప్రజలకు ఏదో చెప్పే మనిషి మన ముఖ్యమంత్రి కాదని, ఓట్లు వచ్చినా, రాకపోయినా వాస్తవాలను ప్రజలకు తెలిపే మనిషి ఆయనని తమ దృష్టికి తెస్తున్నాను. అందువలననే ఆయన కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఆనాటికన్నా ఈరోజు పరిస్థితులు మెరుగు పడినాయని మనవి చేస్తున్నాను. మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలో రైతాంగం పైర్లు నష్టపోయే పరిస్థితి వస్తే, దాదాపు 40 రోజులు యుద్ధప్రాతిపదికన ఆయా ప్రాంతాలలో వున్న బావులకు ట్రాన్స్‌ఫార్మర్స్ యిచ్చి ఆ రెండు జిల్లాలలోని పైర్లు ఎండిపోకుండా కాపాడడం జరిగిందనే విషయం నేను తమకు గుర్తు చేస్తున్నాను. ఈరోజు రూ.1200 కోట్ల ట్రాన్స్ మిషన్ మరియు డిస్ట్రిబ్యూషన్ పరిస్థితులను మెరుగుపరచడం కోసం ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలియజేస్తున్నాను.

పి.ఎల్.ఎఫ్‌ను 93 శాతం ఈరోజు ఒక్క ఆంధ్రరాష్ట్రంలో మాత్రమే మనం సాధించాము. వేరే రాష్ట్రాలతో కంపేర్ చేసినట్లయితే అక్కడ చాలా తక్కువగా వుంది. ఇది తిరుగులేని వాస్తవం. దీనిని సభ దృష్టికి తెస్తున్నాను. ఇక నంబర్ ఆఫ్ సబ్ స్టేషన్స్‌ను చూసినట్లయితే 1990–91 లో 1228 వుంటే 1998–99లో 1816 సబ్‌స్టేషన్స్ వున్నాయి.

అంటే దాదాపు 600 సబ్‌స్టేషన్స్ పెంచి రైతులకు సదుపాయం కల్పించడం జరిగిందని నేను సభ దృష్టికి తెస్తున్నాను. ఈరోజు అంటే ఈ నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం 1750 కోట్ల రూపాయల అదనపు లాభం సాధించిందనీ, అదనపు ఉత్పత్తిని సాధించిందని కూడా నేను సభ దృష్టికి తెస్తున్నాను.

ఇక పారిశ్రామికంగా చూస్తే. ఎస్.ఎస్.ఐ పాలసీ భారతదేశంలో మొట్టమొదటిసారిగా తెచ్చిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని మనవి చేస్తున్నాను. ఈనాడు అనేక రకాల పాలసీలు వున్నాయి. వాటివల్ల ఇబ్బందులు వున్నాయి. అనేక రకాల హరాస్‌మెంట్స్ వున్నాయి. ఇది అరెస్టు చేయడానికి అబాలిషన్ ఆఫ్ ఇన్‌స్పెక్షన్ లాస్ కోసం అనేక నిర్ణయాలు తీసుకోవడం ఈ ప్రభుత్వమే చేసిందని నేను మనవి చేస్తున్నాను. ఇండస్ట్రియలిస్టులు పరిశ్రమలను స్థాపించి, ప్రతిసంవత్సరం వాటికి లైసెన్సులు రెన్యూవల్ చేయించుకునే నిమిత్తం ఆఫీసర్ల చుట్టూ ప్రదక్షిణలు చేయవలసిన పరిస్థితి వుంది. అందువల్ల వారికి పర్మినెంటు లైసెన్సులు యిచ్చే పరిస్థితిని తెచ్చినది కూడా ఈ ప్రభుత్వమేనని మనవి చేస్తున్నాను. అలాగే వారానికి, నెలకూ అంటూ తనిఖీలు చేయకుండా సంవత్సరానికి ఒక్కసారే చేయాలన్న నిర్ణయాన్ని చేసినదీ ఈ ప్రభుత్వమేననీ తెలియజేస్తున్నాను. అలాగే అవసరం అయినట్లయితే, లేక ఫిర్యాదులు చేయబడినట్లయితే తప్ప అప్పుడప్పుడు ఇన్‌స్పెక్షను చేసే పరిస్థితి వద్దని కూడా మన ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగిందని తమద్వారా మనవి చేస్తున్నాను. క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాలెన్సింగ్ ఫండ్ ఒకదానిని క్రియేట్ చేసి, పారిశ్రామిక వాడలలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం జరుగుతుందనీ, వాటర్‌ఫెసిలిటీ, డ్రైన్స్ తదితరాలకోసం 50 శాతం పరిశ్రమల వాళ్ళు భరించినట్లయితే, మిగిలిన 50 శాతం ప్రభుత్వం భరిస్తుందనిచెప్పి ఫండ్‌ను క్రియేట్ చేసిన ఘనత కూడా తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కిందని తెలియజేస్తున్నాను.

అంతేకాదు చిన్నచిన్న పరిశ్రమలకు అసిస్ట్ చేయడానికి సి.ఐ.ఐ (కన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్) కొలాబరేషన్‌తో ఎ.పి. టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను క్రియేట్ చేసిన విషయాన్ని సభ దృష్టికి తెస్తున్నాను.

ఈ రోజు ఈ ప్రభుత్వం 25 లక్షల మందికి ఇళ్ళ పట్టాలు యివ్వాలని నిర్ణయించింది. అదేవిధంగా 35 లక్షల పక్కా గృహాలను నిర్మించాలని నిర్ణయించింది. ప్రతిసంవత్సరం 10 లక్షల మరుగు దొడ్ల నిర్మాణం చేయాలని తీసుకున్న నిర్ణయం. అలాగే 50 వేల పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేయాలన్న నిర్ణయం. వంద కోట్ల రూపాయలతో రైతులకు మార్కెటు ఫండు క్రియేట్ చేయాలన్న నిర్ణయం. స్వయం ఉపాధికి పెద్ద పీట వేయాలనే నిర్ణయం ఈ ప్రభుత్వమే చేసింది. ఈరోజు కోట్లాది మంది ఆంధ్ర ప్రజల పేదల కథలు, గాథలను పరిష్కరించడం కోసం, వారి పరిస్థితులను మెరుగుపరచడంకోసం, ఈ రాష్ట్ర ప్రభుత్వ పట్టాలను పవరించడం, కొత్త శాసనాలను చేయడం కోసం ప్రజలు మనలను ఎన్నుకున్నారు. ఇక్కడకు పంపారు. సభ

నిర్వహణకోసం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టడం జరుగుతోంది. అలాంటప్పుడు సభా సమయాన్ని వృథా చేయకుండా సద్వినియోగం చేయాలి. రాష్ట్ర అభివృద్ధికోసం, ప్రజల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంచి నిర్ణయాలు తీసుకోవాలి. దశాబ్దాలతరబడిగా భారతదేశంలో జరుగుతున్న ఈవిధానాలను దృష్టిలో పెట్టుకుని మొట్టమొదటిసారిగా మన రాష్ట్రంలో గత శాసనసభా స్పీకరు, యనమల రామకృష్ణుడుగారు ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేసి, నైతిక విలువలను పెంచే విధంగా చేయడం జరిగింది. ప్రస్తుతం ఆయన మన ఫైనాన్స్ మినిస్టరుగా వున్నారు. ఆయన మొట్టమొదటిసారిగా ఈ ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఆస్తుల విలువలు ప్రతిసంవత్సరం ప్రకటించడం, వ్యక్తిగత ప్రవర్తనా నియమావళి రూపొందించుకోవడం జరిగింది. అది బయట, హౌస్‌లోను సభ్యులు ఎలా ప్రవర్తించాలో నిర్దేశిస్తుంది. అందుకుగాను మన మీద మనం కొన్ని ఆంక్షలు విధించుకోవడం జరిగింది. ఈ విధానం, ఈ కమిటీ వల్ల మనం భారతదేశానికి, ప్రపంచానికి ఆదర్శప్రాయమైనామని కూడా నేను సభ దృష్టికి తెస్తున్నాను.

11.00 ఉ.

ఈరోజు తమిళనాడులో కూడా రైతు బజారులు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జన్మభూమి పనితీరును వారు పరిశీలించి తమిళనాడు రాష్ట్రప్రభుత్వం నమక్కునామే పేరు పెట్టి అమలు చేస్తున్నారని చెప్పి మనవిచేస్తున్నాను. పదకొండవ శాసనసభ మొదటి సమావేశాన్ని ఏర్పాటు చేసుకొన్నాము. అయితే ప్రతిపక్షాల తీరు గతంలో కంటే కొంచెము భిన్నంగా సానుకూలంగా వుందని అందరూ అనుకొంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగాలని మేము అందరం ఆశిస్తున్నాము. ఈ శాసన సభ మరిన్ని కొత్త నిర్ణయాలు తీసుకొంటుందని, రాష్ట్రాభివృద్ధి సాధించుకొంటామని, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించుకొంటామని ప్రజలందరూ కోరుకొంటున్నారు. మన వైపు చూస్తున్నారు. పేదల యొక్క సమస్యలు, బాధలు, గాధలు పరిష్కరిస్తారని ఎదురు చూపులు చూస్తున్నారు. ఈ 4 1/2 సంవత్సరాలలో అనేక నిర్ణయాలు తీసుకొన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు ప్రజలకోసం ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. ముఖ్యమంత్రిగారు పనితీరును మెరుగుపరచే దాని కొసం అన్ని డిపార్టుమెంటులలో కొన్ని అవసరమైన మార్పులు చేసి దానికోసం 12 క్యాబినెట్ సబ్ కమిటీలు నియమించారని నేను మనవిచేస్తున్నాను. దౌర్జన్యంతోనో, గుండాయిజంతోనో, రౌడీయిజంతోనో, డబ్బుతోనో, ఓట్లు రావు పనిచేస్తేనే ఓట్లు ఇస్తామని చెప్పి ప్రజలు తీర్పు ఇచ్చారు. ఈ శాసన సభలో కూడా ఎవరైనాసరే మైక్‌ను దుర్వినియోగం చేసుకొంటే మిమ్ములను శాసన సభలో అడుగుపెట్టనీయమని చెప్పి ప్రజలు తీర్పు ఇచ్చారు. వాస్తవాలకు విరుద్ధంగా ఎవరు ఎక్కువగా మాట్లాడినారో వాళ్ళను శాసన సభలో అడుగుపెట్టనీయకుండా ప్రజలు చేశారు. 6వ తేదీన ఎన్నికల కౌంటింగ్ జరగబోతూ వుంటే 4వ తేదీన ఒక పెద్దమనిషి ప్రెస్‌లో, టి.వి.లో చంద్రబాబు నీవు వెళ్ళిపోతున్నావు ఎల్లుండి పోతూ పోతూ ఒకరోజు అయినా మంచి పని చేసిపో అని అన్నారు. ఎన్ని మంచి పనులు చేసినా కనపడని మీకు శాసన సభలో అడుగుపెట్టే అర్హత లేదని చెప్పి ఎన్నికలో ఓడించారు.

ఆయన పేరు మాత్రం నేను చెప్పను కానీ తలప్పైన జుట్టుమాత్రం ఉండదని చెప్పి నేను మనవిచేస్తున్నాను. ప్రజలు సంచలనాత్మకమైన తీర్పు ఇచ్చారు. ఉల్లిపాయల ధరలు పెరిగితేనో అవతలి వాళ్ళ తప్పు చేస్తేనో నెగెటివ్ ఓట్ల మీద ఆధారపడి మనం గమ్మున ఇంటిలో కూర్చొని గెలుస్తామని పరిస్థితులకు భిన్నంగా ఎవరు కష్టపడితే, పనిచేస్తే వాళ్ళకే ఓట్లు ఇస్తామని చెప్పి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చారు. పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి ఒకసారి, రెండుసార్లు, ఎన్నిసార్లు అయినా సరే మీకు మద్దతు ఇస్తామని చెప్పి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు మరొకసారి అభినందనలు తెలియచేస్తున్నాను. ఆపద వస్తే అన్నలాగా కష్టం వస్తే కొడుకులాగా ఆదుకొనే నాయకుడు చంద్రబాబునాయుడు. గవర్నరుగారి ప్రసంగానికి మరొకసారి ధన్యవాదాలు తెలియచేస్తూ మీ అందరి దగ్గర సెలవు తీసుకొంటున్నాము.

డా. వై. ఎస్. రాజశేఖరరెడ్డి (పులివెందుల):- అధ్యక్షా, గవర్నరుగారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే చర్చలో పాల్గొనుటకు అవకాశం ఇచ్చినందుకు మొట్టమొదట మీకు కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను. ఎన్నికల తరువాత జరుగుతున్న సభ ఇది. పద్ధ ప్రకారంగా, రాజ్యాంగాం ప్రకారంగా ఈ సంవత్సరం ఎన్నికలు జరిగాయి కాబట్టి మళ్ళీ రెండవ సారి గవర్నరుగారు అసెంబ్లీని ఉద్దేశించి ప్రసంగించవలసి వుంది. ఈ ఎన్నికల్లో పోయినసారి అధికారంలో ఉన్న పార్టీనే మళ్ళీ అధికారంలోకి వచ్చింది. కాబట్టి పెద్దగా కొత్త విషయాలు లేవు. ఈ ఎన్నికల్లో మళ్ళీ అధికారంలోకి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాము. తప్పనిసరిగా వచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని మంచి కార్యక్రమాలు చేపట్టి వాటికి మా పూర్తి సహకారం అండదండలు కూడా ఉంటాయని చెప్పి మీద్వారా మనవిచేస్తున్నాము.

ఈ ఎన్నికల్లో చాలా మంది ఎన్నిమేట్లు కాని ఆలోచనలు కాని అనుకొన్న రీతిలో జరగలేదు. నిజంగా ఈ ఎన్నికల్లో నూటికి నూరు వాళ్ళ మేమే గెలుస్తామని అనుకొన్నాము కాని అనుకొన్న మేరకు మా అంచనాలు తారుమారు అయినాయి. ఎన్నికలు పార్లమెంటుకి అసెంబ్లీకి ఒకేసారి కలసివస్తే దీనివల్ల చాలా నష్టపోతామని ముఖ్యమంత్రిగారు అనుకొన్నారు. వీలైనంతవరకు రాష్ట్రప్రభుత్వానికి అధికంగా ఆర్థిక భారం పడ్డా అసెంబ్లీకి టైము ఉంది కాబట్టి ముందుగా పార్లమెంటు ఎన్నికలు జరిపించి తరువాతనే అసెంబ్లీ ఎన్నికలు జరిగితే తెలుగుదేశం పార్టీకి కొంత మేలు ఉంటుందని ముఖ్యమంత్రిగారు అనుకొన్నారు. మేము అయితే రెండు ఎన్నికలు ఒకేసారి జరిగితే 1989 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి అనుకూలమైన పరిస్థితులు వచ్చాయి, ఆ విధమైన పరిస్థితులు వస్తాయని మేము భావించాము. రాష్ట్రప్రభుత్వానికి కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని ఒక ఆలోచన కూడా ఉంది. కాని ఎన్నికలు ఆఖరి నిముషములో జరిగిన ఒక అపవిత్రమైన కలియికవలన, తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీలో సిద్ధాంతపరమైన ఆలోచనలు లేకుండా అవకాశవాదమే పరమావధి అని వారు చేసిన ఒక అవకాశవాద పొత్తువల్ల ఈ ఎన్నికలు వారికి బాగా అనుకూలించాయి.

అదికాకుండా గడచిన కొన్ని సంవత్సరాలుగా వార్తాపత్రికల ద్వారా ఆడియో విజువల్ మీడియా ద్వారా ప్రభుత్వం ద్వారా వారు ఖర్చుపెట్టిన డబ్బు కూడా బాగా ఉపయోగపడింది. వారి పార్టీకి అది ప్రచార ఆయుధం అయినది. గడచిన ఎన్నికలలో మొత్తం భారతదేశంలోనే బాగా ఖరీదు అయిన ఎన్నికలు ఆంధ్రప్రదేశ్‌లో జరిగాయి. ఏ రాష్ట్రంలో కూడా అభ్యర్థుల ద్వారా ఇంత ఖర్చు పెట్టి ఎన్నికలు జరగలేదనిపించే పరిస్థితులలో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు ప్రపోర్షనల్‌గా రిప్రజంటేషనకు ఎన్నిక కాదు. స్టాటిస్టికల్ ఫాలసీలు చాలా ఉంటాయి. ప్రజాస్వామ్య విధానంలో 49 శాతం ఓట్లు వచ్చి ఒక్కసీటుకూడా గెలవలేని పరిస్థితి ఉండవచ్చు. 51 శాతం ఓట్లు వచ్చి అన్ని సీట్లు కూడా గెలవలేని పరిస్థితి ఉండవచ్చు. 1998 సంవత్సరంలో పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 38 శాతం ఓట్లు వచ్చినా 42 పార్లమెంటు స్థానాల్లో ఆ రోజు 22 స్థానాలను గెలిచాము. నిన్న జరిగిన ఎన్నికల్లో మా ప్రచారంలో కాని మరేవిధంగా చూసినా ప్రజాభిమానం అంతకు ముందు ఎన్నికలు కంటే ఎక్కువగానే కనపడింది. ఆర్గనైజేషన్ బాగా పెంచుకోగలిగాము. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పట్ల శ్రీమతి సోనియాగాంధీ నాయకత్వంలో ప్రజలలో విశ్వసనీయత బాగా పెంపొందింప చేశాము. గతంలో 38 శాతం ఓట్లు వస్తే 1999 సంవత్సరంలో 43 శాతానికి ఓట్లు పెరిగాయి. అయిదు శాతం ఓట్లు మాకు పెరిగాయి.
11-10 ఉ. స్టాటిస్టికల్ ఫాలసీవల్ల మాకు వచ్చింది 43 శాతం ఓట్లవ్వగా తెలుగుదేశం, బి.జే.పి. పార్టీలకు కలిపి వచ్చిన ఓట్లు శాతం 49 శాతం. మేము గతంలో 38 శాతం ఓట్ల స్థితి నుండి 5 శాతం పెంచుకుని 43 శాతానికి పెరిగినప్పటికీ అయిదు సీట్లకు మాత్రమే కుదించుకుపోయాము. బి.జె.పి. అధినేత, ప్రస్తుత ప్రధాని శ్రీ వాజ్‌పాయ్ గారి మీద ఒక ప్రత్యేకమైన సానుభూతి కనపర్చటం ఈ ఎన్నికలలో ఒక ప్రత్యేక అంశము. వారు మరొక్కసారి ప్రధానిగా కావాలనే భావన, మరీ ముఖ్యంగా అర్బన్ ఎలక్టరేట్‌లో కనిపించింది. దానివల్ల వచ్చిన ఎడ్వాంటేజ్ తప్పనిసరిగా తెలుగుదేశానికి వచ్చిందని చెబుతున్నాను. మాకైతే దానిగురించి ఏ విధమైన బాధాలేదు. నేను ఇంతకు ప ముందు మెన్షన్ చేసినట్లు ఉత్తరప్రదేశ్‌లో మాకు 16 శాతం వచ్చినప్పటికీ అక్కడ మాకు 12 సీట్లు వచ్చాయి. అయితే ఇక్కడ 43 శాతం వచ్చినప్పటికీ కేవలం 5 సీట్లు మాత్రమే వచ్చాయి. అధికారంలోకి రాకపోయినా కొంతకాకపోతే కొంతైనా మేలుజరిగింది. 1994లో 24 మంది సభ్యులు రాష్ట్ర శాసనసభకు గెలిస్తే ఈనాడు వారి సంఖ్య 91కి పెరిగింది. ఆ మేరకు మాకు పూర్తి సంతోషం లేకపోయినా కొంతలో కొంత మేలైనట్లుగానే భావిస్తున్నాను. ఒక మంచి ప్రతిపక్షముగా, ఒక సమర్ధవంతమైన ప్రతిపక్షంగా, ఒక నిర్మాణాత్మక ప్రతిపక్షంగా ఈ శాసనసభ ద్వారా ప్రజలకు సమర్ధవంతంగా సేవచేసే అధికారం ప్రజలు మాకు ఇచ్చారు. అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజలకు మేలు చేయాలి. ప్రజాహితమే మా ప్రథమ ధ్యేయం అనే ఉద్దేశ్యంతో మేము ఈ అసెంబ్లీలో అడుగుపెట్టాము. ప్రధాన ప్రతిపక్షంగా తప్పనిసరిగా ఈ సభద్వారా అధికారపక్షానికి పూర్తి సంపూర్ణ సహకారం అందిస్తాము, నిర్మాణాత్మకమైన సహకారం అందిస్తాము, వారిని

(ప్రభుత్వాన్ని) తీసుకోమనండి. మమ్మల్ని ఏవిధంగా వాడుకోగలుగుతారో వాడుకోండి, మా సంపూర్ణ సహకారం తీసుకోండి. తప్పనిసరిగా మాద్వారా కూడా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకుతీసుకుపోయే దిశలో ముందుకుపోండని మనవిచేస్తున్నాను.

గవర్నర్ అడ్రస్‌లో చాలా లాఫ్టీ ఐడియాస్ ఉన్నాయి, చాలా గొప్ప ఆలోచనలు ఉన్నాయి, ఆబ్జెక్టివ్స్ చాలా గొప్పగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో ప్రస్తుత సమాజంలో వాడబడే ప్రతి మాటా గవర్నర్ ప్రసంగంలో ఉంది, ఏమాత్రం తేడా లేదు. విజన్ అన్నారు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అన్నారు, నాలెడ్జ్ పార్క్ అన్నారు, స్ట్రాటజిక్ ప్లానింగ్ అన్నారు, జీరో బేస్‌డ్ బడ్జెట్ అన్నారు, మైక్రో ప్లానింగ్ అన్నారు, కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ అన్నారు, చాలా రకాలుగా మాట్లాడారు. అధ్యక్షా, అగ్రికల్చర్ గ్రోత్ 6 శాతం, ఇండస్ట్రియల్ గ్రోత్ 11 శాతం, సర్వీసెస్ గ్రోత్ 12 శాతం పెంచటానికి ప్రయత్నం చేస్తామన్నారు. సంతోషం. మీరు చేయండి, మేము సంతోషిస్తాము. అధ్యక్షా, ఎప్పుడైనా, ఏ ప్రభుత్వమైనా ప్రతిసారి ఆలోచన చేయవలసినదేమంటే మనం చేస్తున్నదానివల్ల సమాజంలోని బీదవానికి ఏవిధమైన మేలుజరుగుతుందని ఖచ్చితంగా ఆలోచన చేయాలని మనవిచేస్తున్నాను. ఈ సంధర్భంగా మనకు స్వాతంత్ర్యం వచ్చిన రోజున 15.7.1947 నాడు జవహర్‌లాల్ నెహ్రూగారు మొట్టమొదటిసారిగా పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఒక ఉపన్యాసం చేశారు. ఆ ఉపన్యాసానికి ఒక టైటిల్ కూడా ఇవ్వడం జరిగింది. i.e., "TRYST WITH DESTINY". "The ambition of the greatest man of our generation has been to wipe out every tear from every eye. That may be beyond us but as long as there are tears and sufferings so long is the work unfinished." అధ్యక్షా, ఎన్నికలు వస్తూంటాయి పోతూంటాయి. ఎన్నికలలో నిలబడినప్పుడు చాలారకాలుగా ఆలోచనలు చేస్తూనే ఉంటాము. కొంతమంది డబ్బులో, మరొకటో, ఇంకొకటో ఎక్కువగా ఖర్చుపెట్టి గెలిచే ప్రయత్నాలు చేయటం జరుగుతుంది. ఏదేమైనా ఎన్నికల తరువాత అందరినీ కలుపుకుని పోవాలనే ఆలోచనను ప్రభుత్వాలు, అధికారంలో ఉన్నవారు చేయాలి, తప్పనిసరిగా చేయాలి. ఎన్నికలలో మేము ఓడిపోయాము, ఓడిపోయాము కాబట్టి ప్రతిపక్ష పార్టీగా ఉన్నాము. మీరు మమ్మల్ని విస్మరించారు, మా పార్టీకి సంభందించిన వారు మమ్మల్ని విమర్శించారు, మాకు తెలుసు. సామెతలు ఊరికనే రాలేదు. ఇంగ్లీషులో ఒక సామెత ఉంది, "Who is the general of defeating army" అని సామెత ఉంది. మరొక సామెత మీకు వర్తిస్తుంది, "Victory has got many fallacies". చంద్రబాబునాయుడి ఈ విక్టరీలో భాగం పంచుకున్న వారు చాలామంది ఉన్నారు, నిజంగా ఆ క్రెడిట్ వారికి ఇవ్వవలసిన అవసరం ఉంది. శ్రీశ్రీ గారు ఒకమాట చెప్పారు, "నిప్పులు చిమ్ముకుంటూ నింగికి నేను ఎగిరిపోతే నిబిడాశ్చర్యంతో వారు నెత్తురు కక్కుకుంటూ నేలకు రాలిపోతే నిర్దాక్షిణ్యంగా వీరే" అని అన్నారు. ఎన్నికల్లో మేము గెలుస్తామని మాతో భాగస్వామ్యం పంచుకోవాలని అన్నవారు మేము ఎన్నికల్లో ఓడిపోయిన తరువాత చేసిన విమర్శలు మేము మరచిపోలేదు. ఇవన్నీ కూడా మామూలే, రాజకీయంలో ఇవన్నీ కూడా సాధారణమే. దానికి మేమేమాత్రం బాధపడటం

లేదు, సమాజంలో ఇవన్నీ సర్వసాధారణం అనుకున్నాము. అప్పుడే ముందుకుపోగలుగుతాము. ఎన్నికల తరువాత ఒక నూతన ప్రక్రియ చేయబోతున్నాము. సమాజంలోని బడుగు వర్గాలవారికి మేలుచేయటానికి ప్రయత్నం చేస్తాము. ఆ కార్యక్రమంలో మనందరం కలసి కట్టుగా ముందుకుపోవాలని మనవిచేస్తున్నాను. ఈ మధ్య కాలంలో కొందరు 50 సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కాంగ్రెస్‌పార్టీ ఏమి చేసిందని అంటున్నారు. మన ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించి 1983 సంవత్సరం నుండి 1999 సంవత్సరం వరకు గడచిన 17 సంవత్సరాలను తీసుకుంటే కేవలం 5 సంవత్సరాలే కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉంది, మిగిలిన 12 సంవత్సరాలూ తెలుగుదేశం పార్టీనే అధికారంలో ఉంది. ఈరోజు మనకు ఉన్న అక్షరాస్యత శాతం 47 శాతం మాత్రమే. చాలా బాధాకరమైన విషయం. గడచిన 12 సంవత్సరాలు అధికారంలో ఉన్న మీరు ఏమేరకు బాధ్యత తీసుకుంటారు? నేను ఏవో విమర్శలు చేయటానికి ఇక్కడ నిలబడలేదు, విమర్శలు చేయటం నా ఉద్దేశ్యం కాదు, అందరం కలసి ముందుకుపోదాం. కేవలం ఒక మంచి ఆలోచనతోనే మేము ఇక్కడ నిలబడ్డాము. పదిమందికీ మేలుచేసే కార్యక్రమం చేపట్టాలనే ఆలోచన చేద్దామని కోరుతున్నాను. భారతదేశానికి స్వాతంత్ర్యం వస్తే భారతీయులే పరిపాలన చేసుకునే పరిస్థితే
11-20 ఉ. వస్తే ఇండియన్ విల్ డై ఆఫ్ స్టార్వేషన్ అని ఆ రోజున బ్రిటీష్ ప్రధాని విన్సటన్ చర్చిల్ అన్నారు. ఆ రోజున భారతదేశంలో వున్న 31 కోట్ల జనాభా మిగిలితే ప్రతి రోజు ఆకలి చావులే దేశంలో జరుగుతాయని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఏ మాత్రం కనీస అవసరాలు దేశంలో లేవు. స్కిల్డ్ లేబర్, ట్రెయిన్డ్ మ్యాన్ పవర్, ఎంటర్‌ప్రెన్యూర్ బేస్ లేదు. క్యాపిటల్ మార్కెట్స్ లేవు. ఆ రోజున వున్నదంతా అమాయక ప్రజలు. కేవలం 2 శాతం మాత్రమే ఆ రోజున అక్షరాస్యత వున్నది. నూటికి తొంబది ఎనిమిది శాతంగా వున్న నిరక్షరాస్యులను అన్ని విధాల ముందుకు తీసుకురావాలి ఈ దేశంలో దళిత, గిరిజన, బడుగువర్గాల వారిని ఎన్నో విధాలుగా ముందుకు తీసుకు రావాలి. బలహీన వర్గాల వారికి ఆర్థిక, సాంఘీక ప్రయోజనాలు యివ్వగలగాలి. ఈ విధమైన కార్యక్రమాలు చేద్దామనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం మొదలు పెట్టిందని మనవిచేస్తున్నాను. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ప్రతి విషయంలోను జాగ్రత్తగానే ఆలోచన చేశాము. దేశంలో, రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి తీసుకురావడం, ప్రభుత్వాలకు సంబంధించిన సంస్థలను ఇంకా ఎక్కువగా ఎస్టాబ్లిష్ చేయడం, ఈ రాష్ట్రంలో వున్న పరిస్థితి చెప్పుకోవాలంటే బి.హెచ్.ఇ.ఎల్., ఇ.సి.ఐ.ఎల్., ఐ.డి.పి.ఎల్., హెచ్.ఎ.ఎల్; హెచ్.ఎం.టి., మిథాని, విశాఖపట్టణం స్టీల్ ప్లాంట్, ఎన్.ఎఫ్.సి., బి.డి.ఎల్., మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ఐ.ఎన్.పి.పి., డి.ఎం.ఆర్.ఎల్ డి.ఆర్.డి.ఎల్., డి.ఎల్.ఆర్., ఎస్.ఐ.ఎన్., మరియు డి.ఇ.ఎల్ ఈ సంస్థలన్నీ కూడా కాంగ్రెస్‌పార్టీ అధికారంలో వున్నప్పుడే వచ్చాయి.

(చప్పట్లు)

మేము అధికారంలో వున్నప్పుడు వచ్చిన ఈ సంస్థల ద్వారా ఏదో నాలుగు వందలో మందికో, ఇంజనీర్లకో, పెద్ద, పెద్ద ఆఫీసర్లకో ఉద్యోగాలు యివ్వడం కాదు ముఖ్యం. 400, 500 మంది ఆఫీసర్లు వుంటే 10వేల మందో 20 వేల మందో బీద వర్గాలకు

సంబంధించిన వారు వున్నారు. దళితజాతులకు సంబంధించిన వారు వుంటారు. బంహీన వర్గాలకు సంబంధించిన వారు వుంటారు. వాళ్ళకు అన్ని విధాల మేలు చేయాలని, వాళ్ళకు ఒక విధమైన ప్రయోజనాలు కల్పించాలని, ఉద్యోగావకాశాలు పెంపొందింప చేయాలని చేసిన ప్రయత్నమని మనవిచేస్తున్నాను. ఉదాహరణకు ఐ.డి.పి.ఎల్. తీసుకుందాము. అది ముప్పది సంవత్సరాల క్రితం ఈ రాష్ట్రంలో స్థాపించబడ్డది. ఐ.డి.పి.ఎల్.లో ట్రెయిన్డ్ అయిన సైంటిస్ట్సు కొంతకాలానికి బయటకు వచ్చి వారంతకు వారుగా పరిశ్రమలు స్థాపించారు. వారికి ఎ.పి.ఎస్.ఐ.డి.సి. లాంటివో, ఎ.పి.ఎస్.ఎఫ్.సి.నో మరొకటో ఈ ఆర్థిక సంస్థల ద్వారా వారికి కొంత చేయూతనిచ్చి వారిని ముందుకు తీసుకుని వచ్చాము. ఇవాళ భారతదేశంలో 40 శాతం ఫార్మాసిటికల్ ఇండస్ట్రీస్ ఈ హైదరాబాద్‌లో వున్నాయంటే ఇది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఘనత తప్ప మరొకటి కాదని మనవిచేస్తున్నాను. సిరీస్ లాంటి సంస్థలోని ఒక టెక్నిషియన్ బయటకు వచ్చి ఒక సిమెంట్ పరిశ్రమ స్థాపించాలని ముందుకు వస్తే ఐ.డి.సి. దాదాపు రెండు కోట్లు రూపాయల వరకు సహాయం చేసింది. ఆ రోజున ఐ.డి.సి. ఇన్వెస్ట్ చేసిన రెండు కోట్లు రూపాయలు ఈ రోజు 40 కోట్లు రూపాయలు అయింది. అంతమటుకే కాదు ఆ ఫ్యాక్టరీ ద్వారా ఏమేరకు బీద వర్గాల వారు బాగుపడ్డారో, ఎంత మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయో, వాటికి సంబందించిన సబ్సిడీల్లో కంపెనీలు ఏవిధంగా వచ్చాయో ఆలోచించాలి. ఈ రాష్ట్రంలో 1997-98వ సంవత్సరం ఎకౌంట్స్ ప్రకారం ప్రభుత్వానికి సంబంధించిన ఆదాయం 13 వేల 841 కోట్ల రూపాయలు. ఏవిధంగా వస్తుందని అడుగుతున్నాను. ఇది కేవలం సేల్స్ ట్యాక్స్, షేర్ ఇన్ సెంట్రల్ సేల్స్ ట్యాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కంట్యాక్స్ వీటివలన వచ్చిన ఆదాయం కాదా అని నేను అడుగుతున్నాను. ఈ ఆదాయం ఎవరు కంట్రిబ్యూట్ చేస్తున్నారు. ఇన్ని సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పితే, ఆ పరిశ్రమల ద్వారా వచ్చిన ఆదాయాలు ఈ రోజు రాష్ట్రానికి సంబంధించిన ఆదాయంగా 100 కి 90 శాతం వుంటుంది తప్ప మరొకటి కాదని మనవిచేస్తున్నాను.

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండగా ఈ రాష్ట్రానికి సంబంధించి నాగార్జునసాగర్, శ్రీశైలం, మాచ్‌ఖండ్, లోయర్--సీలేరు, అప్పర్ సీలేరు,--బలిమెల,-- పోచంపాడు ప్రాజెక్టులు, రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ గోదావరి బ్యారేజ్ ఇవన్నీ కూడా వచ్చాయి. వీటిద్వారా దాదాపు కోటి పదిలక్షల ఎకరాల వ్యవసాయ భూమిని ఇరిగేషన్ క్రిందకు తీసుకువచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని సవినయంగా మనవి చేస్తున్నాను.

(కాంగ్రెస్ పక్షం నుంచి చప్పట్లు)

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రామారావుగారు ముఖ్యమంత్రి అయిన తరువాత మొదలు పెట్టబడ్డ తెలుగుగంగ ప్రాజెక్టు గురించి చాలా ఘనంగా చెప్పుకున్నాము. గడచిన 17 సంవత్సరాల చరిత్రలో 1983వ సంవత్సరం నుంచి 12 సంవత్సరాలు తెలుగుదేశం పార్టీ చరిత్ర అయితే, 5 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ మధ్యలో పరిపాలన చేస్తే వారి పరిపాలనలో ఎంతెంత ఖర్చు పెట్టారనేది దయచేసి ఒక్క క్షణం

ఆలోచన చేయాలి. మొత్తంమీద ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగారు చాలా రకాలుగా తనను తాను ప్రాజెక్టు చేసుకోగలిగి దాని వలన రాష్ట్రానికి కూడా ఎంతో కొంత మేలు తీసుకు వచ్చే ప్రయత్నం ఎక్కడికక్కడ జరుగుతూ వున్నది. కలకత్తాలో ఒక సి.ఐ.ఎ. మీటింగ్ అయితే ఢిల్లీలో మరొక సి.ఐ.ఎ. మీటింగ్ అయితే, ఇక దేశానికి సంబంధించిన రాయబారులు ఒక అరడజను మందిని కలిసి మరొక మీటింగ్ పెట్టి ఆ దేశానికి సంబంధించిన రాయబారులను మా రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు పెట్టమని చెప్పి అడిగినట్లు వింటున్నాము. ఇంకోసారి ఆయన ప్రపంచానికి సంబంధించిన డ్రీమ్ క్యాబినెట్‌లో మెంబర్ అయ్యారని చెప్పారు. ఓహో అనుకున్నాము. ఇంకోసారి ఆయనగారు అమెరికాకు వెళ్ళి అక్కడి నుంచి ఫారిన్ ఇన్వెస్ట్మెంట్స్ తీసుకువస్తారని అంటే సంతోషించాము. మరొకసారి మలేషియాకు వెళ్ళి హౌటాన్ కార్ల ఫ్యాక్టరీ వస్తుంది, దారిలో వున్నది. మరో వారం రోజులకో, 15 రోజులకో విశాఖపట్టణంలో అన్‌లోడ్ అవుతుంది ఫ్యాక్టరీ అంటే ఆహా అనుకున్నాము. డ్రీమ్ క్యాబినెట్‌లో మెంబర్ అయితే ఇలాంటి అవార్డులు అయితే మనకు వచ్చాయి కానీ రివార్డులు మటుకు ఎక్కడా కనపడడం లేదు. ప్రపంచబ్యాంకుల నుంచి అప్పులు తీసుకువస్తున్నాము. అవసరం మేరకు అప్పులు తీసుకురండి. కానీ అప్పుల కంటే కూడా ఎక్కువగా ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్ ఏ మేరకు తీసుకువచ్చారు? నేరుగా ఇతర దేశాలు మన రాష్ట్రంలో పెట్టుబడులు ఏ మేరకు పెడుతున్నాయి? కనీసం నాన్‌కోర్ సెక్టార్స్‌కు సంబంధించిన ఫారిన్ డైరెక్ట్ ఇన్వెస్ట్మెంట్స్, విదేశాలకు సంబంధించిన 25 కోట్ల రూపాయలు నేరుగా పెట్టుబడి పెట్టిన పరిశ్రమలు, గడచిన నాలుగు సంవత్సరాలలో ఒక్కటయినా వచ్చిందా అని నేను అడుగుతున్నాను. అధ్యక్షా, తేది 31.3.99లో కేంద్ర
11.30 ఉ. ప్రభుత్వం ఇండస్ట్రీస్ డిపార్ట్మెంట్ వారు, ఈ దేశానికి సంబంధించిన వివిధ రాష్ట్రాల వారికి నేరుగా వచ్చిన పెట్టుబడుల లిస్టు ఇచ్చారని ఆ లిస్టులో కనీసం ఆంధ్రప్రదేశ్ పేరుకూడా లేదు. ఆ లిస్టులో మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, కర్నాటక మరియు తమిళనాడు ఉన్నాయి.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులచే షేమ్, షేమ్ అని నినాదాలు)

తమిళనాడులాంటి రాష్ట్రం ఎక్కడా మాట్లాడకుండానే, పెద్ద పెద్ద అడ్వర్టయిజ్‌మెంట్లు వార్తాపత్రికలలోకి రాకుండానే హుండై కార్ల ఫ్యాక్టరీ, ఫోర్డ్ కార్ల ఫ్యాక్టరీ, మిత్సుబిషి లాన్సర్ కార్ల ఫ్యాక్టరీలను సంపాదించుకుంది. కాని మన రాష్ట్రం అడ్వర్టయిజ్‌మెంట్ బడ్జెట్ క్రింద 350 కోట్ల రూపాయలు ఖర్చు చేసి, వీలున్న చోటల్లా ట్రంప్ బీటింగ్ చేసుకుంటూ మీడియాలో మనకు సంబంధించిన గొప్పలు చెప్పుకుంటున్నా ఒక్క ఫ్యాక్టరీ కూడా రాలేదు. ఉన్న ఫ్యాక్టరీలు మూత పడుతున్నాయి. కొత్త ఫ్యాక్టరీలు రానట్లయితే నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు ఏవిధంగా వస్తాయో ఆలోచించండి. ముప్పై నలభై సంవత్సరాల క్రితం జవహర్‌లాల్ నెహ్రూగారు స్పేస్ టెక్నాలజీ, అటమిక్ ఎనర్జీ గురించి ఆలోచన చేశారు. ఆ ఆలోచన ఉన్న మోడ్రన్ లీడర్ ఆఫ్ ది డే రాజీవ్‌గాంధీగారి కాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి సంబంధించి ఒక విప్లవం జరిగింది. పది లేక పన్నెండు సంవత్సరాల క్రితం సాధారణ మానవుడు ఫోన్ చేసుకోవాలంటే టెలికామ్ ఆఫీసుకు వెళ్ళి

గంటలు గంటలు కూర్చోని చేసుకోవలసి వచ్చేది. అప్పుడు ట్రంకాల్స్ తప్ప మరొక మార్గం లేదు. కాని ఈ రోజు ప్రతి గ్రామంలో ఎస్.టి.డి. బూత్స్ వెలిశాయి. ఆ రోజులలో జవహర్‌లాల్ నెహ్రూగారు, శ్రీమతి ఇందిరాగాంధీగారు, రాజీవ్ గాంధీగారు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, అట్టడుగున ఉన్న గ్రామాలలోని నిరుపేదలకు ఏ విధంగా మేలు జరుగుతుందని ఆలోచన చేశారు. ఆ విధంగా ముందుకు పోవాలే తప్ప టెక్నాలజీ అనేది టెక్నాలజీ కొరకు కాదని మనవి చేస్తున్నాను. అంతకుముందు ఇందిరాగాంధీగారు చేసిన కార్యక్రమాన్ని రాజీవ్‌గాంధీగారు ఒక క్రొత్త ప్రక్రియలో ముందుకు తీసుకు వెళ్ళడం వల్ల ఈ దేశంలో యెల్లో రెవెల్యూషన్ వచ్చింది.

1986-87లో ఒక డాలరు విలువ రు. 18లు ఉన్నప్పుడు రు. 1500 కోట్ల విలువ చేసే ఆయిల్ సీడ్స్‌ను మనము దిగుమతి చేసుకున్నాము. 1996-97వ సంవత్సరంలో ఆయిల్ సీడ్స్ ప్రొడక్షన్ పదకొండు మిలియన్ టన్నుల నుంచి 27 మిలియన్ టన్నులకు పెరిగింది. సరిగ్గా పది సంవత్సరాలలో ఆయిల్ సీడ్స్‌ను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి మన దేశం వచ్చింది. సర్వే ఆఫ్ ఇండియన్ అగ్రికల్చర్ అని "హిందూ"కి సంబంధించి పుస్తకంలోని కొటేషన్ ఇది. "From a mere 11 million tonnes of Oil Seed Production in 1986, the country has attained 27 million tonnes in 1996-97. This was possible mainly due to "Yellow Revolution". ఇటువంటిది ఎక్కడా జరుగలేదు. ఇది ఒక వరల్డ్ రికార్డ్.

కాంగ్రెసు పార్టీ "ఆపరేషన్ ఫ్లడ్, వైట్ రెవల్యూషన్" ద్వారా అభివృద్ధి పథంలో మన దేశాన్ని ముందుకు తీసుకుపోయింది. ఈ రోజు మినరల్ వాటర్ కంటే పాలు చాలా సరసమైన ధరలకు దొరుకుతున్నాయి. గ్రామీణ వ్యవస్థను ఆదుకుందామనే ఉద్దేశ్యంతో గ్రామాల ఆర్థిక వ్యవస్థను ముందుకు తీసుకువెళ్ళాలనే దృక్పథంతో ఆ విధంగా చేయడం జరిగింది. ఆనాడు ఇందిరాగాంధీగారు బ్యాంకులను నేషనలైజ్ చేసి, ఆ బ్యాంకుల ద్వారా అట్టడుగున ఉన్న వారికి గొర్రెల, బర్రెల, పాడి ఉత్పత్తిని పెంచుటకు కోటానుకోట్ల రూపాయలు రుణాలు ఇవ్వడం జరిగింది. ఆ ఆలోచన ద్వారా వైట్ రెవల్యూషన్ వచ్చిందని మనవి చేస్తున్నాను.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారు సాఫ్ట్‌వేర్ గురించి, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి ప్రపంచంలోనే మన రాష్ట్రాన్ని అగ్రగామిగా చేస్తానని చాలా రోజుల నుండి అంటున్నారు. దానిలో భాగంగానే ఎల్ అండ్ టి వి ఒప్పించి వారితో హైటెక్ సిటీని కట్టించారు. అమెరికా వెళ్ళినప్పుడు చాలా రకాలైన ఆలోచనలు చేసి సాఫ్ట్‌వేర్ రంగాన్ని వీలైనంత ఎక్కువగా మన రాష్ట్రంలో ముందుకు తీసుకువెళ్ళడానికి ప్రయత్నాలు చేశారని వార్తాపత్రికలలో చదువుతున్నాము, చూస్తున్నాము.

1994-95వ సంవత్సరంలో మూడవసారి తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు మన దేశం యొక్క సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ రు. 250 కోట్లు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి రు. 22 కోట్లు అంటే తొమ్మిది శాతం. 1998-99 సంవత్సరంలో సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రు. 22 కోట్ల నుండి రు. 575 కోట్లు అయిందంటే వంకలు పెట్టుకునే పరిస్థితి కాదు. 1998-99 వ సంవత్సరములో భారతదేశానికి సంబంధించి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రు. 6,300 కోట్లు. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కేవలం రు. 575 కోట్లు అంటే తొమ్మిది శాతం మాత్రమే. కర్నాటక రాష్ట్రం మనంత ట్రంప్ బీటింగ్ లేకుండానే, మనంత గొప్పలు చెప్పుకుండానే వారి సాఫ్ట్‌వేర్ ఎగుమతులు రు. 2,888 కోట్లు ఉంది. పాండిచ్చేరికి సంబంధించి రు. 1450 కోట్లు. తమిళనాడుకు సంబంధించి రు. 800 కోట్లు ఉంది. దేశంలో అన్ని రాష్ట్రాల కంటే సాఫ్ట్‌వేర్ ఎగుమతులు పెరిగితే సంతోషిస్తాము తప్ప. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా కేవలం తొమ్మిది శాతంలోనే మిగిలిపోయినందుకు చాలా బాధ పడుతున్నాము.

11-40 ఉ. ఎక్కడైనా ఇతర సంస్థలనుంచిగాని, ప్రపంచ బ్యాంకునుంచి గాని, మరొక చోటినుంచిగాని అప్పులు తీసుకుని, ఆ అప్పులతో కేపిటల్ ఎసెట్స్ సమకూర్చుకొనగలిగితే చాలా సంతోషం. ఫిస్కల్ డెఫిసిట్ వుండడం మూలంగా చాలా నష్టపోయాం, చాలా ఇబ్బందికరమైన పరిస్థితి వుందని నేను అనడంలేదు. అంతో ఇంతో ఫిస్కల్ డెఫిసిట్ వున్నా ఫరవాలేదు. కాని రెవెన్యూలో డెఫిసిట్ వచ్చి, మనం బయటినుంచి తెచ్చే అప్పులతో కేపిటల్ ఎసెట్స్ క్రియేట్ చేసుకొనే పరిస్థితి లేకుండా జీతభత్యాలకే రెవెన్యూ పోతుంటే చాలా రకాలైన ఇబ్బందులు వస్తుంది రాష్ట్రం. అల్టిమేట్‌గా బ్యాంక్రప్టసీలోకి పోతుందని చెప్పకతప్పదు.

అధ్యక్షా, ఈ సందర్భంగా "కాగ్" రిపోర్టును కోట్ చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. CAG Report of the Year ending 31-3-1998 at Page 14 చూచినట్లైతే 1993-94వ సంవత్సరంలో, అంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో వున్న చివరి సంవత్సరంలో రాష్ట్రానికి సంబంధించి మొత్తం ఎసెట్స్ రూ. 13,252 కోట్లు వుంటే లయబిలిటీస్ రూ. 13,088 కోట్ల రూపాయలు. ఇక 1997-98 సంవత్సరం వచ్చేసరికి ఎసెట్స్ రూ. 18,192 వేల కోట్ల రూపాయలు వుంటే లయబిలిటీస్ రూ. 23,411 కోట్లు అయ్యాయి. I am quoting CAG Report only. It would be seen that in the last five years more and more of the borrowed funds have been applied for meeting the revenue expenditure. In fact in 1996-97 all of the net borrowings together with a portion of recoveries and loans and advances was spent on revenue expenditure. Assets vs. Liabilities ratio indicates solvency of the Government. In 1993-94 Government was solvent. In case of Andhra Pradesh this ratio has declined sharply from 1.01 in 1993-94 to 0.78 in 1997-98 indicating taht the liabilities have grown at faster rate than assets.

Ultimately in CAG report at Page No. 40 it is said, "However, it continued to compromise fiscal stability at the altar of ambitious Annual Plan where the State Government has neither means to finance nor capability to fulfil." మన దగ్గర ఏమీ లేక పోయినా ఏవో చేస్తామని గొప్పలు చెప్పుకోవడం తప్ప అల్టిమేట్‌గా ఏమీ జరగడం లేదు. రాష్ట్రం బ్యాంకరప్టసీలోకి పోయింది. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉన్నాయి. దివాలా కోరు పరిస్థితులు ఉన్నాయని "కాగ్" నిర్ద్వంద్వంగా చెప్పినా దానిగురించి మనం పట్టించుకోకపోతే చాలా రకాల ఇబ్బందులు పడతాం. 1998-99వ సంవత్సరానికి ఈ డెఫిసిట్ రూ. 5,300 కోట్లు అయితే ఈరోజుకు డెఫిసిట్ రూ. 8016 కోట్ల రూపాయలకు పెరిగింది. అంటే చాలా మైనస్‌లో ఉన్నాం. ఇప్పటికే మన స్టేట్ హయ్యస్ట్ టాక్స్‌డ్ స్టేట్. ఈ రాష్ట్రంలో ఎంప్లాయ్‌మెంట్ గ్రోత్ లేదు. There is negative growth in employment. దాదాపు 4 వేల కోట్ల రూపాయల ఇండస్ట్రియల్ ఎసెట్స్ రాష్ట్రంలో వేస్ట్‌గా పడివున్నాయి. చాలా పెద్ద పెద్ద ఫ్యాక్టరీస్, అలాగే-మీడియం స్కేల్ ఫ్యాక్టరీస్ గాని, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్‌గాని పూర్తిగా ఫెయిలైపోయి వున్నాయి. ఏ విధమైన ప్రొడక్టివిటీ రావడంలేదు. నిష్ప్రయోజనంగా, నిస్త్రాణంగా ఈ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఒక ఫ్యాక్టరీ మూలన పడివుంది అంటే దానిని తెరిపించవలసిన అవసరం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా, లేదా? కేంద్ర ప్రభుత్వానికి ఉందా, లేదా. అందుకు మీకు కేంద్రంతో మీకు ఉన్న ఇన్‌ఫ్లుయన్స్‌ను ఎందుకు వాడుకోవడంలేదు. అని అడుగుతున్నాము. ఏదైతే 4 వేల కోట్ల రూపాయల మేరకు ఇండస్ట్రియల్ ఎసెట్స్ వేస్ట్‌గా వున్నాయో అందులో ప్రైవేట్ పెట్టుబడులు దాదాపు నిల్. అందులోని పెట్టుబడులు పూర్తిగా బ్యాంకులవి. అవి ఐ.డి.బి.ఐ. వో లేక ఎస్.ఎఫ్.సి.వో లేక మరొక ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్‌వి అయి వుంటాయి తప్ప వేరే కాదు. ఇంత పెద్ద మొత్తంలో ప్రభుత్వంనుంచి పెట్టుబడులు పెట్టిన ఆస్తులు వేస్ట్‌గా పడివుంటే కేంద్రానికి సంబంధించిన చట్టాలైనా సవరించి, బి.ఐ.ఎఫ్.ఆర్.కు సంబంధించిన చట్టాన్ని సవరించి, వాటికి మదుపు పెట్టించి అయినా సరే, ఏదో విధంగా చేసి తొందరగా వీటిని గాడిలోకి తీసుకువచ్చి పట్టాలు ఎక్కించవలసిన అవసరం ఎంతైనా ఉంది. దయచేసి దీని గురించి ఆలోచించండి. అదే విధంగా ఫెయిలై పడిన పరిశ్రమలను తెరిపించి సక్రమ మార్గంలో పెట్టినప్పుడే రాష్ట్రం ప్రగతిపథంలో ముందుకు పోగలుగుతుందని మనవిచేస్తున్నాను. "వేర్ దేరీజ్ ఎ విల్, దేరీజ్ ఎ వే" అని ముఖ్యమంత్రిగారు చాలాసార్లు అంటుంటారు. అందువల్ల గట్టిగా ఆలోచన చేయండి. 4 వేల కోట్ల రూపాయల విలువైన ఇండస్ట్రియల్ ఎసెట్స్‌ను ఏదోవిధంగా రక్షించండని అంటున్నాను. రాష్ట్రప్రభుత్వం 39 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించే కార్యక్రమంలో ఉంది. ప్రొద్దుటూరుకు సంబంధించిన మిల్క్ ఫ్యాక్టరీ 4 సంవత్సరాలుగా మూతపడి ఉంటే దానిని తెరిపిస్తామని అంటున్నారు తప్పితే దానిని తెరిపించే పరిస్థితి కనిపించడంలేదు. అన్ని విధాలుగా ఇబ్బంది పడుతున్నాం. అసలు ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలనే ఆలోచన ఎందుకు వచ్చిందో చెప్పండని కోరుతున్నాను. ఆ ఆలోచనతో ముందు ప్రభుత్వ రంగ సంస్థలను నష్టాల ఊబిలోకి దింపాలి. ఆ తరువాత ప్రైవేటీకరణ చేయాలనో ఒక కుట్ర జరుగుతోందా అనిపిస్తోంది. ఉదాహరణకు మినరల్ డెవలప్‌మెంట్

కార్పొరేషన్ విషయం తీసుకొంటే గడచిన 5 మాసాలుగా ఈ కార్పొరేషన్‌కు సంబంధించిన ఎంప్లాయీస్, కార్మికులు కూడా నిరవధిక నిరాహార దీక్షలు దారి లేక రిలే నిరాహార దీక్షలుగాని చేస్తున్నారు. వారు జీతం పెంచమని కానీ లేక ప్రమోషన్లు ఇవ్వాలని కానీ, లేక ఇంకొకటిగానీ అడగడం లేదు. వారు అడుగుతున్నదల్లా మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను నష్టాల ఊబిలోకి నెట్టవద్దు. అక్కడ వున్న మేనేజింగ్ డైరెక్టర్‌గారు, ఛైర్మన్‌గారు కొంత మంది ప్రైవేటు వ్యాపారస్థులతో కలిసి ఈ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ధ్వంసం చేస్తున్నారు, తినివేస్తున్నారు,- దయచేసి ఆపండి అని అడుగుతున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇది ఒక విధంగా కొంగ తపస్సు తప్ప మరొకటి కాదు. అక్కడ వున్న ఉద్యోగులు గత 5 మాసాలుగా ఇలాంటి ఉద్యమాలు చేస్తుంటే పట్టించుకోవడం లేదు. అక్కడి మేనేజింగ్ డైరెక్టర్, ఛైర్మన్ కొంత మంది ప్రైవేటు వ్యాపారస్థులతో కుమ్మక్కయి నష్టాల ఊబిలోకి నెట్టి తరువాత ప్రైవేటీకరణ చేసి తెలుగుదేశం పార్టీకి సంబంధించిన కొంత మంది నాయకులకు అప్పనంగా అప్పజెప్పాలనే ప్రయత్నం జరుగుతోందని వారు ఉద్యమిస్తే ఏ చర్యా లేదు. పైగా గడచిన 3, 4 సంవత్సరాలుగా ఆ కార్పొరేషన్‌కు ఇన్‌ఛార్జ్‌గా వున్న ఒక ఐ.ఎ.ఎస్ ఆఫీసర్‌ను, ఒక వారం రోజుల క్రితం రెగ్యులర్ ఛార్జ్‌గా నియమించారు. సేమ్ ఐ.ఎ.ఎస్. ఆఫీసరును, గడచిన 3, 4 సంవత్సరాలుగా ఇన్‌ఛార్జ్‌గా వున్న ఆఫీసరును రెగ్యులర్‌గా నియమించారంటే ఇంతకంటే అన్యాయమైన పరిస్థితి మరొకటి ఉండదు. మీకు ఇంకో మంచి ఆఫీసర్ దొరకలేదా? 4, 5 మాసాలుగా ఉద్యమం చేస్తున్న కార్మికులు మీకు కనపడడంలేదా అని అడుగుతున్నాను. ఎందుకు ఈ విధంగా చేస్తున్నారు. మీకు ఏమైనా ప్రత్యేక శ్రద్ధ ఉంటుందని నేను అనుకోను కాని అందుకు కారణం ఏమిటో చెప్పమని నేను కోరుతున్నాను. ప్రతి విషయంలోనూ గ్లోబలైజేషన్ అంటున్నారు, ప్రైవేటైజేషన్ అంటున్నారు. కాని ప్రాఫిట్ మేకింగ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్‌ను ప్రైవేటైజేషన్ చేస్తే చాలా నష్టం, చాలా తప్పు, ఇంతకంటే పాపం మరొకటి వుండదని మనవిచేస్తున్నాను. You are trying to replace the Government monopoly by Private monopoly. గవర్నమెంట్ మొనాపలీ తీసివేసి ప్రైవేట్ మొనాపలీని తీసుకురావడానికి ప్రయత్నం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇండియన్ ఎయిర్ ట్రాఫిక్‌ను ప్రైవేటీకరణ చేసింది. ఎయిర్ ట్రాఫిక్‌ను ప్రైవేటీకరణ చేసిందే కాని ఎయిర్ లైన్స్‌లో మరొక ఎయిర్ లైన్స్‌లో ప్రైవేటీకరణ చేయలేదు. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు సమాంతరంగా ఇంకో ఎయిర్‌లైన్స్ వస్తే హెల్తీ కాంపిటేషన్ వుంటుంది, హెల్తీ కాంపిటేషన్ వుంటే మంచిదన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ఆ పని చేసింది, కాని ఇక్కడ మీరు ఏం చేస్తున్నారో దయచేసి ఆలోచించండి అని ముఖ్యమంత్రిగారిని కోరుతున్నాను.

11.50 ఉ. అధ్యక్షా, మీద్వారా మనవి చేస్తున్నాను ఈ రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్ల పెట్టుబడిని పెట్టి, లాభాల బాటలో పయనిస్తున్న కాకినాడ పోర్టును ప్రయివేటీకరణ చేసింది దాని వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి వస్తున్న మేలు ఏమిటో

దయచేసి ఆలోచించమని కోరుతున్నాను. కేవలం కొంత మంది ప్రయివేటు పెట్టుబడుదారులకు, కంట్రాక్టర్లకు మేలు చేసే కార్యక్రమం జరగబోతున్నది. నేను అంటున్నాను – అది గవర్నమెంటు పోర్టు. గవర్నమెంట్ మోనోపలి ఉన్న పోర్టు అది. దానిని తీసుకొని వచ్చి ప్రయివేట్ కంట్రాక్టర్లకు అప్పజెప్పడం ఎక్కడ న్యాయం అని అడుగుతున్నాను. దీనిని ర్యాపిడ్ క్యాపటిలిస్ట్స్ ఒప్పుకోరు. అమెరికా, యూరప్ వంటి దేశాల్లో క్యాపిటిలిస్ట్ ఉన్నారు. వారు కూడ ఈ విధంగా గవర్నమెంట్ మోనోపలీని తీసుకొని, ప్రయివేట్ మోనోపలీకి ఇవ్వమని అనరు. మీర్లు అంతగా ప్రయివేటీకరణ చేయాలంటే, కాకినాడ పోర్టు ప్రక్కనే ఇంకొక ప్రయివేట్ పోర్టుకు పర్మిషన్ ఇవ్వండి. ఇంకొక ప్రయివేట్ కంట్రాక్టరుకు కొత్తగా పోర్టు కట్టుకొనే దానికి పర్మిషన్ ఇవ్వండి., దాని వల్ల లాభాలు సాధించి, ఆర్జించి అందులో ఏమైన ప్రభుత్వానికి భాగము ఇవ్వమని చెప్పండి. అంతే తప్ప లాభాల బాటలో పయనిస్తున్న కాకినాడ పోర్టును ఎందుకు ప్రయివైటైజ్ చేయవలసి వచ్చిందో అది మీకే తెలియాలి. అది మీ ఆత్మసాక్షికే తెలియాలి.

ఇక గంగవరం పోర్టు విషయానికి వస్తే, కేంద్రప్రభుత్వం అంటున్నది – విశాఖపట్టణం పోర్టే గంగవరం పోర్టును టేకోవర్ చేయడానికి సిద్ధంగా ఉందని. గంగవరం ఎస్సైనర్ పోర్టు, రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు ఉన్న పోర్టు అది, మాకు అప్పజెప్పండి, మేము దానిని డెవలప్ చేస్తాం అంటే మేము ఇవ్వం కాక ఇవ్వం, విశాఖపట్టణం పోర్టును డెవలప్ చేసే అవకాశం లేదు, మేము దానిని ప్రయివేటీకరణ చేస్తాం అంటున్నారు.

ఈ విధంగా మనం చేసే నిర్ణయాలు కొంత తప్పుదోవలో పోతే, అది రాష్ట్రానికి మంచిది కాదు, రాష్ట్ర ప్రజలకు ఏ మాత్రం మంచిది కాదని మనవి చేస్తున్నాను.

అధ్యక్షా, ఏదేశంలో అయినా, ఏ రాష్ట్రంలో అయినా ప్రజలు వాడే "ఏవరేజ్ పవర్" అనేది ఎకనామిక్ ఇండికేటర్‌గా ఉంటుంది. గ్రోత్ అనే దానిని ఆ విధంగా చెప్పడానికి అవకాశం ఉంటుంది. మన రాష్ట్రంలో ఏవరేజ్ కంజంప్షన్ ఆఫ్ పవర్ పర్ ఇండివిడ్యుయల్ కేవలం 300 యూనిట్లు మాత్రమే. అయితే కొన్ని విదేశాల్లో ఇది 6 వేల యూనిట్లు కూడ ఉంది. అంటే వాళ్లతో పోల్చి చూసుకొంటే, మన యొక్క పవర్ యూసేజ్ చాల తక్కువగా ఉంది. పవర్ క్యాపిటల్ పర్ కంజంప్షన్ చాలా తక్కువగా ఉంది. కాని అధ్యక్షా, పవర్ యూసేజ్ పెరగాలంటే "గ్రోత్ ఇన్ డిమాండ్". నిజంగా పెరగాలంటే ఏదైన ఒక పర్టిక్యులర్ క్లాస్‌కు పవర్ అవేలబుల్‌గా ఉండాలి. అఫోర్డబుల్‌గా ఉండాలి. నిన్న నాతో కొంత మంది అంటున్నారు – మెరిడేజ్ కారు ధర రూ.28 లక్షల నుండి రూ. 23 లక్షల రూ.లకు పడిపోయిందని. అది 28 లక్షల రూ.లు ఉంటే ఏమిటి, 23 లక్షల రూ.లకు ఉంటే ఏమిటి సెకండ్‌హ్యాండ్ కారులో తిరగే నాకు దాని వల్ల ఏమి తేడా ఉండదని చెపుతున్నాను. అట్లాగే పవర్ చీప్‌గా దొరికితే, ఎఫోర్డబుల్‌గా ఉంటే దాని వల్ల రాష్ట్ర ప్రగతి భవిష్యత్‌లో ముందుకు పోగలుగుతుంది. ఈ రోజు మొత్తం దేశంలో One of the

highest power charged State is Andhra Pradesh. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న విద్యుత్ ఛార్జీలు మిగిలిన ఏ రాష్ట్రంలో కూడ లేవు అంటే అతిశయోక్తి కానేకాదు. అని చెపుతున్నాను. అధ్యక్షా, ఛాయిస్ ఆప్ పవర్ జనరేషన్ ఉండాలి నోడౌట్ అబౌట్ ఇట్, వీలున్న చోటల్లా పవర్ జనరేషన్‌ను పెంచాలి. కాని ఎటువంటి సోర్స్ ఆఫ్ పవర్ మనకు అతి తక్కువ ధరలో లభ్యం అవుతుందో, ఏ పవర్ జనరేషన్ సరసమైన ధరలకు లభిస్తుందో, అందుకు ఎటువంటి వనరులు మన రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నాయో లేదో చూడాలి. ఆ విధంగా ఈ రాష్ట్ర ప్రభుత్వం చేసిందా అని అడుగుతున్నాను. జల విద్యుత్‌ను చాల తక్కువ ఖర్చుతో ఉత్పత్తి చేయవచ్చు. తరువాత తక్కువ రేటుకు వచ్చేది గ్యాస్, కోల్. అధ్యక్షా, మన రాష్ట్రంలో ఉన్న మొత్తం బొగ్గు అంతా నాన్-మెటలార్జికల్ పర్పసెస్ కొరకే. ఇది కెమికల్‌గా పనికి రాదు. కేవలం కుకింగ్ కోల్ మాత్రమే. దానిని సంబంధిత ఫ్యాక్టరీలోనో, లేకపోతే పవర్ స్టేషన్‌లోనో కాల్చుకోవాలి. వాటి గురించి ఆలోచించకుండా, 1995వ సంవత్సరం, మార్చిలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలోకి వచ్చిన కొత్తలో పాతేన్‌ధయ్యా ఆఫీసర్ ఆధ్వర్యంలో ఒక కమిటీ వేయించి, ఆ కమిటీ ద్వారా దాదాపు 11 వేల మెగావాట్ల పవర్‌ను చాల త్వరగా ఉత్పత్తి చేయాలని చెప్పి రిపోర్టు తీసుకోవడం జరిగింది. అయితే ఆ కమిటీ ఏ విధమైన సోర్స్ ఆఫ్ పవర్ జనరేషన్ కావాలో చెప్పలేదు. రాబోయే మూడు, నాలుగు సంవత్సరాల్లో 11 వేల మెగావాట్ల అదనపు విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవాలని మాత్రం చెప్పడం జరిగింది. కేవలం 18 నెలల్లోనే మీ ప్రభుత్వం ఎలక్ట్రిసిటీని ఉత్పత్తి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో 1753 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకొనేందుకు గాను ఒక 8 ప్రాజెక్టులకు లైసెన్సులు ఇచ్చారు. అధ్యక్షా, ఈ ఎనిమిదిలో ఒక్క నాఫా, బేస్డ్ ప్రాజెక్టు తప్ప, మిగిలిన 7 ప్రాజెక్టులు ఫైనాన్సియల్ క్రంచ్ వల్ల ప్రారంభం కాలేదు. మార్చి 95లో లెటర్ ఆఫ్ ఇంటెంట్స్ ఇవ్వడం జరిగింది. 18 నెలల్లో ప్రొడక్షన్‌కు రమ్మని చెప్పడం జరిగింది. అంటే అక్టోబర్ 1996 కల్లా ప్రొడక్షన్‌లోకి వచ్చి ఉండవలసింది. ఇంత వరకు ఒక్క యూనిట్ కూడ ప్రొడక్షన్‌లోకి రాలేదు. ఈ రోజు నాఫ్తా కాస్టు చూసుకొంటే, దాని ద్వారా ఉత్పత్తి అయ్యే కరెంట్‌ను ఈ రాష్ట్ర ప్రభుత్వం యూనిట్‌కు 5 రూ.25 పై.లకు కొనాలి. దీనికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లాసెస్ అన్నీ కలుపు కొంటే ఈ రాష్ట్ర ప్రభుత్వానికి పర్ యూనిట్‌కు రూ.7 లు ఖర్చు అవుతుంది. ఈ 7 రూ.ల ఖర్చుతో ఏ ఒక్క వినియోగదారుడు కూడ పవర్ కొనే ఆలోచనలో లేడు. మళ్లీ మనం ఏ రాతి యుగానికో, కనీసం లాంతర్ల యుగానికో పోవలసిన సమయం ఆసన్నమయింది అనుకొంటున్నాను. అధ్యక్షా, ప్రతి విషయంలో కూడ ఇట్లాగే జరుగుతున్నదని నేను అనుకొంటున్నాను. ఎప్పుడో 1996 సంవత్సరంలో ఈ 8 ప్రాజెక్టులు ప్రారంభింపబడి, ఉత్పత్తి మొదలు చేయవలసి ఉన్నా, ఇంతవరకు చేయలేదు. కనీసం నాన్-ఇంప్లిమెంటేషన్ సెక్యూరిటీతో అయినా ఈ పవర్ పర్చేజ్‌కు ఇచ్చిన లైసెన్సులు అయినా స్క్రాప్ చేయకపోతే రాష్ట్రాన్ని శాశ్వతమైన అంధకారంలోకి తీసుకొని పోతారని మనవి చేస్తున్నాను. ప్లీజ్ ఆలోచించండి. ఏదో ఒక విధంగా తక్కువ ఖర్చుతో పవర్ జనరేషన్ గురించి ఆలోచన చేయండి.

అధ్యక్షా, ఏ ఇండస్ట్రీస్‌ను అయినా, లేకపోతే ఇంకొక దానినయినా ప్రయివేట్ వాళ్లకు ఎందుకు ఇస్తాం? ప్రయివేట్ వాళ్లు అయితే బాగా ఎఫిషియంట్‌గా పనిచేయగల్గుతారని, వాళ్లకు ఒక అకౌంటబిలిటీ ఉంటుందని, దానికి ఒక మేనేజింగ్ డైరెక్టర్ ఎవరో ఉంటారు, వారు అక్కడ ఉండి ఎవరినీ తిననీయకుండా చేస్తారని, చాల సమర్థవంతంగా పనిచేస్తారని చెప్పి వీలున్నచోటల్లా ప్రయివేట్ వాళ్లకు ఇవ్వాలని ఒక సిద్ధాంతం, ఒక ఆలోచన, ఆల్‌రైట్. కాని మన రాష్ట్రంలో జరుగుతున్నది ఏమిటి? ఎ.పి. గ్యాస్ పవర్ కార్పొరేషన్ గోదావరి జిల్లాలో 160 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నెలకొల్పింది. ఒక్కొక్క మెగావాట్ కాస్ట్ 2.7 కోట్ల రూ.లు. అదే జి.వి.కా., స్పెక్ట్రమ్ వాళ్లు అయితే 4.9 కోట్ల రూ.లు ఖర్చు అవుతుందని చెప్పినప్పటికీ, పవర్ జనరేషన్ ప్లాంట్స్ నెలకొల్పడానికి వారికే ఈ రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు ఇచ్చాయి అంటే ఇంత కంటే అన్యాయం, ఇంతకంటే ఘోరమైన సంఘటన మరొకటి లేదని మనవి చేస్తున్నాను. కేవలం దీని వల్ల ఎలక్ట్రిసిటీ బోర్డుకు రు.800 కోట్ల నష్టం వచ్చింది.

12.00 మ. అట్లాగే హిందూజా. 'ఈనాడు' పత్రికలో ఈ మధ్యనే ఒక ఆర్టికల్ వచ్చింది. ఒక వెయ్యి మెగావాట్స్ ప్రొడ్యూస్ చేసే పవర్ ప్రాజెక్టును హిందూజాలకు ఇచ్చారు. వెయ్యి మెగావాట్స్‌ను రు.5,500 కోట్లతో ప్రొడ్యూస్ చేస్తామని ప్రభుత్వాన్ని ఒప్పించారు. పవర్ ప్రాజెక్ట్ అగ్రిమెంట్ తీసుకుంటే, రు.5,500 కోట్లకి రిటర్న్స్ లెక్క వేసి, రు. 16 కోట్లు ఇంట్రస్ట్ వేసి, పర్ యూనిట్ ఛార్జ్ ఎర్రైవ్ అవుతారు. వారికి రు.5,500 కోట్లతో ప్రాజెక్టు ఇస్తే మనకు చాలా సమీపంలో గల ఎన్.టి.పి.సి సెంట్రల్ గవర్నమెంట్ సంస్థ కేవలం రు.4,187 కోట్లతో వెయ్యి మెగావాట్లను ప్రొడ్యూస్ చెయ్యగలము అని రాష్ట్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఎంటర్ అయినారు అంటే ప్రయివేటు వారికి వెయ్యి మెగావాట్లకు గాను రు.5 కోట్లకి ఇచ్చి, కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఎన్.టి.పి.సికి రు. 4.1 కోట్లకి ఇచ్చారు. ఇంతకంటే అన్యాయమైన పరిస్థితి మరొకటి ఉంటుందా? దీనికి కారణం ఏమిటి అంటే ఎలక్ట్రిసిటీ బోర్డు అధికారులో, ఎవరో అంటారు – డాలర్ రేటు పెరిగింది కనుక ఆటోమేటిక్‌గా పెరిగింది, మేమయితే పెంచలేదు అన్నారు. డాలర్ రేటు పెరిగిందో, మరొకటి పెరిగిందో కానీ ఎన్.టి.పి.సి చేస్తున్న పని హిందూజాలు– ఎందుకు చెయ్యలేకపోతున్నారు? ఈ విధంగా అసలు ఆలోచన ఎందుకు చేస్తున్నారు? మనకు కావలసింది పవర్. పవర్ ఎవరయితే ఉత్పత్తి దారులు తక్కువ రేటుకు ఇవ్వగలరో, పర్ యూనిట్ కాస్ట్ ఎంత తక్కువకు ఇవ్వగలరో దాని మీద టెండర్స్ పిలవండి. ఎవరు తక్కువగా ఇస్తే వారి నుంచి కొనండి. అంతే కాని డాలర్ రేటు పెరిగింది, మరొకటి పెరిగింది అని, మరొక ఆలోచనతో కానీ రేట్లను అనవసరంగా పెంచి వందల కోట్ల రూపాయల మేరకు ఎలక్ట్రిసిటీ బోర్డు దోపిడీకి గురి అయ్యే పరిస్థితి ఉంది. దయచేసి సమాధానం ఇవ్వండి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గత రెండు సంవత్సరాల నుంచి సక్సెసివ్‌గా అడుగుతున్నారు. అన్యాయానికి గురి అవుతోంది ఎలక్ట్రిసిటీ బోర్డు, దయచేసి తిరిగి చూడాలి అని అంటున్నారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ కానిస్టిట్యూషనల్ బాడీ, వారు ఇచ్చిన రిపోర్టును

తప్పనిసరిగా ఆలోచించవలసి ఉంటుంది. మరి గడచిన రెండు సంవత్సరాలుగా ఎందుకు పట్టించుకోలేదు అనే దానికి జవాబు చెప్పవలసిన అవసరం రాష్ట్రప్రభుత్వానికి ఉందని మనవి చేస్తున్నాను. ఇంతకు ముందు చెప్పినట్లుగా హైడ్రోపవర్ కాస్టు చాలా తక్కువ. ఒకసారి క్యాపిటల్ కాస్టు తీరితే, యూనిట్ 25 పైసలు వర్కవుట్ అవుతుంది. అటువంటి హైడ్రో పవర్ ప్రాజెక్ట్స్ వీలయిన చోట్ల పెట్టి, ఉత్పత్తి పెంచే ప్రయత్నం చెయ్యాలి. మరి చిన్న సోర్సెస్, ప్రభుత్వం ఉత్పత్తి చెయ్యలేని సోర్సెస్ ఏవయినా ఉంటే ఒక అర మెగావాట్, ఒక మెగావాట్‌కి కూడా అవకాశం ఉందంటే, చిన్న కాలువలలో, చిన్న హైడ్రో పవర్ స్టేషన్ పెట్టి, కరెంటును ప్రొడ్యూస్ చేసే అవకాశం ఉందంటే అన్ని వార్తాపత్రికలలోను అడ్వర్టయిజ్ చేసి, అర మెగావాట్, ఒక మెగావాట్ తయారుచేసే అవకాశం ఉందని, ఎంటర్‌ప్రెన్యూర్స్ రండి అని చాలా పారదర్శకంగా ఆలోచించి, అడ్వర్టయిజ్‌మెంట్స్ ద్వారా వర్క్స్ ఎలాట్ చేసే ఈ రాష్ట్ర ప్రభుత్వం బలిమెల – జాలాపుట్ హైడల్ ప్రాజెక్టు – 78 మెగా వాట్స్‌కు సంబంధించిన ప్రాజెక్టును టి.డి.పికి చెందిన విశాఖపట్నం పార్లమెంట్ మెంబర్ అయిన ఎం.వి.వి.ఎస్. మూర్తిగారికి నామినేషన్ మీద, ఒక్క వార్తాపత్రికలో కూడా అడ్వర్టయిజ్ చెయ్యకుండా, ఎందుకు ఇవ్వవలసి వచ్చింది? అప్పుడప్పుడు మా అజ్ఞానం అపారం అయినా కూడా చెప్పవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. ఇదే మూర్తిగారికి మరొక కోనసీమ ప్రాజెక్టును ఇచ్చారు. 220 మెగావాట్ల గ్యాస్ ఎలొకేషన్ ఇచ్చారు. ఎప్పుడయినా ఎవరికయినా ఇవ్వాలంటే, గ్యాస్ అథారిటీ పేపర్‌లో అడ్వర్టయిజ్‌మెంట్ ఇస్తుంది. మళ్ళీ స్టేట్ గవర్నమెంట్‌ను కమిటీ వెయ్యమని చెబుతుంది. అల్టిమేట్‌గా స్టేట్‌గవర్నమెంట్ ఎవరికి ఇవ్వమని చెబితే వారికి ఇస్తామని అంటుంది. దీనిలో అడ్వర్టయిజ్‌మెంట ఏమీ లేకుండా, మూర్తి గారికి 220 మె.వాట్ల గ్యాస్ ఎలొకేషన్ ఇవ్వడం జరిగింది. ఈ విధంగా టెండర్స్ ప్రక్రియ ఏమీ లేకుండా పెద్దపెద్ద ప్రాజెక్టులను తెలుగు దేశం పార్టీ నాయకులకు ఇవ్వవలసిన అవసరం ఏముందో ఈ సభ తెలుసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యమంత్రిగారు జవాబు చెబుతారని ఆశిస్తున్నాను. ఎలక్ట్రిసిటీ బోర్డు – ట్రాన్స్‌కో అంటున్నారు దీనికి సంబంధించి ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లైన్స్‌ని గురించి ఒక్క మాట చెప్పకపోతే నేను నాధర్మం నిర్వహించినట్లు కాదు అనుకుంటాను. 1995–96లో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లైన్స్ లాస్ 18.85 శాతం అయితే, 1996–97లో ఈ లాస్ 32.04 శాతం అయితే 1997–98లో 33.06 శాతం అయింది. ఎందుకు ఈ విధంగా ఈ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లాస్ పెరుగుతున్నది? దయచేసి తెలుసుకోవలసిన అవసరం మాకయితే ఉంది. ఇంతకు ముందు 1995–96లో కేవలం 18 శాతం ఉంటే తరువాతి సంవత్సరానికి 32 శాతం, ఆ తరువాత సంవత్సరానికి 35 శాతం వచ్చింది. ఇంకెంత అవుతుందో తెలియదు. ఈ రకంగా ఈ లాస్ ఉంది. ఇంత మేరకు ఎలక్ట్రిసిటీ బోర్డుకి నష్టాలు వస్తున్నాయి. ఈ నష్టాలు ఆపడానికి ఏ విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు? ఎన్నికలలో మేము రైతులకు ఫ్రీ కరెంటు ఇస్తామని వాగ్దానం చేశాము. ఇది నిలబెట్టుకోలేని వాగ్దానమని, ఎన్నికలు వచ్చినప్పుడు ఏదేదో చెబుతారని కాంగ్రెస్‌వారు అని కొందరు మాట్లాడడం జరిగింది. నేను అంటున్నాను. ఫ్రీ కరెంటు

అధ్యక్షా, ఏ ఇండస్ట్రీస్‌ను అయినా, లేకపోతే ఇంకొక దానినయినా ప్రయివేట్ వాళ్లకు ఎందుకు ఇస్తాం? ప్రయివేట్ వాళ్లు అయితే బాగా ఎఫిషియంట్‌గా పనిచేయగల్గుతారని, వాళ్లకు ఒక అకౌంటబిలిటీ ఉంటుందని, దానికి ఒక మేనేజింగ్ డైరెక్టరో ఎవరో ఉంటారు, వారు అక్కడ ఉండి ఎవరినీ తిననీయకుండా చేస్తారని, చాల సమర్థవంతంగా పనిచేస్తారని చెప్పి వీలున్నచోటల్లా ప్రయివేట్ వాళ్లకు ఇవ్వాలని ఒక సిద్ధాంతం, ఒక ఆలోచన, అల్‌రైట్. కాని మన రాష్ట్రంలో జరుగుతున్నది ఏమిటి? ఎ.పి. గ్యాస్ పవర్ కార్పొరేషన్ గోదావరి జిల్లాలో 160 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్ నెలకొల్పింది. ఒక్కొక్క మెగావాట్ కాస్టు 2.7 కోట్ల రూ.లు. అదే జి.వి.కా., స్పెక్ట్రమ్ వాళ్లు అయితే 4.9 కోట్ల రూ.లు ఖర్చు అవుతుందని చెప్పినప్పటికీ, పవర్ జనరేషన్ ప్లాంట్స్ నెలకొల్పడానికి వారికే ఈ రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశాలు ఇచ్చాయి అంటే ఇంత కంటే అన్యాయం, ఇంతకంటే ఘోరమైన సంఘటన మరొకటి లేదని మనవి చేస్తున్నాను. కేవలం దీని వల్ల ఎలక్ట్రిసిటీ బోర్డుకు రు.800 కోట్ల నష్టం వచ్చింది.

12.00 మ. అట్లాగే హిందూజా. 'ఈనాడు' పత్రికలో ఈ మధ్యనే ఒక ఆర్టికల్ వచ్చింది. ఒక వెయ్యి మెగావాట్స్ ప్రొడ్యూస్ చేసే పవర్ ప్రాజెక్టును హిందూజాలకు ఇచ్చారు. వెయ్యి మెగావాట్స్‌ను రు.5,500 కోట్లతో ప్రొడ్యూస్ చేస్తామని ప్రభుత్వాన్ని ఒప్పించారు. పవర్ ప్రాజెక్టు అగ్రిమెంట్ తీసుకుంటే, రు.5,500 కోట్లకి రిటర్న్స్ లెక్క వేసి, రు. 16 కోట్లు ఇంట్రెస్టు వేసి, పర్ యూనిట్ ఛార్జి ఎర్రైవ్ అవుతారు. వారికి రు.5,500 కోట్లతో ప్రాజెక్టు ఇస్తే మనకు చాలా సమీపంలో గల ఎన్.టి.పి.సి సెంట్రల్ గవర్నమెంట్ సంస్థ కేవలం రు.4,187 కోట్లతో వెయ్యి మెగావాట్లను ప్రొడ్యూస్ చెయ్యగలము అని రాష్ట్ర ప్రభుత్వంతో అగ్రిమెంట్ ఎంటర్ అయినారు అంటే ప్రయివేటు వారికి వెయ్యి మెగావాట్లకు గాను రు.5 కోట్లకి ఇచ్చి, కేంద్రప్రభుత్వానికి సంబంధించిన ఎన్.టి.పి.సికి రు. 4.1 కోట్లకి ఇచ్చారు. ఇంతకంటే అన్యాయమైన పరిస్థితి మరొకటి ఉంటుందా? దీనికి కారణం ఏమిటి అంటే ఎలక్ట్రిసిటీ బోర్డు అధికారులో, ఎవరో అంటారు – డాలర్ రేటు పెరిగింది కనుక ఆటోమేటిక్‌గా పెరిగింది, మేమయితే పెంచలేదు అన్నారు. డాలర్ రేటు పెరిగిందో, మరొకటి పెరిగిందో కానీ ఎన్.టి.పి.సి చేస్తున్న పని హిందూజాలు—ఎందుకు చెయ్యలేకపోతున్నారు? ఈ విధంగా అసలు ఆలోచన ఎందుకు చేస్తున్నారు? మనకు కావలసింది పవర్. పవర్ ఎవరయితే ఉత్పత్తి దారులు తక్కువ రేటుకు ఇవ్వగలరో, పర్ యూనిట్ కాస్టు ఎంత తక్కువకు ఇవ్వగలరో దాని మీద టెండర్స్ పిలవండి. ఎవరు తక్కువగా ఇస్తే వారి నుంచి కొనండి. అంతే కాని డాలర్ రేటు పెరిగింది, మరొకటి పెరిగింది అని, మరొక ఆలోచనతో కానీ రేట్లను అనవసరంగా పెంచి వందల కోట్ల రూపాయల మేరకు ఎలక్ట్రిసిటీ బోర్డు దోపిడీకి గురి అయ్యే పరిస్థితి ఉంది. దయచేసి సమాధానం ఇవ్వండి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గత రెండు సంవత్సరాల నుంచి సక్సెసివ్‌గా అడుగుతున్నారు. అన్యాయానికి గురి అవుతోంది ఎలక్ట్రిసిటీ బోర్డు, దయచేసి తిరిగి చూడాలి అని అంటున్నారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ కానిస్టిట్యూషన్‌లో బాడీ. వారు ఇచ్చిన రిపోర్టును

తప్పనిసరిగా ఆలోచించవలసి ఉంటుంది. మరి గడచిన రెండు సంవత్సరాలుగా ఎందుకు పట్టించుకోలేదు అనే దానికి జవాబు చెప్పవలసిన అవసరం రాష్ట్రప్రభుత్వానికి ఉందని మనవి చేస్తున్నాను. ఇంతకు ముందు చెప్పినట్లుగా హైడ్రోపవర్ కాస్టు చాలా తక్కువ. ఒకసారి క్యాపిటల్ కాస్టు తీరితే, యూనిట్ 25 పైసలు వర్కవుట్ అవుతుంది. అటువంటి హైడ్రో పవర్ ప్రాజెక్ట్స్ వీలయిన చోట్ల పెట్టి, ఉత్పత్తి పెంచే ప్రయత్నం చెయ్యాలి. మరి చిన్న సోర్సెస్, ప్రభుత్వం ఉత్పత్తి చెయ్యలేని సోర్సెస్ ఏవయినా ఉంటే ఒక అర మెగావాట్, ఒక మెగావాట్‌కి కూడా అవకాశం ఉందంటే, చిన్న కాలువలలో, చిన్న హైడ్రో పవర్ స్టేషన్ పెట్టి, కరెంటును ప్రొడ్యూస్ చేసే అవకాశం ఉందంటే అన్ని వార్తాపత్రికలలోను అడ్వర్టయిజ్ చేసి, అర మెగావాట్, ఒక మెగావాట్ తయారుచేసే అవకాశం ఉందని, ఎంటర్‌ప్రెన్యూర్స్ రండి అని చాలా పారదర్శకంగా ఆలోచించి, అడ్వర్టయిజ్‌మెంట్స్ ద్వారా వర్క్స్ ఎలాట్ చేసే ఈ రాష్ట్ర ప్రభుత్వం బలిమెల – జాలాపుట్ హైడల్ ప్రాజెక్టు – 78 మెగా వాట్స్‌కు సంబంధించిన ప్రాజెక్టును టి.డి.పికి చెందిన విశాఖపట్నం పార్లమెంట్ మెంబర్ అయిన ఎం.వి.వి.ఎస్. మూర్తిగారికి నామినేషన్ మీద, ఒక్క వార్తాపత్రికలో కూడా అడ్వర్టయిజ్ చెయ్యకుండా, ఎందుకు ఇవ్వవలసి వచ్చింది? అప్పుడప్పుడు మా అజ్ఞానం అపారం అయినా కూడా చెప్పవలసిన అవసరం ఉందని మనవి చేస్తున్నాను. ఇదే మూర్తిగారికి మరొక కోనసీమ ప్రాజెక్టును ఇచ్చారు. 220 మెగావాట్ల గ్యాస్ ఎలొకేషన్ ఇచ్చారు. ఎప్పుడయినా ఎవరికయినా ఇవ్వాలంటే, గ్యాస్ అథారిటీ పేపర్‌లో అడ్వర్టయిజ్‌మెంట్ ఇస్తుంది. మళ్ళీ స్టేట్ గవర్నమెంట్‌ను కమిటీ వెయ్యమని చెబుతుంది. అల్టిమేట్‌గా స్టేట్‌గవర్నమెంట్ ఎవరికి ఇవ్వమని చెబితే వారికి ఇస్తామని అంటుంది. దీనిలో అడ్వర్టయిజ్‌మెంట ఏమీ లేకుండా, మూర్తి గారికి 220 మె.వాట్ల గ్యాస్ ఎలొకేషన్ ఇవ్వడం జరిగింది. ఈ విధంగా టెండర్స్ ప్రక్రియ ఏమీ లేకుండా పెద్దపెద్ద ప్రాజెక్టులను తెలుగు దేశం పార్టీ నాయకులకు ఇవ్వవలసిన అవసరం ఏముందో ఈ సభ తెలుసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యమంత్రిగారు జవాబు చెబుతారని ఆశిస్తున్నాను. ఎలక్ట్రిసిటీ బోర్డు – ట్రాన్స్‌కో అంటున్నారు దీనికి సంబంధించి ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లైన్స్‌ని గురించి ఒక్క మాట చెప్పకపోతే నేను నాధర్మం నిర్వహించినట్లు కాదు అనుకుంటాను. 1995–96లో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ట్రాన్స్‌మిసన్, డిస్ట్రిబ్యూషన్ లైన్స్ లాస్ 18.85 శాతం అయితే, 1996–97లో ఈ లాస్ 32.04 శాతం అయితే 1997–98 లో 33.06 శాతం అయింది. ఎందుకు ఈ విధంగా ఈ ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ లాస్ పెరుగుతున్నది? దయచేసి తెలుసుకోవలసిన అవసరం మాకయితే ఉంది. ఇంతకు ముందు 1995–96లో కేవలం 18 శాతం ఉంటే తరువాతి సంవత్సరానికి 32 శాతం, ఆ తరువాత సంవత్స రానికి 35 శాతం వచ్చింది. ఇంకెంత అవుతుందో తెలియదు. ఈ రకంగా ఈ లాస్ ఉంది. ఇంత మేరకు ఎలక్ట్రిసిటీ బోర్డుకి నష్టాలు వస్తున్నాయి. ఈ నష్టాలు ఆపడానికి ఏ విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు? ఎన్నికలలో మేము రైతులకు ఫ్రీ కరెంటు ఇస్తామని వాగ్దానం చేశాము. ఇది నిలబెట్టుకోలేని వాగ్దానమని, ఎన్నికలు వచ్చినప్పుడు ఏదేదో చెబుతారని కాంగ్రెస్‌వారు అని కొందరు మాట్లాడడం జరిగింది. నేను అంటున్నాను. ఫ్రీ కరెంటు

ఇవ్వడం వల్ల వచ్చే లోటు గురించి చూస్తే, రాష్ట్ర ప్రభుత్వానికి రైతాంగం నుంచి వస్తున్న ఆదాయం తక్కువే· మొత్తం మీద 1997–98వ సంవత్సరంలో ఎలక్ట్రిసిటీ బోర్డుకు వచ్చిన కలెక్షన్ రు·3990 కోట్లు· అందులో ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ కేటగిరీ నుంచి వచ్చింది కేవలం రు·150 కోట్లు మటుకే· ఒకవేళ ఇప్పుడు పెరిగింది అనుకున్నా రు·200 కోట్లు కావచ్చు, రు·210 కోట్లు కావచ్చు· రు·3990 కోట్ల ఆదాయంలో ఇది కేవలం రు·150 కోట్లు మటుకే· దయచేసి ఒక విషయం ఆలోచించండి· తెలంగానా, రాయలసీమ, కోస్తా ప్రాంతాలలో అప్‌ల్యాండ్ రైతులు చాలా మంది కేవలం ఈ కరెంటు మీదనే ఆధారపడి ఉన్నారు· 1994లో జరిగిన ఎన్నికలలో టి-డి-పి పార్టీ ఖచ్చితంగా రు·50కి హెచ్·పి కరెంటు ఇస్తామనే వాగ్దానంతో అధికారానికి వచ్చారు· ఎన్నికల తరువాత అదే హెచ్·పి·ని రు·250 నుంచి రు·350 చేశారు· ఒకటి గమనించండి· డెల్టా ప్రాంతాలలో తక్కువ రేటు నీటి సరఫరా అవుతుంటే, వెనుకబడిన ప్రాంతాలలో అదే నీటిని తోడుకోడానికి చాలా ఎక్కువ ఖర్చు రైతు పెట్టే పరిస్థితులు ఉన్నప్పుడు, ఆ రైతును ఆదుకోవడం ఏ మాత్రం తప్పు అవుతుంది అనేది దయచేసి ఒక్క నిమిషం ఆలోచించండి· మేము మా ఎన్నికల ప్రణాళికలో పెట్టాము, మేము అధికారంలోకి రాలేదు· కాంగ్రెస్ పార్టీ ప్రణాళిక కాబట్టి తీర్చవలసిన బాధ్యత వారికి లేదు అనే ఆలోచనతో కాకుండా, ఒక్కసారి దయచేసి దానిని ప్రక్కకు పెట్టండి· ఆలోచించండి· రైతులను గురించి, రైతు ప్రయోజనాలను గురించి ఆలోచించండి· ఎక్కడా లేని విధంగా ఈ రెండు, మూడు సంవత్సరాలలో వందలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు అంటే అర్థం చేసుకోవచ్చు· ఎక్కడయినా ఒక యాక్సిడెంట్ అయితే, ఏదయినా ఉప్పెన వస్తే వందలాది మంది, వేలాది మంది చనిపోతే, ఏదో ఎప్పుడో ఉప్పెనో, యాక్సిడెంటో, ప్రమాదమో అని అనుకోవచ్చు· మనిషి ఆత్మహత్య చేసుకుంటున్నాడు అంటే తనకు సంబంధించిన భార్యా

12·10 మ· బిడ్డలను పూర్తిగా విడిచి తాను ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు అంటే, ఆ పరిస్థితికి వచ్చాడంటే, వందలాదిమంది ఆ విధంగా చచ్చిపోయారంటే దానిని గూర్చి ఆలోచన చేయవలసిన అవసరం ప్రభుత్వానికి ఉన్నదా, లేదా? దయచేసి ఆలోచన చేయండి· గ్రామాలలో ఆర్థిక వ్యవస్థ చాలా అన్యాయంగా ఉంది· గ్రామాలలో ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడం కోసం మనం ఏమి చేసినా తప్పు కాదు·

రైతులకు చాలా సమస్యలు ఉన్నాయి· చాలా చోట్ల రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు· చాలా చోట్ల షుగర్ ఫ్యాక్టరీలలో రైతులకు ఇవ్వవలసిన బకాయిలు చెల్లించడం లేదు· పురుగుల మందులు ఇప్పటికి కూడా స్పూరియస్‌గా వస్తున్నాయి·

ఇంకా డ్రౌట్ విషయానికి వస్తే మరీ అన్యాయం· గడచిన రెండు, మూడు మాసాలుగా రాష్ట్రంలో తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు నెలకొని ఉన్నాయి· రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు లేదు· కేంద్రానికి సంబంధించి అధికారులు వచ్చారు· వెళ్లారు· అక్కడ నుంచి ఎటువంటి సహాయం రాలేదు· మనమూ దుర్భిక్ష ప్రాంతాలకు ఏ

విధమైన సహాయం చేయడం లేదు. దయచేసి ఆలోచించండి. శాశ్వతమైన కరువు నివారణకు ఖచ్చితమైన చర్యలు తప్పక చేపట్టాలి. ఆ ప్రాంతంలో ఎకలాజికల్ బ్యాలెన్స్ మార్చాలి. ఆ కాలంలో సస్టెయిన్డ్ అగ్రికల్చర్ పెరగాలి. హార్టీకల్చర్‌లో విప్లవాత్మకమైన మార్పులు రావాలి. కేవలం కన్వెన్షనల్ పద్ధతులు కాదు. ఓ కొత్త ఆలోచన కావాలి. కొత్త ప్రక్రియ మొదలు కావాలి. దయచేసి ఆలోచన చేయమని కోరుతున్నాను.

అధ్యక్షా, వ్యవసాయం గురించి ఎక్కడ ఏమి మాట్లాడినా ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి మాట్లాడకుండా పోవడానికి వీలు లేదు. మీకు గుర్తు ఉండే ఉంటుంది. దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం సంగతి. టూ తౌజండ్ మిలీనియం కంటే ముందు ఉన్న ముఖ్యమంత్రులలో మీరు ఉండిపోతున్నారు. అప్పుడే మీరు కొత్తగా ముఖ్యమంత్రి అయ్యారు. ఒక ఎం.పి ల సమావేశంలో నేను మీతో అనడం జరిగింది. బచావత్ అవార్డుని గురించి చెప్పడం జరిగింది. మనం ఒక స్టాండ్ తీసుకున్నాము. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి బచావత్ అవార్డులో తాను చెప్పిన విధంగా రెండు వేల సంవత్సరాల వరకు కృష్ణా నదికి సంబంధించిన అదనపు జలాలపైన పూర్తిగా మనకు హక్కు ఉన్నది, అంత లోపల వీలయినంత ఎక్కువగా ప్రాజెక్టులు కట్టవలసిన అవసరం ఉంది. ఆ రోజే చెప్పడం జరిగింది. మీరు ఆరోజు నేను అన్న మాటకు మనసులో కొంత బాధ పడ్డారు. ఆరోజైనా, ఈ రోజైనా ఒకే ఒక ఆలోచన. మీరు రెండు వేల సంవత్సరం లోపల ఉన్న ఆఖరు ముఖ్యమంత్రి కాబట్టివీలున్నంత ఎక్కువగా కృష్ణా వాటర్ వాడి మనకు ఒక రైట్ ఏర్పాటు చేయగలిగితే రెండు వేల సంవత్సరం తరువాత ఎప్పుడు రెవ్యూ జరిగినా మనకు ఒక రైట్ శాశ్వతంగా ఏర్పరచుకోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి ఈ కార్యక్రమాన్ని ఎక్కువ చేయమని కోరుతున్నాను. నాకు తెలిసినంత వరకు గడచిన 4, 5 సంవత్సరాలలో ఒక్క చుక్క అదనపు జలాలను కూడా ఈ రాష్ట్ర ప్రభుత్వం వాడిన పరిస్థితి కనిపించడం లేదు. తెలుగు గంగ కానీ లేకపోతే శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన మిగులు జలాలను కానీ, ఎస్.ఆర్.బి.సి కానీ ఎస్.ఎల్.బి.సి. కానీ వీటికి సంబంధించిన ప్రాజెక్టుల ప్రోగ్రెస్ నత్త నడకన నడుస్తున్నాయి నిన్న ఎవరో నాతో అన్నారు. సబ్జెక్ట్ టు కరక్షన్. ఏ ఒక్క ఎకరం కూడ గడచిన 4, 5 సంవత్సరాలలో కృష్ణా నదికి సంబంధించి అడిషనల్ నీళ్లు వచ్చే పరిస్థితి జరగలేదని అన్నారు. దయచేసి ఆలోచించండి. సమయం మించి పోతోంది. మళ్లీ మళ్లీ ఇటువంటి ఆలోచన చేయాలి. మన కంటే చిన్న రాష్ట్రం కర్నాటక, వారు గడచిన నాలుగు సంవత్సరాలలో ఇరిగేషన్ బడ్జెటు పైన రు. 10 వేల కోట్లు ఖర్చు పెట్టామనీ, కృష్ణా నదికి సంబంధించిన ప్రాజెక్టులు మొత్తం పూర్తి చేసుకుంటున్నామనీ ఢంకా బజాయించి చెబుతున్నారు. మనమేమో గడచిన నాలుగు సంవత్సరాలలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేవలం రు.5,000 కోట్లు అంటే వారిలో సగం మాత్రమే పెట్టారు. దయచేసి ఆలోచించండి. ఏదో ఒక విధంగా ఇరిగేషన్ మీద ఔట్‌లేస్ చూపించాలి. ఇరిగేషన్‌కు సంబంధించి బడ్జెటు కెపాసిటీస్ పెంచాలి. మన రాష్ట్రం పూర్తిగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రం. ఈ రాష్ట్రానికి సంబంధించిన ఇరిగేషన్ బడ్జెట్ ఎంత ఎక్కువగా పెంచగలుగుతామో అంత ఎక్కువగా ఎంప్లాయిమెంట్ వస్తుంది. అంత ఎక్కువగా రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు పోతుంది.

గోదావరి నదికి సంబంధించిన జలాలు శ్రీరామ్‌సాగర్ ఫేజ్-I ఇంకా పూర్తి కాలేదు. శ్రీరాం సాగర్‌కి సంబంధించిన ఫేజ్-II మొదలు పెడుతున్నారు. వ్లడ్ ఫ్లో కెనాల్ మొదలు పెడతాము అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ నుంచి నిధులు తెస్తామని అంటున్నారు. కాని చాలా త్వరగా చేయాలి. అక్కడ రైతులు వ్లడ్ వ్లో కెనాల్ కోసం నాలుగు జిల్లాలకు సంబంధించిన తెలంగానా, ఉత్తర తెలంగాణా రైతులు చాలా బాధాతప్త హృదయంతో ఎదురుచూస్తున్నారు. దయచేసి ఆలోచించండి. ఉత్తర ఆంధ్రా కోస్తాకు సంబంధించిన వంశధార, జంఝావతి విషయంలో కొంత ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోండి. ప్రాబ్లమ్స్ ఉన్నాయి. లేదనండం లేదు. మీరు 3, 4 సంవత్సరాల క్రితం చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులకు పునాది రాళ్ళు వేశారు. ఇంతవరకు వేసిన రాళ్ళు వేసినట్లే ఉన్నాయి. వెలికొండ పరిస్థితి అలాగే ఉంది. మార్కాపురం ప్రాంతానికి నిన్న ఎన్నికలలో మీరు కూడ వెళ్ళారు. తప్పని సరిగా చేస్తామని అన్నారు. చేయండి. కాలం దాటి పోతున్నది.

- - - - - - -

అధ్యక్షా, అప్పుడప్పుడు మీరు ప్రతిపక్ష పార్టీలను పిలిచి వారితో కూడ కొంత సమాలోచనలు చేసి ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ అక్కడక్కడ కనపడుతున్నది. ఉదాహరణకు మొన్న ఆర్.టి.సి. రేట్లు ఏ విధంగా పెంచాలి. ఎంత పెంచాలని ఆలోచన చేయడానికి ప్రతిపక్ష పార్టీ నేతలను పిలిచారు. నాకు కారణం అయితే తెలియదు కాని అందులో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వారిని అసలు పిలవలేదని అన్నారు. ఎవరో అన్నారట – అసెంబ్లీలో రిప్రజెంటేషన్ ఉన్న పార్టీలను మటుకే పిలిచామని అన్నారట. ఐ విల్ బ్రింగ్ టు యువర్ నోటీస్. ది కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా కెనాట్ బి బ్రష్డ్ ఎసైడ్. మీ కంటే, మా కంటే, కూడ తక్కువ లేకుండా ప్రజలకు సంబంధించిన ఉద్యమాలతో సంబంధం లేని పార్టీ కాదు. ఏదయినా కారణాల వల్ల ఒక శాసన సభలో ఒక సభ్యుడు తక్కువగా ఉన్నా, ఎక్కువగా ఉన్నా, అసలు లేకపోయినా వారిని గురించి తక్కువ అంచనా వేయవద్దు. పిలవడం తప్పుకాదు. నాలుగు పార్టీల వారిని పిలిచినప్పుడు వారిని కూడ ఇక మీదట పిలవడం తప్పు కాదు. అన్ని ప్రతిపక్ష పార్టీలను పిలిచి వారి ఆలోచన తీసుకోండి. ఆరోజు మీరేమో ఉదయం 12 గంటలకు అంటే రాత్రి 9, 10 గంటలకు ఒక బుక్‌లెట్ పంపించారు. ఆర్.టి.సి కి సంబంధించిన బుక్‌లెట్‌లో దాని పారా మీటర్స్ చాలా గొప్పగా ఉన్నాయి అన్నారు. ఫ్లీట్ నెంబరులో కాని, డీజిల్ కన్జంప్షన్ ఎఫిషియన్సీలో కాని, టైర్స్ ఎఫిషియన్సీలో కాని, వెహికల్ పర్ కిలో మీటర్ ఎఫిషియన్సీలో కాని ప్రతి చోట చాలా గొప్పగా పని చేస్తున్నది మా ఆర్.టి.సి అని చెప్పి బుక్‌లెట్‌లో చూపించడం జరిగింది. మా అజ్ఞానం అపారం. మాకు అర్థం కావడం లేదు. తమిళనాడులో ఆర్.టి.సి రేటు 18 పైసలు పర్ కిలో మీటర్ ఉంది. ఈ మధ్య వారం పది రోజుల క్రితం 22 పైసలకు పెంచడం జరిగింది. మీరేమో 24 పైసల నుంచి 30 పైసలకు పెంచడానికి ప్రపోజల్ పెట్టారు. తమిళనాడు వారు పెంచిన రేటు ఇంతకు ముందు మనకు ఉన్న రేట్ల కంటే తక్కువ. వారు పెంచింది చాలా తక్కువ.

ఇదేమిటి ముఖ్యమంత్రి గారు అని మా పార్టీకి సంబంధించిన ప్రతినిధి అడిగితే సరిగా జవాబు లేదు· దానిని గురించి ఆలోచన చేసే ఆలోచన లేదు· మా వారు ఖచ్చితంగా చెప్పారు· ఈ రాష్ట్రంలో డీజిల్ పైన సేల్స్ టాక్స్ మొత్తం భారత దేశంలో ఏ ఒక్క రాష్ట్రంలో లేనటువంటి విధంగా ఎక్కువగా ఉంది· దయచేసి సేల్స్ టాక్స్ తగ్గించండి· ఆర్·టి·సి కి ఆ మేరకు మేలు వచ్చేట్లు చేయండి· మోటార్ వెహికల్ టాక్స్ ప్రైవేట్ ఆపరేటర్స్ పర్ సీట్ అని లెక్క కడతారు· ఆర్·టి·సి· పైన 15 శాతం అంత కంటే ఎక్కువ భారం పడుతున్నది· టోటల్ రిసీట్స్‌లో వారి గ్రాస్ కలక్షన్స్‌లో ప్రభుత్వానికి టాక్స్‌గా వసూలు చేస్తున్న దానిని తగ్గించండి· ఏదయినా చట్టపరమైన లొసుగులు ఇబ్బందులు లేకుండా ఆర్·టి·సి·కి ఎంతో కొంత మేలు వచ్చేట్లుగా చూడండి· ఇది సామాన్య మానవుడికి ఇచ్చే ట్రాన్స్‌పోర్ట్· అన్ని రకాలుగా ప్రయోజనాలు ఇస్తాము అంటున్నారు· ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అంటున్నారు· ప్రపంచ దేశాలలో ఎక్కడికైనా పోయేట్లు సామాన్య మానవుడికి ఏర్పాటు చేస్తాము అంటున్నారు· కాని సామాన్య మానవుడు ఒక ఊరి నుంచి మరొక ఊరుకు పోయే ట్రాన్స్‌పోర్టేషన్ కమ్యూనికేషన్ కూడా లేని పరిస్థితి కల్పించకండి· మళ్లీ తప్పని సరిగా ఆలోచన చేయండి· ఏదో ఒక విధంగా 30 పైసలు తగ్గించి సామాన్య మానవుడికి వెసులుబాటు కల్పించాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను·

అధ్యక్షా, గవర్నరు గారి ప్రసంగంలో 35 లక్షల ఇళ్లు కడతామని అన్నారు· చాలా లౌడబుల్ ఆబ్జెక్టివ్· కాని గడచిన 4, 5 సంవత్సరాలలో ఎన్ని ఇళ్లు కట్టారు అన్నది ఒక మాట చెప్పి ఈ సారి ఎన్ని ఇళ్లు కడతారో చెప్పండి· ఆ కట్టే కార్యక్రమంలో ఉన్న లొసుగులు చూడండి· కొన్ని, కొన్ని చోట్ల అధికారాలతో, అధికారంలో వున్న
12·20 మ· ప్రతినిధులకు దగ్గరగా వున్న వాళ్లు ఒక్కొక్కరు రెండేసి, మూడేసి ఇళ్లు తీసుకున్నారు· అందులో షాపులు పెట్టుకుని వుండడం నేను చూశాను· ఒక్కొక్క చోట మూడు, నాలుగు ఇళ్లు కలిపి ఒకే ఇళ్లు చేసుకున్నారు· క్యాటిల్ షెడ్స్ పెట్టుకున్నారు· కడప దగ్గర ఎర్రమాసిపల్లె అనుకుంటాను· ఆగ్రామం పేరు నాకు సరిగ్గా గుర్తు లేదు· ఒక్కొక్క ఇల్లుకు రు·70 వేలు లేదా రు·80 వేలు ఖర్చు పెట్టిన ఇళ్లు వున్నాయి· దీని ప్రధాన ఉద్దేశ్యం ఏమిటి? రెక్కాడితే కానీ డొక్కాడని వాటికి కనీసం రు·10 వేలు, లేదా రు·12 వేలు కూడా ఇంటిమీద ఖర్చు పెట్టుకోలేని వాడికి ఇల్లు ఇవ్వాలనేది వీకర్ సెక్షన్ ప్రోగ్రాం పాలసీ, రు·50 వేలు లేదా రు·60 వేలు ఇంటి మీద ఖర్చు పెట్టుకునే వాడికి ఇల్లు ఇవ్వవలసిన అవసరం ఎందుకు వచ్చిందని నేను అడుగుతున్నాను· దయచేసి ఆలోచించండి· హౌసింగ్ ప్రోగ్రాం గురించి మరల మాట్లాడడానికి అవకాశం వస్తుందని అనుకుంటున్నాను· ఇక శాంతి భద్రతల పరిస్థితి గురించి మాట్లాడవలసి వస్తే

(బెల్)

అరగంటలో ముగిస్తాను. నరసరావు పేటలో బాంబు పేలుడు సంఘటనలో కాంగ్రెసు పార్టీకి సంబంధించిన నాయకులు హైకోర్టుకు వెడితే హైకోర్టు కేసును సి.బి.ఐ.కి అప్పగించమని అంటే సి.బి.ఐ.కి అప్పగించామని అన్న తరువాత ఈ రాష్ట్రానికి సబంధించిన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు విజయవాడ వార్తా పత్రికల వారితో అన్న మాట ఏమిటంటే కోడెల శివప్రసాదరావు గారికి సంబంధించిన వాళ్ళకు ఏ విధమైన సంబంధం లేదని ఉచితంగా స్టేట్‌మెంట్లు ఇచ్చారు.

(కాంగ్రెస్ పార్టీ నుంచి షేమ్, షేమ్ అనే నినాదాలు)

కేసు సి.బి.ఐ.కి పంపడానికి కారణం ఏమిటి? లోకల్ పోలీసు ప్రాపర్‌గా ఇన్వెస్టిగేషన్ చేయలేదు. సి.బి.సి.ఐ.డి. సరిగ్గా ఇన్వెస్టిగేషన్ చేయలేదు. కనీసం విచారణలు కూడా సరిగ్గా చేయలేదు. ఇంటరాగేషన్ కూడా సక్రమంగా చేయలేదు. కాబట్టి సి.బి.ఐ.కి పంపించమంటే ఒక డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు లెవల్‌లో వున్న అధికారి స్టేట్‌మెంట్స్ ఇవ్వడం ఉచితమా అని అడుగుతున్నాను. ఆ విధంగా ఎందుకు చేయవలసి వచ్చిందనేది దయచేసి ఆలోచన చేయమని కోరుతున్నాను. ఎన్నికల తరువాత ఎన్నికలలో ఓడిపోయిన వారు ఉక్రోషాలు పట్టలేకో, లేక ఇంకోటో, మరొకటో అయి శాంతి భద్రతలకు నష్టం కలిగించడం చూశాము కానీ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులు కూడా – ఉదాహరణకు జమ్మలమడుగులో ఎన్నికలలో గెలిచిన తరువాత ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులను తెలుగుదేశం పార్టీ వాళ్ళు చంపడం జరిగింది. ఆ ముగ్గురిలో ఇద్దరిని అంతకు ముందు స్థానిక పోలీసులు అన్యాయంగా అరెస్టు చేస్తే వారు ఎక్కడ వున్నారో వారి ఆమెకి తెలియకపోతే కోర్టుకు పోయి వారి బంధువులు ఆ పోలీసు అధికారులపైన సర్చ్ వారంటు కూడా తీసుకువస్తే అప్పటికేమో కాంగ్రెస్ పార్టీ నాయకులను ఇంటికి పంపించారు. మారణాయుధాలు లేకుండా చూశారు. తెలుగు దేశం పార్టీ వాళ్ళకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అటాక్ చేయమన్నారు. వారు చచ్చిపోవడం జరిగింది. కేవలం కాంగ్రెస్ పార్టీకి ఎన్నికలలో ఏజెంట్‌గా వుండడానికి ప్రయత్నం చేశాడని బోడితిప్పనపాడు గ్రామంలో చంపివేయడం జరిగింది. గడచిన 10, 15, 20 సంవత్సరాల నుంచి, నాకు తెలిసినప్పటి నుంచి రిగ్గింగ్ తెలుగుదేశానికే జరిగేది. కాంగ్రెస్ పార్టీ తరపున ఒక ఏజెంట్‌గా నిలబడడానికి ప్రయత్నం చేశారని ఒకే ఒక్క కారణం చేత రామసుబ్బారెడ్డి అనే పెద్ద మనిషిని చంపి వేయడం జరిగింది. నందికోట్కూరులో గడచిన నెల రోజుల లోపల ఈ క్రొత్త ఎన్నికల తరువాత 5–9–99 న హుస్సేన్ రెడ్డి అనే కాంగ్రెస్ పార్టీ నాయకుడిని పగిడాల అనే చోట చంపడం జరిగింది. 6–9–99 న బాలేశ్వరరెడ్డి, మాదిరెడ్డి వేణుగోపాలరెడ్డి ఇద్దరు సోదరులను అతి కిరాతకంగా నరికి చంపడం జరిగింది. ఇదే ఇద్దరు సోదరుల ఇంకో సోదరుడు మాదిరెడ్డి జనార్దనరెడ్డిని ఒకటిన్నర సంవత్సరం క్రితం ఇదే ఫాక్షన్‌లో చంపి వేయడం జరిగింది. నందికోట్కూర్‌లో 3–11–99న ఉస్మాన్ భాషాను సాయంత్రం గం.4–30 సమయంలో అతని ఇంటిలోకి తెలుగుదేశం పార్టీకి చెందిన వాళ్ళు ప్రవేశించి దౌర్జన్యం

చేసి చంపడం జరిగింది. ఆ సమయంలో హోమ్ మంత్రి కర్నూలులో వున్నారు. ఫాక్షనిజంపైన ఉక్కుపాదం మోపుతాను అన్నారు. ఉక్కుపాదం ఫాక్షనిజంపైన మోపుతారో లేకపోతే కాంగ్రెస్ పార్టీ వాళ్లపైన మోపుతున్నారో చూడవలసిన అవసరం వున్నది. దీనికి ప్రధానమైన కారణం కేవలం కొంత మంది ప్రజా ప్రతినిధులో, శాసన సభ్యులో, మరొకరో ఆ ప్రాంతంలో వున్న వాళ్లకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారు. పోలీసు అధికారులను సంవత్సరాలు, సంవత్సరాలుగా ఒకే చోట పెట్టడం జరుగుతున్నది. డోన్‌లో నాకు తెలిసి దాదాపు మూడు లేక నాలుగు సంవత్సరాల నుంచీ ఒక అధికారి ఎ.ఎస్.పి.గా వుంటే ఆపోస్టును అప్‌గ్రేడ్ చేసి డి.ఎస్.పి.గా అక్కడే వుంచి తెలుగుదేశం పార్టీ వాళ్లకు పూర్తిగా మేలైన పరిస్థితిలో ఫాక్షనిజాన్ని ముందుకు తీసుకుపోయే పరిస్థితి ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నది. దయచేసి ఆలోచన చేయండి. ఇది చాలా తప్పు. కడప జిల్లాలోని కొండాపురం
12.30 మ. అనేచోట గత నాలుగైదు సంవత్సరాలుగా ఒకే పోలీసు అధికారి వున్నాడు. అతన్ని మార్చే సమస్యే లేదు. ఇన్‌ఎఫిషియంట్ యస్‌పి వున్న చోట కూడా అదే సమస్య. కొన్ని చోట్ల యస్‌పిల పరిస్థితి కూడా బాగాలేదు. ఉదాహరణకు కర్నూలు జిల్లాను తీసుకోండి. అధ్యక్షా, బాగా ఫాక్షన్స్ వున్న చోట డైరెక్టుగా రిక్రూట్ అయి వచ్చిన ఐ.పి.యస్ ఆఫీసర్లను వేయండని అంటే ' అటా కానే కాదు, కూడదు. ప్రమోటీస్‌ను మాత్రమే వేస్తాము అని అంటున్నారు, దయచేసి ఆలోచన చేయండి. ఫాక్షనిజం మీద వుక్కుపాదం మోపాలంటే తీసుకోవలసిన చర్యలను గురించి తమ ద్వారా మనవిచేస్తున్నాను ప్రతి స్టేషన్‌లో మంచి యస్‌పి వుంటే ఇది ఖచ్చితంగా ఆగుతుంది. ఆ యస్‌ఐకి 'సస్పెండెడ్‌గా పోండి. ఫలానా రకంగా చేయండి' అని ప్రెజర్స్ లేక పోతే తప్పకుండా ఫాక్షనిజం కంట్రోలవుతుంది. ఎంతో అధ్వాన్నమైన పరిస్థితి ఈ రాష్ట్రంలో వుంది. ఈ దేశానికి సంబంధించిన హోంశాఖా మంత్రి లాల్‌కృష్ణ అద్వానీ గారు స్వయంగా పార్లమెంట్‌లో' ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగినన్ని లాకప్ మరణాలు మరే యితర రాష్ట్రంలో జరగలేదు ఇంతకంటె పెద్ద రాష్ట్రాలయిన ఉత్తరప్రదేశ్, బీహారుల్లో కూడా జరగలేదు. అని అన్నారు. ఆనాడు మేమంతా సిగ్గుతో తలవంచుకున్నాము. క్రైమ్ రేట్ గత నాలుగైదు సంవత్సరాలుగా పెరుగుతోంది. అదే మంటే అన్నిచోట్లా పెరుగుతొందని, మన రాష్ట్రంలో కూడా పెరుగుతొందని అంటున్నారు.

ఎక్స్‌ట్రీమిజం గురించి మనవిచేస్తాను. ఎక్స్‌ట్రీమిస్టులకు సంబంధించిన కేసులు అడ్డగోలుగా వుంటున్నాయి. ఏవిధంగా జరుగుతున్నాయో అర్థం కావడం లేదు. ముఖ్యమంత్రిగారి స్వంత నియోజకవర్గం లోని రామకుప్పంలో, ఆయనగారు రెండవసారి ప్రమాణస్వీకారం చేసిన రోజునే – అందరికీ తెలియాలనో ఏమో, ఆయనగారు ప్రమాణస్వీకారం చేయడానికి ప్రధాన కారణం భారతీయ జనతా పార్టీ అనే విషయం అందరికీ తెలియాలనో ఏమో, తెలుగుదేశం, బిజెపి కార్యకర్తలు అన్యాయంగా, అతి దారుణంగా మైనారిటీ సోదరుల మీద దాడిచేయడం జరిగింది. మైనారిటీ సోదరులు, వారు చేసిందల్లా పోలీసు స్టేషనుకు వెళ్లి, పోలీసు అధికారులకు తాము జరిపే ఊరేగింపు

సందర్భంగా శాంతిభద్రతలను కాపాడవలసిందిగా, ఊరేగింపు సజావుగా జరిగేటట్లుగా చూడవలసిందిగా విజ్ఞప్తి చేయడమే. ఆ విధంగా వారు మనవి చేసుకుంటే, కారణం ఏమిటో తెలియదు గానీ పోలీసులు శాంతిభద్రతలను నిలబెట్టలేక పోయారు. పోలీసు కాల్పుల్లో యిద్దరు అమాయకులు చనిపోయారు. ఆ తరువాత అతి దారుణంగా అరటిచెట్లను, మామిడి చెట్లను నరకడం, మైనారిటీలకు చెందిన వందలాది ఎకరాల భూములలోని ఫలవృక్షాలను, పంటలను నాశనం చేయడం జరిగింది. వందల ఎకరాల భూముల్లో లక్షల, కోట్ల రూపాయల నష్టం మైనారిటీలకు జరిగింది. ఇంతనష్టం ఎందుకు జరిగిందనేది ఒక్క క్షణం ఆలోచన చేయవలసిందిగా కోరుతున్నాను. మరలా ఇటువంటి పరిస్థితులు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోమనండి. హైదరాబాదులో తోటి శాసనసభ్యుడైన అసదుద్దీన్ ఓవైసీని అతి దారుణంగా, ఆయన శాసన సభ్యుడు అనే విషయం తెలిసి కూడా కొట్టడం జరిగింది. ఎవరిచ్చారా అధికారం? కేవలం కొట్టడమే కాదు, ఆయన్ను చంపాలనే ఆలోచన చేశారు. కొంత కాకపోతే కొంతయినా పరిస్థితులను బాగుపరచడానికి ప్రయత్నం చేయండని కోరుతున్నాను.

వారు గవర్నర్ ప్రసంగంలో చాలా విషయాలు చెప్పడం జరిగింది. కానీ హ్యాండ్‌లూం వీవర్స్ విషయం మెన్షన్ కూడా చేయలేదు. గడచిన నాలుగైదు సంవత్సరాల్లో చేనేత కార్మికులు అనేక యిబ్బందులు పడుతూ ఆకలి చావులు చస్తున్నా పట్టించుకోవడంలేదు. వీరికి సంబంధించిన కోఆపరేటివ్ సొసైటీస్ పనిచేయడం లేదు. వారు 'అన్నమో రామచంద్రా' అని అలమటిస్తున్నారు. చేనేత కార్మికులను గురించి ప్రత్యేకంగా ఆలోచన చేయండని కోరుతున్నాను.

అధ్యక్షా, ఆరోగ్య పరిస్థితిని గురించి చూద్దాము. ఈనాడు వార్తాపత్రికల్లో ఎక్కడ చూసిన బ్రెయిన్ ఫీవర్ వల్ల కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో వందలాది మంది పిల్లలు, పెద్దలు చనిపోతున్నట్లుగా తెలుస్తోంది. అంతకుముందు మలేరియాతో, గ్యాస్ట్రోఎంటరైటిస్‌తో 2156 మంది ట్రైబల్స్ ఆదిలాబాదు జిల్లాలో చనిపోవడం జరిగింది. అయినా ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదు. విశాఖపట్నం జిల్లాలో మలేరియా వ్యాధితో 7400 మంది గిరిజనులు చనిపోయారు. మాట్లాడితే ముఖ్యమంత్రిగారు వీడియో కాన్ఫరెన్సులు అని అంటూ వుంటారు. డైరెక్ట్ డయలింగ్ అంటారు. కానీ ఏమాత్రం ప్రయోజనం కనబడడంలేదు అనేది మనవిచేస్తున్నాను. మామూలు సాధారణమైన జబ్బులు, రుగ్మతలను కంట్రోల్ చేయలేని రాష్ట్రప్రభుత్వం ఎందుకు అని అడుగుతున్నారు సామాన్య మానవులు. దయచేసి ఆలోచన చేయండి.

ఫ్యామిలీ ప్లానింగ్ విషయం చెప్పడం జరిగింది. Family Planning is a very very important aspect in the life of every body. చాలామంది అమాయకులు యిప్పటికీ ఫ్యామిలీ ప్లానింగ్ గురించి పట్టించుకోవడం లేదు. మరీ

ముఖ్యంగా నిరక్షరాశ్యులు దీన్ని గురించి పట్టించుకోవడం లేదు. దీన్ని నేషనల్ ప్రోగ్రామ్స్‌గా తీసుకొని, స్టేట్‌లో ప్రత్యేక ఉద్యమంగా తీసుకోమనండి. ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో యిన్సెంటివ్స్, డిజిన్సెంటివ్స్ రెండూ ప్రకటించండి. ఫ్యామిలీ ప్లానింగ్ పాటించిన వారికి కొన్ని ప్రయోజనాలు చేకూరేటట్లు, పాటించని వారికి ప్రభుత్వం నుండి ప్రయోజనాలు రాకుండా వుండే విధంగా ఆలోచన చేయండి. ప్రత్యేక పద్ధతులలో ఈ కార్యక్రమాన్ని తీసుకోవలసిందిగా కోరుతున్నాను.

డెబ్బదివేల మంది యన్.యమ్.ఆర్‌లను జీవోయంయస్. నెం. 22 ద్వారా తీసివేశారు. వారు తినడానికి తిండి కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వున్నారు. దయచేసి వారిని గురించి ఆలోచన చేయండి. ఎడ్యుకేషనల్ వాలంటీర్స్‌కు గత మూడు మాసాలుగా జీతాలు రావడంలేదు. వారి గురించి ఆలోచన చేయండి. ఇకముందు చంద్రమోహనరెడ్డి గారు మాట్లాడుతూ 'సుబ్బరామిరెడ్డిగారు ఎక్కడికి పోయినా సింహస్వప్నంగా వున్నారు. అని అన్నారు. సుబ్బరామిరెడ్డిగారిని విజిలెన్స్ ఆఫీసర్‌గా వేశారని, కంట్రాక్టర్ల ద్వారా నాణ్యమైన పనులు జరుగుతున్నాయని వారన్నారు. ఆయనగారు నెల్లూరు జిల్లాలో జరిగే పనుల్లోనే పూర్తిగా నాణ్యత లోపించిందని, పంచాయతీ శాఖలో, యిరిగేషన్ శాఖలో, ఆర్ అండ్ బి శాఖలో జరిగే వర్క్స్‌లో నూటికి నూరు పాళ్లు ఏ ఒక్క పనిలోకూడా నాణ్యత లేదని ప్రెస్ స్టేట్‌మెంట్ యిచ్చిన పరిస్థితి వుంది. ఆ విషయం చంద్రమోహన్‌రెడ్డి గారికి తెలియదా, లేక రామనారాయణరెడ్డిగారిని ప్రెస్ స్టేట్‌మెంట్ కటింగ్ యివ్వవలసిందిగా చెప్పమంటారా? ఆ విషయం ఆలోచన చేయమనండి.

హైదరాబాదు నీటికి సంబంధించిన త్రాగునీటి విషయం చూద్దాము. మనం ఎక్కడెక్కడి నుండో యిక్కడికి వచ్చాము. కొన్ని కారణాలవల్ల హైదరాబాదు సిటీలో వున్నాము. ఈ నగరానికి మంచినీటి సరఫరా చేసే కార్యక్రమాల పట్ల ఏ కొంచెం శ్రద్ధ కూడా సక్సెసివ్ ప్రభుత్వాలు చూపడం లేదనే విషయం మనవి చేస్తున్నాను. అది కూడా ఆలోచన చేయమనండి.

సమాజంలో ఉండే పేదవారిలో కూడా అతిపేదవారుగా ఉండి తెల్లకార్డులు పొందడానికి అర్హులైన వారికి కూడా తెల్ల రేషన్ కార్డులను యివ్వడం లేదు. వారు తమకు తెల్ల రేషన్ కార్డులు కావాలని అడుగుతే వేకెన్సీ వస్తే యిస్తామని అంటున్నారు. తమకు అర్హులైన వారికి తెల్ల రేషన్ కార్డులు యివ్వకపోవడమే కాకుండా, అందుకు కారణాలు కూడా చెప్పడం లేదు. మీరు ప్రపంచబ్యాంకుకు ఆంధ్ర రాష్ట్రానికి సంబంధించిన నిరుపేదల హక్కులను కుదువపెట్టారు.

(కాంగ్రెస్ పార్టీ సభ్యులనుండి షేమ్, షేమ్ అంటూ నినాదాలు)

ప్రపంచ బ్యాంకుకు వాగ్దానంచేసి వచ్చారట వారు. ' ఉన్న రేషన్ కార్డులను తగ్గిస్తాము క్రొత్త రేషన్ కార్డులు యివ్వము' అని వారు వాగ్దానం చేయడం జరిగింది. నిజమైన నిరుపేదల ఆర్తనాదాలు చేస్తున్నారు. నెలకు 15 కిలోలో, 20 కిలోలో బియ్యమైనా యివ్వండని, కనీసం ఆ కార్యక్రమమైనా చేయండని వారంటున్నారు. అర్హులైన వారికి తెల్లకార్డులను యివ్వండి మీ ఎన్నికల ప్రణాళికలలో ఆ మాట చేర్చినా, చేర్చకపోయినా, ప్రత్యేకమైన ఆలోచనతో దాన్ని చేయండి. ఈ రాష్ట్రానికి చెందిన పేద వర్గాల వారు ఎన్నో రకాలుగా మీ మీద ఆశలు పెట్టుకున్నారు. మీరు మరోక ఐదు సంవత్సరాలు అధికారంలో వుండబోతున్నారు. మీరు చేసే ప్రతిపని పేద వర్గాలకు మేలుచేసే విధంగా వుండాలి. ఓల్డ్ ఏజ్ పెన్షన్స్ కానివ్వండి. విడో పెన్షన్స్ కానివ్వండి హైదరాబాదువంటి నగరాలకు చెందిన స్లమ్ ఏరియాలో ఇళ్ల స్థలాల కేటాయింపు కానివ్వండి సక్రమంగా చేస్తారనే భావంతో, ఆంధ్ర రాష్ట్ర ప్రజలు వారివైపు చూస్తున్నారు. వారి ఆలోచనలకు అనుగుణంగా స్పందించండి. ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ప్రగతిపథంలో ముందుకు తీసుకుపోండి మా మాటలు అప్పుడప్పుడు చివుక్కుమనిపించవచ్చు. ప్రతిపక్షంగా వున్నాము కాబట్టి తప్పకుండా ప్రభుత్వాన్ని ఎక్కడయితే లోటుపాట్లు వున్నాయో ఆ మేరకు విమర్శించడంలో వెనుకాడము మా కర్తవ్యాన్ని నిర్వహించడంలో వెనుకాడమని, ప్రజాస్వామ్యంలో మాకు ప్రజలిచ్చిన హక్కులను తప్పకుండా తగుమేరకు వాడుకోవడంలో వెనుకాడబోమని సవినయంగా మనవిచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

12.40 మ. శ్రీ దాడి వీరభద్రరావు (అనకాపల్లి):- అధ్యక్షా, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగించడానికి అవకాశం ఇచ్చినందుకు ధన్య వాదాలు తెలుపుతూ, గవర్నర్‌గారి ప్రసంగంలో తెల్పిన ప్రతిపాదనలను సమర్థిస్తున్నాను.

అధ్యక్షా, రాబోయే కొత్త శతాబ్ది ఈ రాష్ట్ర ప్రజలకు చాలా ఉత్తేజాన్ని కల్గిస్తుందని అందరి ఆకాంక్ష, చంద్రబాబునాయుడుగారి నాయకత్వంలో కొత్త శతాబ్దంలోకి అడుగుపెట్టడం రాష్ట్ర ప్రజలందరికీ ఆనందదాయకంగానూ, ప్రగతిదాయకం గానూ ఉంటుంది అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. మొన్న జరిగిన ఎన్నికలలో ప్రజలు భారతదేశ ప్రజలు భారతదేశ చరిత్రలోనే ఒక అద్భుతమైన తీర్పును ఇవ్వడం జరిగింది. అటువంటి తీర్పు ఎందుకు ఇచ్చారు? కేవలం రాజకీయపరంగా ఈ తీర్పును ఇవ్వడం జరిగిందా. లేదా ఏ కారణాల చేత ఇంత అద్భుతమైనటువంటి తీర్పు ఇవ్వడం జరిగింది అనే దానిపై చర్చించాలి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి పరిపాలన పట్ల ఈ రాష్ట్ర ప్రజలు ఆకర్షితులై మళ్లీ చంద్రబాబునాయుడుగారే ముఖ్యమంత్రి కావాలని, తెలుగుదేశం పార్టీ మళ్లీ ప్రభుత్వానికి రావాలని చెప్పి ఆశపడ్డారు. ఇక్కడే కాదు, ఇతర రాష్ట్రాలలో ఉన్నటువంటి ప్రజలుకూడ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుగారి పట్ల విశేషంగా ఆకర్షితులమన్న విషయం అందరికీ తెలిసిందే. మహారాష్ట్రకు చెందిన సోషల్ వర్కర్, వాటర్‌షెడ్ ఎక్స్‌పర్ట్ అయిన అన్నాహజారే కూడా చంద్రబాబునాయుడులాంటి ముఖ్యమంత్రి మహారాష్ట్రకు కూడా ఉండాలని చెప్పడం జరిగింది. మోహన్ ధారియాలాంటి కేంద్ర

నాయకులుకూడ చంద్రబాబునాయుడుగారి లాంటి నాయకత్వం భారతదేశంలోని మిగతా రాష్ట్రాలకు కూడా కావాలని చెప్పడం జరిగింది. ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్‌గారు కూడా చంద్రబాబునాయుడుగారి బాటలో మనం పయనించాలి, ప్రతి రాష్ట్రం కూడ వారి బాటలో నడవాలని ప్రశంసించడం జరిగింది. బిల్‌గేట్స్ వంటి వారు కూడ ముఖ్యమంత్రిని ప్రశంసిస్తూ, మళ్ళీ మీరు ఎన్నికయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌కు నేను రావటం జరుగుతుందని ఆయన చెప్పారు. ఇప్పుడే రాజశేఖర్‌రెడ్డిగారు కూడా చెప్పడం జరిగింది. వాళ్ళ (బిల్‌గేట్స్) డ్రీమ్ క్యాబినెట్‌లో చంద్రబాబును సభ్యుడుగా తీసుకోవడం జరిగింది. అంతేకాకుండా, ఈ రాష్ట్రంలోనూ, ఈ దేశంలోనూ ఇన్‌ఫర్మేషన్ మీడియా, అదే విధంగా న్యూస్ పేపర్స్, టి.వి. ఛానళ్ళు సర్వేలు నిర్వహించాయి, ఒకటి, రెండు న్యూస్ పేపర్స్ తప్ప మిగిలినటువంటి అన్ని మీడియాలు కూడ తిరిగి చంద్రబాబునాయుడి నాయకత్వాన్నే ప్రజలందరూ కోరుకుంటున్నారని చెప్పడం జరిగింది. ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ కూడ సర్వే చేసి, ప్రజలు చంద్రబాబునాయుడుగారి నాయకత్వాన్నే కోరుకుంటున్నారని చెప్పడం జరిగింది.

ఇటీవల ఒరిస్సా రాష్ట్రంలో తుపాను, వరదలు వచ్చినపుడు చంద్రబాబునాయుడు గారు ఆ రాష్ట్రానికి ఏ విధమైన సహాయ కార్యక్రమాలు ప్రజలకు అందించారో అక్కడి వార్తాపత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి. నేను ట్రైన్‌లో వస్తూ ఉంటే, హైదరాబాద్ నుండి వెళ్ళిన జర్నలిస్టులు, ఒరిస్సా రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి సహాయసహకారాల గురించి, ఆంధ్రప్రదేశ్ నుండి వెళ్ళిన అధికార యంత్రాంగం ఏ విధంగా సహాయం చేస్తున్నారో గొప్పగా చెప్పుకొంటున్నారని నాతో చెప్పడం జరిగింది. మన జర్నలిస్టులను చూసి మీరంతా "బాబు" మనుష్యులు కదా అని మమ్మల్ని బాగా రిసీవ్ చేసుకొన్నారని చెప్పి వారు చెప్పారు. అంతేకాకుండా మా రాష్ట్ర ప్రభుత్వ అధికారుల కంటే ముందుగా వరద ప్రాంతాలకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐ.ఎ.ఎస్. ఆఫీసర్స్ వచ్చి మాకు సహాయం అందించారని కూడ అక్కడ ప్రజలు చెప్పుకుంటున్నారని జర్నలిస్టులు నాతో చెప్పడం జరిగింది. మరికొంత మంది ఒరిస్సా రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కలపడానికి వీలులేదా, మాకు చంద్రబాబునాయుడుగారు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం లేదా అని కూడ ప్రశ్నిస్తున్న సంగతి జర్నలిస్టులు తెలియపరచడం జరిగింది. ఎక్కడా చూసిన పనిచేసేటటు వంటి వ్యవస్థ మాకు కావాలి, పనిచేసేటటువంటి ముఖ్యమంత్రి మాకు కావాలి ప్రతిచోట ప్రజలు కోరుకుంటున్నారు. ఎన్నికల ముందు కూడ తటస్థంగా ఉన్నటువంటి ప్రజలు ముందుకు రావాలని, రాజకీయ వ్యవస్థలో భాగం పంచుకోవాలని చంద్రబాబునాయుడుగారు "ప్రజాదీవెన" కార్యక్రమాన్ని పేరిట పిలుపును ఇవ్వగా, రాజకీయాలతో సంబంధం లేని అనేక మంది తెలుగుదేశం పార్టీలోకి రావడం జరిగింది. అదే విధంగా రాజకీయాలతో సంబంధం లేని ఈ శతాబ్దపు మహానటుడు అక్కినేని నాగేశ్వర రావు ఒక సందర్భంలో మాట్లాడుతూ, ఈసారి నేను తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తానని, చంద్రబాబునాయకత్వం కావాలి మన రాష్ట్రానికి అని చెప్పిన సంగతి మనందరికీ తెలిసిందే. మన రాష్ట్రాన్ని సింగపూరులాగా తీర్చిదిద్దాలని చేస్తున్న ప్రయత్నాలను చూసి, దేశంలోని

మిగతా రాష్ట్రాలు కూడ చంద్రబాబు నాయుడిలాంటి నాయకత్వం మాకు కూడ కావాలని కోరడం జరుగుతున్నది. రాజకీయాల గురించి ఎక్కడ ప్రస్తావన చేయకుండా, 24 గంటలూ అభివృద్ధి కార్యక్రమాలకే అత్యధిక ప్రాధాన్యతను చంద్రబాబునాయుడుగారు ఇవ్వడం జరుగుతున్నది. తెలుగుదేశం ప్రభుత్వం పనిచేసేటటువంటి ప్రభుత్వంగా, తెలుగు దేశంపార్టీ పనిచేసేటటువంటి పార్టీగా రూపుదిద్దుకోవడం జరిగింది. అహర్నిశలు ప్రజల కోసమే పనిచేస్తున్నవిషయం స్పష్టంగా తెలుస్తున్నది. ఎలక్షన్ నోటిఫికేషన్ వచ్చిన తరువాతనే ఎలక్షన్స్ గురించి, రాజకీయాల గురించి మాట్లాడుతాను తప్ప, అప్పటి వరకు అభివృద్ధి గురించే మాట్లాడతానని, ఎవరు ఎన్ని ఆరోపణలు చేసినప్పటికీ, వారికి సమాధానాలు చెప్పవలసిన అవసరం లేదని, ఎన్నికల్లో ప్రజలే సమాధానాలు చెప్తారని చెప్పడం జరిగింది రాష్ట్ర ప్రగతి కోసం అడుగుగున ప్రగతి సాధించాలనే దీక్షతో కంకణం కట్టుకొని పనిచేయడం జరిగింది. తాను నిద్రపోలేదు, అధికారుల్ని, ప్రజాప్రతినిధుల్ని నిద్రపోనీయలేదు. అందరు కూడ మా ప్రాంతం బాగుపడాలి, మా జిల్లా బాగుపడాలి, మా గ్రామం బాగుపడాలని దీక్షతో పనిచేసే విధానానికి నాంది పలకడం జరిగింది. అంతేకాకుండా ఎక్కడ సైక్లోన్ వచ్చినా అక్కడకు వెంటనే హాజర్కై, ఎక్కడ డ్రాట్ వచ్చిన అక్కడ హాజర్కై చాల త్వరగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా వెంటనే అక్కడ హాజర్కై, అక్కడ సర్వీస్ యాక్టివిటీస్ స్వయంగా పర్యవేక్షించడం జరిగింది.

12.50 మ. వీటన్నింటిని అబ్జర్వ్ చేస్తున్నారు, ప్రజలందరూ వీక్షిస్తున్నారు. పరిశీలించారు. పరిశీలనచేసి చంద్రబాబునాయుడు మనకు యింకా వుంటే మన బ్రతుకులు బాగుపడతాయని, మన రాష్ట్రం బాగుపడుతుందని వారు భావించడం జరిగింది విజన్ 2020 ప్రకారం 2020వ సంవత్సరానికల్లా ఈరాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రూపుదిద్దుకోవాలన్నది చంద్రబాబు నాయుడు గారి ఆశయం. ఆనాటికి రాష్ట్రాభివృద్ధి రేటు 9 రెట్లు పెరగాలని తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం. అక్షరక్రమంలో ఉన్న రాష్ట్రాన్ని అన్ని విభాగాలలోనూ ప్రథమ స్థానానికి తేవాలని మన రాష్ట్రప్రభుత్వం యొక్క ధ్యేయం. ఆనాడు 'సమాజమే దేవాలయం' అన్న స్వర్గీయ ఎన్.టి. రామారావుగారి మాటను ఈనాడు చంద్రబాబునాయుడుగారు 'ప్రజలే దేవుళ్ళు' అనే సందేశంతో తెచ్చి ప్రజాసేవ చేస్తూ, నిరంతరం ప్రజాభివృద్ధికి, వారి ప్రగతికి కృషి చేస్తున్న విధానం ఈనాటి ఎన్నికలలో మన గెలుపుకు ప్రధాన కారణం అయిందనడంలో సందేహం లేదు. ప్రజాస్వామ్యాన్ని అలుసుగా చూసి, ప్రజలను పావులుగా వాడుకుంటూ, అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి, వారిని నిర్వీర్యులుగా చేసిన మహమ్మారిని కాకుండా పలు అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలతో వచ్చిన తెలుగుదేశ ప్రభుత్వాన్ని దీవించాలని ప్రజలు ముందుకు వచ్చి తమ ఆశీస్సులు అందజేశారు. మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వానికి పట్టం కట్టారు. మన రాష్ట్రాన్ని మళ్ళీ ఏలమని ఆశీర్వదించారు. ప్రజలు, ముఖ్యంగా మహిళలు చరిత్ర సృష్టించారు. ఈ ప్రభుత్వం తెలుగు ప్రజలకు ఎంతో ఋణపడి ఉంది. గొప్ప నమ్మకంతోనే ఈ తెలుగుదేశ ప్రభుత్వాన్ని మళ్ళీ అధికారంలోకి తేవడం జరిగింది. కాంగ్రెసు వారు కూడా కొన్ని మాటలు చెప్పారు. తమ మానిఫెస్టోలో రాశారు ఉచిత విద్యుత్తు, ఋణాల మాఫీ యిచ్చి అదర్శ ఆంధ్రప్రదేశ్‌గా నిర్మించి, అభివృద్ధి కార్యక్రమాలతో రాకెట్ల సమరం చేస్తామని హామీ

యిచ్చారు. ప్రజలను ఆ విధంగా నమ్మించడానికి ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు ఆ మాటలను గానీ, మేనిఫెస్టోను గానీ నమ్మలేదు. కేవలం యింత వరకూ పనిచేస్తూ, ప్రజలకు సేవచేస్తున్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని మాత్రమే మళ్ళీ రప్పించుకోవాలను కున్నారు గానీ కోతలు కోసి, కాని మాటలు చెప్పే కాంగ్రెసు వారిని మాత్రం తీసుకు రాకూడదని ప్రజలు భావించారు. అందుకే తెలుగుదేశానికి మళ్ళీ పట్టం కట్టారు. ఈ ప్రభుత్వం తిండి బట్ట యిస్తుందని విశ్వసించారు. అందుకే 1983 నుంచి తెలుగుదేశం రూపుదిద్దుకుంటూ వచ్చింది.

ఆనాడు 1947లో ఇన్‌ఫ్రాస్ట్రక్చరు లేని పరిస్థితులలో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని అన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం 40 సంవత్సరాలు రాష్ట్రాన్ని ఏలినప్పటికీ వారు తెలుగుదేశం ప్రభుత్వం 1983లో వచ్చేనాటికి కూడ ఇన్‌ఫ్రాస్ట్రక్చరు సరిగా లేదని చెబుతున్నారు. గత 12 సంవత్సరాలలో తెలుగుదేశం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. ముఖ్యంగా చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో గత 4 సంవత్సరాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగేయి. 20 సంవత్సరాలలో సాధించవలసిన ప్రగతిని 5 సంవత్సరాలలో సాధించాలన్నది వారి ఆశయం. 5 సంవత్సరాలలో సాధించవలసినది ఒక్క సంవత్సరంలో సాధించాలని వారి ఆశయం. ధ్యేయం. ఆనాడు 20 – 30 ఎళ్ళ క్రితం అవి చేశాం, యివి చేశాం అప్పటి వ్యవస్థ యిప్పుడు లేదు. ఆనాటి విధానం ఈనాటికి సరిపోదు.

(శ్రీ ఎం.వి. కృష్ణారావు అధ్యక్ష స్థానంలో ఉన్నారు.)

సరళీకృత ఆర్థిక విధానం ఈనాటి వ్యవస్థకు సరిపోయేదిగా కనిపిస్తోంది. అప్పటి పరిస్థితులను బట్టి అప్పటి విధానాల రూపకల్పన జరిగిందే తప్ప, అవి ఈ రోజుకు సరిపోయే పరిస్థితి లేదు. 1983లో పరిపాలనకు వచ్చిన తెలుగుదేశం తన 12 సంవత్సరాల హయాములో 25 లక్షల పక్కా గృహాలు నిర్మించడం జరిగింది. అదే విధంగా చంద్రబాబు నాయుడు గారి హయాములో ఈ 4 ఏళ్ళలో 17న్నర లక్షల హౌస్‌సైట్సు పేద ప్రజలకు యివ్వడం జరిగింది. చంద్రబాబునాయుడు గారి నాయకత్వంలో అనేక వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడినాయి. రూ. 3,306 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడి యిప్పుడు నిర్వహించబడుతున్నాయి. అదే విధంగా, ఒక్క నీటి బొట్టు కూడా వృథా కాకూడదని వారి ధ్యేయం. 2020 సంవత్సరం నాటికి ఎక్కడా ఒక్క అంగుళం భూమి కూడా బీడువారి ఉండకూడదన్నది తెలుగుదేశ ప్రభుత్వ ధ్యేయం.

తమ ప్రభుత్వ హయాములో కాంగ్రెసు వారు 34 సంవత్సరాలకు 8.90 లక్షల విద్యుత్ కనెక్షన్స్ యిచ్చారు. మరి తెలుగుదేశం ప్రభుత్వ 12 సంవత్సరాలలో 10 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్స్ యివ్వడం జరిగింది.

మరి పారిశ్రామిక రంగం చూస్తే, 1994కు కాంగ్రెసు వారు పరిపాలన చేసిన సంవత్సరానికి ఈ రాష్ట్రం 22వ స్థానంలో ఉంది. మరి చంద్రబాబునాయుడు గారి

హయాములో తెలుగుదేశ ప్రభుత్వం వచ్చేక దీనిని అభివృద్ధి చేయడం జరిగింది. ఇప్పుడు పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానాన్ని సంపాదించుకోగలిగింది. హైదరాబాదు విషయానికొస్తే పారిశ్రామిక రంగంలో మొదటిస్థానం ఆక్రమించుకోగలిగింది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రహదారులను అభివృద్ధి చేయడం జరుగుతోంది. రూ. 6,744 కోట్లు మంజూరు చేసి రహదారులను బాగుచేసే ప్రక్రియలో ఉన్నాము. ప్రణాళిక చూస్తే, వచ్చే సంవత్సరం ప్రణాళికలో 24 శాతం నీటిపారుదల కోసం, సాగునీటి కోసం కేటాయించడం జరిగింది. విద్యుత్‌కు 16 శాతం ప్రణాళికలో కేటాయించడం జరిగింది. ఈ విధంగా కేవలం నీటిపారుదలకు, విద్యుత్‌కు 40 శాతం ప్రణాళికలో కేటాయించి అత్యధిక ప్రగతిని ఒక్క సంవత్సరంలో సాధించాలని దీక్షగా పెట్టుకున్నారు. రాబోయే 5 సంవత్సరాలలో ఏమేమి సాధించదలచుకున్నదీ గవర్నరు గారి ప్రసంగం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం యొక్క ఆశయంగా చెప్పడం జరిగింది.

మన రాష్ట్రాన్ని పీడిస్తున్న జనాభా పెరుగుదల సమస్యను నివారించడం చాలా అవసరం. జనాభా పెరుగుదలను అరికట్టడానికి, 5 సంవత్సరాలలో తగ్గించడానికి చర్యలు తీసుకోవాలి. ఆ విధంగా 4.15 శాతాన్ని తగ్గించడానికి ధ్యేయంగా పెట్టుకున్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి చూస్తే రాబోయే 5 సంవత్సరాలలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ 45.5 శాతం పెరగాలని, అభివృద్ధిని సాధించాలని ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది.

ఇక వ్యవసాయ రంగానికి వస్తే, 30 శాతం పెరుగుదలను సాధించాలని తెలుగుదేశం ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది.

పారిశ్రామిక రంగం వెనుకబడి ఉన్న పరిస్థితులలో పారిశ్రామిక రంగానికి ప్రోత్సాహకాలు యిచ్చి 5 ఏళ్లలో 58 శాతం అభివృద్ధిని సాధించాలని తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుంది. తర్వాత, సర్వీసు రంగంలో 5 సంవత్సరాలలో 60 శాతం ప్రగతిని సాధించాలని తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుంది.

ఇప్పుడే చర్చించిన అక్షరాస్యత గురించి చెప్పాలంటే, అక్షరాస్యత పెరుగుదలకు ప్రత్యేకమైన ప్రాధాన్యతను యివ్వడం జరిగింది. అందుకు అనేక చర్యలు తీసుకోవడం జరిగింది. ఇటు అక్షరాస్యత విషయం చూస్తే ప్రాథమిక విద్యారంగం అనేక రకమయిన

1.00 మ. మార్పులు తేవడం జరిగింది. అనేక అభివృద్ధి కార్యక్రమాలు తేవడం జరిగింది. దీనిని ఇంకా మెరుగుపరచ వలసిన అవసరం ఉందని తెలుగుదేశం ప్రభుత్వం గుర్తించి వచ్చే ఐదేండ్ల కాలంలో అక్షరాస్యత పెరుగుదలను ఇంకా పెంచి 2020 సంవత్సరం వరకు 83 శాతం చేయాలన్నది ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది. దీనికోసం ఒక ప్రణాళిక, ధ్యేయం పెట్టుకుని దాని ప్రకారం ఏర్పాటు చేయాలని నిర్ణయం చేయడం జరిగింది. వచ్చే 5 సంవత్సరాల కాలంలో అన్ని మారుమూల ప్రాంతాలకు రక్షిత మంచినీటి పథకాలు అమలుచేయడం జరుగుతుందని చెప్పడం జరిగింది. నివాసప్రాంతాలు

ఎక్కడ వుంటే అక్కడ మంచినీటి పథకాలు అమలుచేయాలని ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది. శానిటేషన్‌కు ఉన్న అధ్వాన్న పరిస్థితిలో పబ్లిక్ లావెటరీస్ కావాలనే పరిస్థితి వున్నప్పటికీ వాటిని సరిగా నిర్వహించలేని పరిస్థితిలో వ్యక్తిగత శానిటరీ యూనిట్స్ అభివృద్ధి చేయడం ధ్యేయంగా పెట్టుకొన్నాము. వచ్చే 5 ఏండ్ల కాలంలో 50 లక్షల వ్యక్తిగత శానిటరీ యూనిట్స్ ప్రవేశపెట్టాలనీ, శానిటేషన్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది. వచ్చే 5 ఏండ్లలో అన్ని ప్రాంతాలలో పక్కా రోడ్లు ఏర్పాటు చేయడం, ఎక్కడ కమ్యూనికేషన్ లేదో, ఎక్కడ ట్రాన్స్‌పోర్టేషన్ లేదో,- కనీసం 1000 మంది నివాసం ఉంటున్న ప్రాంతాలన్నింటిని ఐడెంటిఫై చేసి వాటన్నింటికి బి. టి. రోడ్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రాథమిక విద్యారంగానికి వస్తే ప్రతి నివాసప్రాంతంలోనూ అతి తక్కువ మంది ఉన్నచోట కూడా ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నది తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయం. ప్రతి నియోజక వర్గానికి ఒక రెసిడెన్షియల్ స్కూలును కూడా ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. మహిళకు తెలుగుదేశం అత్యధిక-ప్రాముఖ్యత ఇస్తున్న ఈ-తరుణంలో మహిళలకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు ఉచిత విద్యను అందించాలనే ప్రభుత్వం ధ్యేయాన్ని గవర్నరుగారి ప్రసంగంలో పొందుపరిచారు. సుమారు 20 లక్షల డ్వాక్రా, స్వయం సహాయక గ్రూపులున్న మన రాష్ట్రంలో వారికి ఆర్థికంగా, వృత్తిపరంగా వారి కుటుంబాన్ని పోషించుకొనే విధంగా చేయూత నివ్వాలనీ, వ్యవసాయ పరిశ్రమలయిన, ఫుడ్ ప్రాసెసింగ్ చిన్న చిన్న పరిశ్రమలు వారు ఏర్పాటు చేసుకోనేదానికి పూర్తి సహాయసహకారాలందించాలని ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది. తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడానికి మహిళలు ఇచ్చిన స్ఫూర్తితో, వారు చంద్రబాబు నాయుడు గారిని ముఖ్యమంత్రి చేయాలనే దీక్షతో కష్టపడి పనిచేయడం జరిగింది. ఇందుకు తెలుగుదేశం పార్టీ ఎంతయినా రుణపడి వుంది. వారికి సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల ద్వారా అనేక స్కీములు అమలు చేయడం జరుగుతుందని పేర్కొనడం జరిగింది. వెనుకబడిన తరగతులకు, ఎస్.సి., ఎస్.టి. బలహీన వర్గాలకు, మైనారిటీలకు అనేక కార్యక్రమాలు ప్రభుత్వం రూపుదిద్దడం జరిగింది. మైనారిటీలకు ఎక్కడ షాదీఖానా కావాలంటే అక్కడ నిర్మించి ఇవ్వడానికి పథకాలు తయారు చేయడమే కాకుండా ఆర్థికంగా వెనుకబడిన మైనారిటీలకు తగిన రక్షణ ఇస్తూ, 12 జిల్లాలలో ఉర్దూను రెండవభాషగా అమలు చేయడం ద్వారా ఆ భాషకు ప్రాముఖ్యతను ఇవ్వడం జరిగింది. తద్వారా మైనారిటీ వర్గాలకు అనేక రకాలయిన సంక్షేమ పథకాలు తెలుగుదేశం ప్రభుత్వం అమలులోకి తేవడం జరిగింది. రాబోయే కాలంలో రైతుకు గిట్టుబాటు ధర అందించడానికి తెలుగుదేశం ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకోవడం జరిగింది. ఈ రకంగా అనేక అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలు అమలు చేయడంలో ఈ ప్రభుత్వం భారతదేశం మొత్తంమీద ప్రథమస్థానంలో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ధ్యేయంగా పెట్టుకొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ, సరైన విధానాలకు తమ మద్దతు, సహాయ సహకారాలు ఈ ప్రభుత్వానికి అందిస్తామని అన్నందుకు వారికి అభినందనలు తెలుపుతున్నాను. ఈ విధంగా పనిచేసే ప్రభుత్వానికి అన్ని వర్గాలు, రాజకీయ పార్టీలు సహకరించాల్సిన అవసరం ఎంతయినా వుంది. ఈనాడు

చంద్రబాబు నాయుడుగారి సారథ్యంలో తెలుగుదేశం ప్రభుత్వం అట్టడుగు స్థాయి ప్రజల నుండి ప్రారంభించి అభివృద్ధి సాధించాలసిన అవసరాన్ని గుర్తించడం జరిగింది. 20 ఏండ్లలో సాధించే ప్రగతి 5 ఏండ్లలోనే సాధించేదానికి చర్యలు తీసుకోవాలనే, 5 ఏండ్లలో సాధించే ప్రగతి 1 సంవత్సరంలోనే సాధిస్తామని ముఖ్యమంత్రిగారు ఎన్నికల ముందు చేసిన వాగ్దానం గుర్తుచేస్తూ, అటువంటి ప్రగతి సాధించడం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామి అవుతున్నారు. జన్మభూమి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రతివారు అభివృద్ధి కార్యక్రమాలలో భాగస్వామి కావడం అనేది చాలా గొప్ప విషయం. గతంలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలకు ఏ విధమయిన సంబంధం వుండేది కాదు. ఈ రోజు మనం చేపట్టే ప్రతి కార్యక్రమం కూడా ప్రజల భాగస్వామ్యంతో చేపట్టడం జరుగుతోంది. ఇది మా కార్యక్రమం, మా ప్రభుత్వ కార్యక్రమం, మా అభివృద్ధి, ప్రగతి కార్యక్రమం కాబట్టి మేము కూడా భాగస్వాములం అవుతామని శ్రమదానం ద్వారా గానీ, ఇతర విధంగా గానీ ప్రజలు పాల్గొనడం విశేషమయిన విషయం. రాష్ట్రంలో విజన్ 2020ని దృష్టిలో పెట్టుకొని అన్ని రంగాలలో అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసేందుకు ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన పథకాలకు పూర్తి మద్దతు తెలియజేస్తూ, వచ్చే 2020 వరకు కాకుండా వచ్చే 5 సంవత్సరాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసి అతి త్వరలో రాష్ట్రాన్ని ఇతోధికంగా అభివృద్ధి చేస్తారని ఆశిస్తూ చంద్రబాబు నాయుడుగారి ప్రభుత్వానికి ప్రత్యేకమయిన అభినందనలు తెలుపుతూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ పి. ఇంద్రారెడ్డి (చేవెళ్ల):- మేడం స్పీకర్, ఈనాడు గవర్నరుగారి ప్రసంగంపై ప్రసంగించేందుకు అవకాశం కల్పించిన మీకు ముందుగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నిన్న తమరు శాసన సభాపతిగా ఏకగ్రీవంగా ఎన్నికయినందుకు, నిన్న నాకు మాట్లాడే అవకాశం లభించనందున ఈ రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

11వ శాసనసభకు ప్రజల తీర్పుపొంది అడుగుపెట్టిన ఈ ప్రభుత్వానికి, గవర్నరుగారి ప్రసంగం ద్వారా సామాజిక న్యాయానికి, సాంఘికభద్రతకు కట్టుబడి ఉండి ప్రజల తీర్పుకు అనుకూలంగా ఈ ప్రభుత్వం స్పందిస్తుందని ప్రధాన ప్రతిపక్షమయిన కాంగ్రెసు పార్టీ భావించడం జరిగింది. దానికి భిన్నంగా గవర్నరుగారి ప్రసంగంలో ఆంధ్రరాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పట్లగానీ, సామాజికంగా, సాంఘీకంగా, ఆర్థికంగా అట్టడుగు స్థాయిలో వున్న ప్రజలయొక్క సంక్షేమం కోసం ఎక్కడా కూడా స్పష్టంగా చెప్పకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రమయిన అంశంగా పరిగణిస్తున్నది.

1.10 మ.

ఇప్పుడే ప్రతిపక్షనాయకులు వై.ఎస్. రాజశేఖర రెడ్డిగారు రెండున్నర గంటల సుదీర్ఘచర్చలో, రాష్ట్రప్రభుత్వం ముందుకు, రాష్ట్రప్రభుత్వ పరిశీలనలోకి రావలసిన అనేక అంశాలను తీసుకురావడం జరిగింది. మా నాయకుడు ప్రస్తావించిన అంశాలజోలికి వెళ్లకుండా నేను కొన్ని ప్రధానమైన అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువస్తాను.

పోయిన నెలలో అధికారాన్ని చేపట్టిన నూతన ప్రభుత్వం సుమారుగా 576 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించడం జరిగింది. అక్టోబరు 1, 2, 3 తారీఖులలో నిర్దుష్టంగా, శాస్త్రీయబద్ధంగా కరువు అంచనాలను వేయడానికి కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఒక బృందాన్ని పంపింది. కాంగ్రెసు పార్టీ తరపున మేము వారిని కలిసినపుడు, పరిశీలనకు వచ్చిన కేంద్ర బృందం నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన తరువాత, ఆ నివేదిక ఆధారంగా నిధుల విడుదలలో ఆలస్యమవుతుంది కనుక, ఈలోపుగా కరువు పరిస్థితిని అధిగమించడానికి జిల్లా కలెక్టర్ల ద్వారా నివేదికలు తెప్పించుకుని కరువు సహాయక చర్యలను చేపట్టాలని చెప్పడం జరిగింది. అయితే, 45 రోజుల తరువాత, ఇటీవలే ప్రజాతీర్పు పొందిన గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో వున్న ప్రభుత్వం, స్పందించి 576 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన తరువాత కూడా, ఉత్తర ఆంధ్ర కానీ, ఉత్తర తెలంగాణ కానీ, దక్షిణ తెలంగాణా కానీ, ప్రకాశం వంటి వెనుకబడ్డ జిల్లాలలో కానీ, కనీసం మంచినీటి సదుపాయం కూడా కల్పించ కుండా ఏమి చేస్తున్నట్టు? డైరక్టర్ ఆఫ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్రకారం వర్షాకాలంలోనే మంచినీరు లేని పరిస్థితి వుంది. పరిశుభ్రమైన ఒక గ్లాసు మంచినీరు కూడా ఇవ్వలేని పరిస్థితి పల్లె సీమలలో తలెత్తిన జిల్లా కలెక్టర్లు ఎవ్వరూ కూడా ఒక్క నయాపైసా కూడా ఇవ్వని పరిస్థితి వుంది. గౌరవ ముఖ్యమంత్రిగారి జవాబులో దీనిని గురించి చెప్పవలసిన అవసరం ఉంది. ఇందాక మా నాయకుడు చెప్పారు. ఆదిలాబాదు జిల్లాలో సుమారుగా 2,750 మంది పరిశుభ్రమైన నీరు లభించకపోవడంవల్ల అతిసారా వ్యాధితో మరణించడం జరిగింది. గత 15 రోజుల కాలంలో వికారాబాదు, చేవెళ్ల నియోజకవర్గాలలో 800 మంది రైతులు, రైతు కూలీలు పరిశుభ్రమైన నీరు అందక ఆసుపత్రి పాలవడం జరిగింది. అదే కాకుండా కరువు పరిస్థితిని గురించి డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఒక నివేదికను సమర్పించడం జరిగింది. అశోక గజపతిరాజు గారి సారధ్యంలో వున్న రెవిన్యూ డిపార్ట్‌మెంట్ కరువు పరిస్థితిని అధిగమించడానికి ఏమి చర్యలు చేపట్టారో తెలియదు. రెవిన్యూ డిపార్ట్‌మెంట్ వారు టీమ్స్‌ను ఏర్పాటు చేశాము, అవి పల్లెసీమలకు వెళుతున్నాయని చెప్పడం జరిగింది. రెవిన్యూ డిపార్ట్‌మెంట్ వారి టీమ్‌లు కరువును అధ్యయనం చేయడం కోసం ఒక్కపల్లె సీమకు కూడా వెళ్లలేదని మనవి చేసుకుంటున్నాను. దీని విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన వివరణను ఇవ్వవలసిన అవసరం వుంది.

అనేక సందర్భాలలో మేము చెబుతూ వస్తున్నాము. కర్మాగారాలలో, కార్ఖానాలలో, గనులలో, వ్యవసాయ క్షేత్రాలలో, కళాశాలల్లో, పాఠశాలల్లో పనిచేస్తున్న వేలాదిమందిని నిర్దాక్షిణ్యంగా ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి, తొలగించడానికి నిర్ణయం తీసుకున్నది. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతీ యువకులు, నూతనంగా పదవీబాధ్యతలు చేపట్టిన గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో తమకు ఉద్యోగావకాశాలు కలుగుతాయని ఆశించారు. ప్రభుత్వం రంగసంస్థలలో కానీ, ప్రభుత్వ కార్యాలయాలలో కానీ, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం యొక్క యాజమాన్యంలో నిర్వహించబడు తున్న పరిశోధనాశాలల్లో కానీ, గత 14 సంవత్సరాల నుంచి ఎన్.ఎం.ఆర్.లుగా

పనిచేస్తున్న 70,000 మంది ఉద్యోగులు, కొత్త ప్రభుత్వం తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేస్తుందని ఆశించారు. కాని ఒక్కకలం పోటుతో నిర్దాక్షిణ్యంగా 14 సంవత్సరాలనుండి పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించడం ఎంతవరకు సమంజసం?

గవర్నరుగారి ప్రసంగంలో – మా ప్రభుత్వం, గణతంత్ర స్వర్ణోత్సవ సంవత్సరంలో, లౌకిక విధానం, నూతన సాంఘిక న్యాయానికి సంబంధించిన మార్గాలప్పై ముందుకు సాగుతుంది అని చెప్పారు. స్పీకర్ సర్, ఇదేనా సాంఘిక న్యాయమంటే? ఈ ప్రభుత్వం దృష్టిలో సామాజిక న్యాయమంటే ఇదేనా వేలాది మంది కుటుంబాలను శిరచ్ఛేదం చేయడమేనా సామాజిక అభివృద్ధి, సామాజిక న్యాయమంటే?

మా నాయకుడు రాజశేఖరరెడ్డి గారు మాట్లాడుతూ చెప్పారు, 33 ప్రభుత్వరంగ సంస్థలను, లాభాలలో నడుస్తున్నప్పటికీ, ఉద్దేశ్యపూర్వకంగా మూలధనం సమకూర్చ కుండా మూసివేయడం జరిగిందని. ఇందులో పారిశ్రామిక ప్రగతే మా లక్ష్యంగా ముందుకు వెళతామని, చెప్పడం జరిగింది. అనేక సందర్భాలలో గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పారు. మహిళలకు ప్రాధాన్యతనిస్తున్నాము, 31 మంది మహిళలకు టిక్కట్లను ఇచ్చామని, ఒక మహిళను అత్యున్నతమైన స్పీకర్ పదవిలో నియమించడం జరిగిందని చెప్పారు. 31 మంది మహిళలకు టిక్కట్లను ఇచ్చినంత మాత్రాన, ఒక మహిళను స్పీకర్ పదవిలో నియమించినంత మాత్రాన రాష్ట్రంలో వున్న 2.20 కోట్ల మంది మహిళల ప్రయోజనాలను కాపాడడం జరగలేదని తెలియజేసుకుంటున్నాను.

ముఖ్యమంత్రిగారి కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన తరువాత రంగారెడ్డి జిల్లాలోని యూని శ్యాంకో కర్మాగారంలో 30 సంవత్సరాలనుంచి పనిచేస్తున్న 250 మంది మహిళలను ఒక్క నయాపైసా ఇవ్వకుండా ఉద్యోగంలోంచి తొలగించడం జరిగింది. లేబర్ కమీషనర్‌కు విజ్ఞాపన పత్రం పంపడం జరిగింది, లాభంలేదు. మన రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యంలోని ఆల్విన్ వాచ్ డివిజన్‌లో పనిచేస్తున్న 750 మంది వర్కర్లను నిర్దాక్షిణ్యంగా ఉద్యోగంలోంచి తొలగించడం జరిగింది. మీరు వాలంటరీ రిటైర్మెంట్ స్కీమ్‌లోకి వచ్చేందుకు సంతకాలు పెడతారా లేకపోతే మిమ్మల్ని అర్జెన్సీ ద్వారా తొలగించాలా అని భయపెట్టడం జరిగింది. అలాగే మేడ్చల్ నియోజకవర్గంలో అంపో బిస్కట్ల కర్మాగారం వుంది. అక్కడ 500 మంది మహిళా కార్మికులు పనిచేస్తున్నారు. రెండున్నర సంవత్సరాల నుంచి యాజమాన్యం వారిని కర్మాగారం లోపలికి రానివ్వడం లేదు, కనీస వేతనాలు చెల్లించడంలేదు, వేధింపు కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. న్యాయమైన హక్కుల సాధన కోసం మహిళలు పోరాటాలు చేస్తున్న సందర్భాలలో మహిళలైన పోలీసులు, వారు మహిళలనే మానవతా విలువలను కూడా పాటించకుండా పోలీసు స్టేషన్లో నిర్బంధించి, తప్పుడు కేసులు పెట్టడం జరుగుతోంది. ఇదేనా మహిళా సంక్షేమం? మహిళల కోసం చేపట్టవలసిన కార్యక్రమాలు ఇవేనా? ఆల్విన్ వాచ్ డివిజన్‌లో పనిచేస్తున్న 750 మంది మహిళలను తొలగించడం న్యాయమా?

ఎన్.టి.రామారావుగారు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు, నేను హోం మంత్రిగా పనిచేసినప్పుడు, గౌరవ చంద్రబాబునాయుడుగారు ఫైనాన్స్ మినిస్టరుగా పనిచేయడం జరిగింది. క్యాబినేట్‌లో ఒక రోజున పబ్లిక్ రంగ సంస్థలకు సంబంధించిన అంశం వచ్చినప్పుడు, ఫైనాన్స్ మినిస్టర్‌గారు ఆల్విన్ వాచ్ డివిజన్ కాని, మెయిన్ డివిజన్ కాని మూసివేయడానికి వీలు లేదని రూ. 3.50 కోట్లను మూలధనంగా సమకూర్చడం జరిగింది. ముఖ్యమంత్రి అయిన తరువాత ఆ ఆలోచనా విధానం ఎక్కడకు పోయిందని అడుగుతున్నాను.

మేము అనేక సందర్భాలలో చెప్పాము. ఈ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి నడుస్తోంది. బహుళజాతి సంస్థలు, పెట్టుబడిదారులు దాచుకున్న డబ్బులను మనలాంటి పేద దేశాలకు రుణాల ద్వారా ప్రపంచబ్యాంకు ఇస్తోంది. ఆ ప్రపంచబ్యాంకు షరతులకు లోబడి ఈ ప్రభుత్వం నడుస్తోంది. అందుకే ఈరోజు 70,000 మంది ఎన్.ఎం.ఆర్.లను తొలగించడం జరిగింది అంటే అది తప్పనిసరిగా ప్రపంచ బ్యాంకు విధించిన షరతులకు లోబడే చేయడం జరిగిందని మనవి చేస్తున్నాను. అధ్యక్షా,
1-20 మ. ఈ ప్రభుత్వం ఇంతటితో తగ్గదు. ఈ క్రొత్త ప్రభుత్వం చీఫ్ సెక్రటరీకి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఆర్.టి.సి., విద్యుత్‌బోర్డు, మీట్ అండ్ పౌల్ట్రీ కార్పోరేషన్ తదితర సంస్థల పనితీరుపై నివేదికను సమర్పించమని ప్రభుత్వం కోరింది. ఈ సంస్థలన్నింటినీ మూసివేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మాకు సమాచారం అందింది. ప్రపంచబ్యాంకు, 12 లక్షల 75 వేల మంది ప్రభుత్వ సంస్థల్లోనూ, స్థానిక సంస్థల్లోనూ పనిచేస్తున్న ఉద్యోగుల నుండి కనీసం 12 శాతం ఉద్యోగస్థులను తగ్గించాలని కండీషన్ పెట్టడం జరిగింది. ప్రపంచబ్యాంకు షరతులకు లోబడే ఈ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న ఎన్.ఎం.ఆర్.లను తొలగించడానికి నిర్ణయం తీసుకొందని మనవి చేస్తున్నాను. హరిజన, గిరిజన, మైనారిటీ వెనుకబడిన కులాలకు చెందిన 72 వేల మంది ఎన్.ఎమ్.ఆర్.లను తీసివేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. ఇదే హరిజన, గిరిజన, వెనుకబడిన కులాల వారి సాంఘిక భద్రత కోసం పాటుపడుతున్నామని మన ముఖ్యమంత్రిగారు ఎన్నికల ముందు ప్రచారం చేసి ఓట్లుపొంది నేడు వారినే ఉద్యోగాల నుండి తొలగించడం జరుగుతోందంటే ప్రభుత్వం దీనిని ఏవిధంగా జవాబు చెప్పుకొంటుందని ప్రశ్నిస్తున్నాము. ఈ విషయమై ముఖ్యమంత్రిగారు సభలో చెప్పాలి. ఈ 70 వేల మంది ఎన్.ఎమ్.ఆర్.లను ఉద్యోగాల్లో కొనసాగిస్తామని ప్రభుత్వం ఒక పాలసీ స్టేట్‌మెంట్‌ని సభలో చేయాలని, హరిజన, గిరిజన, వెనుకబడ్డ వర్గాల వారిపై ప్రభుత్వానికి ఉన్న సానుభూతిని చేతల్లో నిరూపించుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగారిపై ఉంది. గత నాలుగున్నర సంవత్సరాల కాలంలో జాతీయస్థాయి రాజకీయాల్లో గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రముఖ భూమిక పోషిస్తున్నారు. దేవేగౌడ, గుజ్రాల్‌గార్లు ప్రధానమంత్రి పదవిని అధిష్ఠించడానికి ఈయన సహకరించారు. ప్రస్తుతం బి.జె.పి.తో ఎన్నికల పొత్తు పెట్టుకుని ఆంధ్రరాష్ట్రంలో అధికారంలోకి వీరు వచ్చారు. మళ్ళీ ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు కూడా సి.ఎం.గారు కీలక భూమిక నిర్వహించారు. అయినప్పటికీ కర్నాటక రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్రానికి రావాల్సిన సాగునీరు సరిగా రావడంలేదు. రెండువేల సంవత్సరానికి బచావత్ అవార్డు ప్రకారంగా రావాల్సిన నదీజలాలు, కృష్ణా నదిపై

మనకున్న హక్కులను ప్రక్కరాష్ట్రమైన కర్నాటక ఉల్లంఘించి ఆల్‌మట్టి డ్యాంని చేపట్టడం జరిగింది. కేంద్రప్రభుత్వం సుమారు 670 కోట్ల రూపాయలు కర్నాటకకు ఇచ్చింది. సి.డబ్ల్యు.సి. ఆంధ్రా ప్రజలకు వాటా ప్రకారం దక్కాల్సిన నీటిని దక్కనీయకుండా చేస్తోంది. ఈ ప్రభుత్వం ఏమి చేస్తోందని అడుగుతున్నాను. నాగార్జునసాగర్, కృష్ణాజలాలు గుంటూరు, ఈస్ట్, వెస్ట్ గోదావరి జిల్లాల్లో అస్యూర్డ్ వాటర్ సోర్స్ సప్లయి ఉన్న ప్రాజెక్టులపై ఆల్‌మట్టి డ్యాం నిర్మాణం చేయడం వల్ల ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి.

కావేరి నది జలాల విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఢిల్లీ లోని బి.జె.పి. ప్రభుత్వానికి సపోర్ట్ ఇచ్చి కావేరి నదీ జలాల సమయం పెంపు తీసుకోవడం జరిగింది. ప్రత్యేక అనుమతి తీసుకోవడం జరిగింది. బీహార్ ప్రభుత్వం హిల ఏరియా ప్రాజక్టుకి 8 వందల కోట్ల రూపాయలు తీసుకోవడం జరిగింది. అస్సాం ప్రభుత్వం కూడా ప్రాజెక్టులు తెచ్చుకోవడం జరిగింది. మన ముఖ్యమంత్రిగారు 7 కోట్ల తెలుగు ప్రజల ప్రయోజనాలు ఎందుకు కాపాడడం లేదు. కేంద్రంలో ప్రధానుల ఏర్పాటుకు నేను కీలకమైన భూమికను పోషించానని చెప్పుకొనే ముఖ్యమంత్రి అక్కడ అవకాశం ఉంటే ఎందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం లేదని అడుగుతున్నాను. నదీ జలాల విషయంలోనూ. రైలు మార్గాల విషయంలోనూ, టెలీకమ్యూనికేషన్స్ విషయంలోనూ ఆంధ్రరాష్ట్రానికి రావాల్సిన ప్రాజక్టులను సాధించడంలో ఎందుకు చొరవ చూపించడం లేదు? ఈ విషయమై ఆయన ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉంది. మూడు మాసాల క్రితం మన రాష్ట్రానికి రావాల్సిన సౌత్ ఇండియా రైల్వే సబ్‌స్టేషన్ మనకు రాకుండా కర్నాటక రాష్ట్రానికి వెళ్ళిపోయింది. ముఖ్యమంత్రిగారు అమెరికా పర్యటనకు వెళ్ళి కోట్లాది రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడం జరిగిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ప్రాజెక్టులు రాష్ట్రానికి రావడం లేదు. తిరుపతిలో ఉన్న తిరుపతి రైల్వే ఎక్స్ఛేంజ్‌ని కూడా ఎత్తివేయడం జరిగింది. వీటన్నిటిపై ముఖ్యమంత్రిగారు స్పష్టముగా జవాబు చెప్పాలి. గత నాలుగున్నర సంవత్సరాలలో ఈ ప్రభుత్వం ఏదైనా క్రొత్త కర్మాగారాన్ని రాష్ట్రంలో ప్రారంభించిందా? అని అడుగుతున్నాను. ముఖ్యమంత్రిగారు అమెరికా, సింగపూర్ వెళ్ళి కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టడానికి వారు అంగీకరించారని చెప్పారు. ఎన్ని కోట్ల రూపాయలు వారు పెట్టుబడులు పెట్టారో చెప్పాలని కోరుతున్నాను. ఈ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో ఉన్న ఈ ప్రభుత్వం ఒక్క కార్మాగారాన్ని కూడా స్థాపించలేక పోతోంది. ఒక్క ప్రాజక్టునైనా సాధించి తీసుకురాలేకపోతోంది. అభివృద్ధి గురించి, రాష్ట్ర ప్రగతి గురించి మీరు మాట్లాడుతూ ఉంటే ఎట్లా నమ్మాలి? మేము గెలిచామని మీరు అంటూ ఉండవచ్చు. గెలవడం గొప్ప పనికాదు. క్రెడెన్షియల్స్ ఎస్టాబ్లిష్ చేయాల్సిన అవసరం ఉంది. పనిచేస్తున్నామని చెప్పుకొనే మిమ్మల్ని ఇదేనా పనిచేసే విధానం అని అడుగుతున్నాను. ఎన్నో కార్మాగారాలు మూసేస్తున్నారు. ఉద్యోగసుతులను తొలగించి, క్రొత్త కార్మాగారాలకు ప్రణాళికలు రూపొందించలేక పోతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరుతున్నాను. గోదావరి నదిపై విషయమై ఏదో

వాడావిడిగా గౌరవ ముఖ్యమంత్రిగారు కమీషన్ వేశారు. ఇంతవరకు ఏమి జరిగింది? గోదావరి నది జలాల అంతర్‌రాష్ట్ర వివాదం పరిష్కారం చేయకుండా కర్నాటక, మధ్యప్రదేశ్, ఒరిస్సా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ 5 రాష్ట్రాలకు ఉన్న అంతరాష్ట్ర వివాదం తేల్చకుండా ఏవిధంగా ముందుకు ప్రయాణం చేస్తారు. ఎట్లా చేస్తారు? ఫస్ట్ ఫేజ్ పూర్తి చేయడానికి ఇంజనీర్ల అంచనాల ప్రకారంగా 4800 కోట్ల రూపాయలు కావాల్సి ఉండేది. ప్రభుత్వం కేవలం 5 కోట్ల రూపాయలు ఇచ్చి ఒక కమిటిని వేసింది. అవి ఎందుకు సరిపోతాంది. ఇప్పటి వరకు అవి మీటింగ్స్‌కే అయిపోయి ఉండవచ్చు. అంతరాష్ట్ర నదీజలాల వివాదం కోసం ముఖ్యమంత్రిగారు చొరవ చూపించాలి. నిర్దిష్టమైన సమయం పెట్టుకొని ఆచరణ సాధ్యమైన కార్యక్రమాలు రూపొందించాలి. గోదావరి నదీ జలాల వల్ల ముఖ్యంగా తెలంగాణా ప్రాంతములో, ఉత్తర తెలంగాణా ప్రాంతంలోని 5 జిల్లాల్లోని 50 లక్షల ఎకరాలకు నీరు పారే అవకాశం ఉన్నది. ఈ రాష్ట్ర ప్రగతి గోదావరి నది జలాలపై ఆధారపడి ఉంది. దీని గురించి నిర్దిష్టమైన, శాస్త్రీయమైన టైం బౌన్డ్ ప్రోగ్రాం ముఖ్యమంత్రిగారు నిర్ణయించాల్సిన అవసరం ఉంది. 1998-99 బడ్జెటులో నల్గొండ జిల్లా లెఫ్ట్ కెనాల్ పూర్తి చేయడం కోసం 275 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 13 బ్రాంచెస్‌కి గాను 11 బ్రాంచెస్‌ని మన ముఖ్యమంత్రిగారు ప్రారంభించారు. Out of 13 branches, 11 branches were started. How are you going to convince the people of Telangana, especially Nalgonda district? బడ్జెటు కేటాయింపులు చూస్తే బ్రహ్మాండముగా కనిపిస్తున్నాయి. ఆచరణలో చూస్తే ఆ సొమ్ము ఇంజనీర్ల జీత భత్యాలకే సరిపోతున్నాయి. ఎస్.ఆర్.ఎస్.పి. భీమా, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, జూరాల ప్రాజక్టు, ఎస్.ఆర్.ఎస్.పి. ఫేజ్-2 శ్రీశైలం లెఫ్ట్. రైట్‌కెనాల్స్ గురించి కూడా చెప్పడం జరిగింది. బడ్జెటులో 1998-99కి 895 కోట్ల రూపాయలు మేజర్ ఇరిగేషన్ కోసం కేటాయించారు. కానీ ఖర్చు చేసింది ఎంతో చూడాలి. ఈనాడు మీరు ప్రాజక్టులను ఎంత కాలంలో పూర్తి చేస్తారో చెప్పాలి. ఒక కోటి 80 లక్షల ఎకరాల సారవంతమైన భూములు రాష్ట్రములో ఉన్నాయి. గోదావరి, కృష్ణా, జలాలపై ముఖ్యముగా ఆధారపడిన మనము బచావత్ అవార్డు ప్రకారంగా ఏవిధంగా పూర్తి చేసుకొంటాము. రెండువేల సంవత్సరానికి ఇంకెన్ని మాసాలు ఉంది? రెండు మాసాల్లో 8 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి కృష్ణా జలాలు సాధించగల్గుతారా అని అడుగుతున్నాను. ఇప్పటికైనా ముఖ్యమంత్రిగారు, వారి మిత్రపక్షమైన బి.జె.పి వార్కి మేము విజ్ఞప్తి చేసేది ఏమంటే మరో 20 సంవత్సరాలు ఈ బచావత్ అవార్డుని పొడిగించడమా? లేక జాతీయ ప్రాజక్టు క్రింద కృష్ణానదిని సాధించడానికి తన పరపతిని ఢిల్లీలో ఉపయోగించి రెండు వేల సంవత్సరం నాటికి తీసుకు వచ్చి ఈ ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనీ, ఆ బాధ్యత ముఖ్యమంత్రి గారిపై ఉందని తెలియజేస్తున్నాను. రెండు మాసాల్లో ఏమి సాధించగల్గుతామని అడుగుతున్నాను. నేను ముఖ్యమంత్రిగార్ని నిందించడం లేదు. గత అనేక సంవత్సరాలలో ఆంధ్రరాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన వారు దీనికి నైతిక బాధ్యత వహించాల్సి ఉంది. రెండువేల

1.30 మ. సంవత్సరం ముందుకు వస్తున్నది. ప్రజలు ఓట్లు వేసి ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు. రెండువేల సంవత్సరానికి ఇంకా రెండు మాసాలు మాత్రమే వుంది. మరి కృష్ణానదీ నీరు మనకు 375 టి.ఎం.సిలు ఎప్పుడు ఎలా సాధిస్తారు? ఈ విషయమై మీరు చెప్పవలసిన అవసరం వుంది. ప్రజలు అన్ని ప్రభుత్వాల గురించి ఆలోచిస్తూనే వున్నారు. అందరిగురించి ప్రజలు ఆలోచిస్తూనే వున్నారు. మేము కూడా ప్రభుత్వంలో వుండి, అందులో అంతర్భాగంగా ప్రవర్తించినవారమే. ప్రజలముందు ఏమీ చేయలేని తలవంచుకునే పరిస్థితి వస్తున్నది. మీరు ప్రభుత్వంలో వున్నారు కాబట్టి, మీ ప్రభుత్వమే వుందికాబట్టి గత విషయాలను గూర్చి మీకు గుర్తు చేస్తున్నాను. అందువల్ల స్పష్టమైన సమాధానం యివ్వాలని అడుగుతున్నాను.

మీడియం ఇరిగేషన్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఏరియల్ సర్వేద్వారా, రిట్నర్డ్ చీఫ్ ఇంజనీరు ద్వారా సుమారు 500 ప్రాజెక్టులను సర్వే చేశారు. మరి వాటిని ఏవిధంగా పూర్తి చేస్తారు? గవర్నరుగారి ప్రసంగంలో ఈ విషయమై ఒక్క మాటకూడా చెప్పలేదు.

ఇక అగ్రికల్చర్ విషయం చూస్తే, ఎక్కడ చూచినా నకిలీ మందులు, ఎరువులు, విత్తనాలు మార్కెటులో కనపడుతున్నాయి. అలాంటి మందులు పైర్లకు కొట్టినట్లయితే పురుగులు నశింపకపోగా, ఆ మందులను త్రాగి అవి బరువు పెరుగుతున్నాయి. మరి ఈ విషయాలను గురించి కూడా గవర్నరుగారు తమ స్పీచ్‌లో చెప్పలేదు. గతంలో ఈ నకిలీ మందుల విషయమే వ్యవసాయమంత్రిగారు మేము మొత్తుకోగా, మొత్తుకోగా ఒక కమిటీని వేశారు. విద్యాసాగర రావుగారు కమిటీ రిపోర్టు వచ్చిందా?

(అంతరాయం)

ఒక శాసనసభ్యుడు విద్యాసాగర రావుకాదు విద్యాధర రావు

శ్రీ పి. ఇంద్రారెడ్డి:— అవును పొరపాటున అన్నాను. విద్యాధరరావుగారూ ఆ కమిటీ రిపోర్టు వచ్చిందా? విద్యాసాగర రావుగారు సెంట్రల్‌లో వున్నారు. మీరు మళ్లీ మంత్రిగా వచ్చారు. అతి కష్టం మీద నౌకరీదొరికిందన్నా నీకు. అందుకే గౌరవ ముఖ్యమంత్రిగారు అన్నారు 33 మంది సమర్థులని. అంటే మిగతావాళ్ళంతా ఏమిటో వాళ్ళనే ఆలోచించుకోమనండి.

(అంతరాయం)

వ్యవసాయరంగంలో నిర్దుష్టమైన కఠినమైన చర్యలు తీసుకోవాలి. ఇప్పటికే ఆంధ్రరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం 18 వేల మంది మందులు అమ్మేవారి మీద నకిలీ మందులు అమ్ముతున్నారని క్రిమినల్ కేసులు పెట్టి వారివారి లైసెన్సులు రద్దుచేసింది.

అయితే ఇప్పుడు మళ్ళీ లైసెన్సులు రద్దు చేయబడినవాళ్ళే మళ్ళీ లైసెన్సులు పొంది ఈ క్రిమిసంహారక మందులు, ఎరువులు, విత్తనాలు అమ్ముతున్నారు.

మరి వారి మీద నిఘా వేయాలి. తిరిగి వారు ఈ నకలీ మందులు అమ్మకుండా కఠినమైన చర్యలు తీసుకోవలసిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద వుంది. అనేక మంది రైతులు ఈ నకిలీ మందుల మూలంగా పంటలు పాడై ఆత్మస్థైర్యము పోయి ఆత్మహత్య లు చేసుకున్న సంఘటనలు ఆంధ్ర రాష్ట్రంలో చాలా వున్నాయి. కనుక ఇది సీరియస్‌గా ఆలోచించవలసిన సమస్య. కనుక తమరు స్పందించాలి.

ఇక మంచినీటి సమస్యగూర్చి చూసినట్లయితే జంటనగరాలలో ఉన్న ప్రజలకు అందరికీ మంచినీరు అందడంలేదు. ఏడుకోట్ల జనాభాకు కూడలిగా వున్న హైదరాబాద్ నగరంలో ఈ వర్షాకాలంలోనే మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించాల్సివుంది. అందుకోసం సింగూరు, హిమాయత్‌సాగర్, గండిపేట నీరు నగరానికి తెస్తున్నాము. అయితే కృష్ణానది నదీ జలాలను నగరానికి తేవలసిన అవసరం ఎంతైనావుంది. ఇదివరలో నగరానికి కృష్ణానదీ జలాలను తేవాలని ప్రభుత్వం అనుకుంది. అయితే దానికి మాత్రం సాధించలేదు. ఆనాడు జంటనగరాలలో 30 లక్షలు ఉన్న జనాభా నేడు 50 లక్షల జనాభాగా మారింది. గ్రామాలలో ఉపాధి అవకాశాలు లేక గ్రామీణ ప్రజలంతా నగరానికి తరలి వస్తున్నారు. మరి వారందరికి మంచినీటి కొరత తీర్చేందుకుగాను ఈ ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంది అన్న విషయమై గవర్నరుగారి స్పీచ్‌లో ఒక్క మాటాలేదు. హైదరాబాదు చుట్టుప్రక్కలగల పురపాలక సంఘాల పరిధిలో కూడా మంచినీటి సమస్య వుంది. మేజర్ గ్రామపంచాయతీలు వున్నాయి. రాజేంద్రనగర్ పురపాలక సంఘం, శంషాబాద్, ఎల్.బి.నగర్, ఉప్పల కాప్రా, అల్వాల్ పురపాలక సంఘాలు, శేరిలింగంపల్లి పురపాలక సంఘం వీటిలో 18 లక్షల అదనపు జనాబా వున్నారు. వారందరికీ మంచినీటిని సరఫరా చేసేందుకు నదీజలాల విషయంలో మెట్రోవాటర్ వర్క్స్ ఒక ప్రణాళిక తయారు చేశారు. దానిని అమలు చేయాలి. లేనట్లయితే రాబోయే వేసవిలో హైదరాబాదునగరంలో మంచినీటి కొరత వల్ల ఏర్పడే పరిస్థితులు యిలాగే కొనసాగితే రాబోయే కాలంలో గవర్నమెంట్ హాస్పటల్స్, ప్రయివేట్ హాస్పటల్స్ ఏవీ చాలవు. హైదరాబాదు, సికింద్రాబాదులలో 750 స్లమ్స్ వున్నాయి. అక్కడ నివశిస్తున్నవారు 2, 3 కిలో మీటర్ల దూరం నుండి లీటరు రెండు, మూడు రూపాయల చొప్పున సైకిళ్ళతోనూ, స్కూటర్స్‌తోనూ నీరు తెచ్చుకోవలసిన పరిస్థితిలో వున్నారు. ఈ ప్రభుత్వం సీరియస్‌గా ఈ విషయమై స్పందించాలి.

అదే విధంగా మేము ఎన్నికలలో ముందు, కాంగ్రెసు పార్టీ ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తాము అన్నాము. దానిని ఏవిధంగా చేస్తారని వారడిగారు. దానిని ఒక పెద్ద రాజకీయం చేశారు. ఒక మాటడుగుతాను. నాడు మీరు ఎన్నికల ముందు కిలోరెండు రూపాయల బియ్యం యిస్తామన్నారు. అది ఎలా సాధ్యం అయింది? ఈరోజు ముందడుగు, క్రాంతి పథకాలు ఏవిధంగా సాధ్యం అవుతున్నాయి? ఈ ప్రభుత్వం వాటిని ఏవిధంగా

ప్రవేశపెట్టింది? ప్లాన్, నాన్‌ప్లాన్ మొత్తం సుమారు రూ.8500 కోట్ల బడ్జెటు వున్న ఆంధ్ర రాష్ట్రం, ప్లాన్, నాన్‌ప్లాన్ కలిపి అందులోనుంచి 2500 కోట్ల రూపాయలు ఉచితంగా యివ్వాలన్న ఉద్దేశ్యంతో, విద్యుత్‌ను ఉచితంగా యివ్వాలన్న ప్రతిపాదనను ప్రజలముందు పెట్టాము. దానికి ఎలా విమర్శించారో చూడండి. మరి ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో కనీస విద్యుత్‌ను కూడా యివ్వడంలేదు. మాజిల్లాలో 120 గ్రామాలలో విద్యుత్ సరఫరాను మంచినీటిని యివ్వడానికి ఉపయోగించేందుకు కూడా యివ్వడంలేదు. నిలిపివేశారు. 570 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వం ఆయా ప్రాంతాలలో కూడా మంచినీటి కోసం కూడా విద్యుత్‌ను యివ్వడంలేదు. అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లి నిర్బంధంగా కరెంటు తీగెలు లాగివేస్తున్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అంతేకాకుండా కరువు మండలాలని కూడా చూడకుండా వారి నుండి బకాయిలు నిర్బంధంగా వసూలు చేస్తున్నారు. మేము ఏవిధంగా ఉచితంగా విద్యుత్తును యివ్వగలమో నేను చెప్పాను. కనుక నేను చెప్పేదేమంటే రైతుల నుండి నిర్బంధంగా బకాయిలు వసూలు చేయకండి.

మీరు 3 హెచ్.పి కరెంటు మోటర్లను బిగిస్తున్నారు. 5 హెచ్.పి మోటర్లకు బదులు 3 హెచ్.పి ఇస్తున్నారు. అలాకాకుండా మీరు 5 హెచ్.పి బిగించండి. మా సోదరుడు, యంగ్‌మాన్ సుబ్బారాయుడు మళ్లీ హైదరాబాదు వచ్చారు. ఢిల్లీకి వెళ్లిన ఆయన తిరిగి యిక్కడకు వచ్చారు. చాలా సంతోషం. ఆయన ఈ నిర్బంధ విద్యుత్ బకాయిల వసూలును చేయకుండా వుండాలని కోరుతున్నాను. స్పీకరుగారూ 1989 నుంచీ వార్షిక బడ్జెటులో 50 వేల విద్యుత్ కనెక్షన్స్ అని చెపుతున్నారు. 1990-91, 1991-92, 1992-93 నుండి, 1997-98, 1998-99 సంవత్సరానికి విద్యుత్ కనెక్షన్స్ ఎస్.సి. బి.సి కార్పోరేషన్స్‌కు, 50 వేల చొప్పున మంజూరు అయినాయి. ఆల్‌రెడీ వాటిని వేసి, వాటిని రెగ్యులరైజ్ చేసి యిప్పుడు వాటిని మేము యిచ్చామని అంటున్నారు. ఇది రైతాంగానికి ఎంతమోసం చేయడమో చూడండి. రైతాంగాన్ని మోసగిస్తున్నారు. ఈ విధానం వద్దు అని మనవి

1.40 మ. చేసుకొంటున్నాను. ఇప్పటికి సుమారుగా విద్యుత్ కనక్షన్స్ కోసం రాయలసీమ, తెలంగాణా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 28 లక్షల మంది ధరఖాస్తులు పెట్టుకొన్నారు. అందులో కనీసం 50 శాతం విద్యుత్ కనక్షన్లు ఇస్తామని చెప్పమనండి. ప్రజలు మీరు ఏదో చేస్తారని నమ్మకంతో మిమ్ములను అధికారంలోకి పంపించారు. మా మాటలు నమ్మలేదు, మీ మాటలు నమ్మరు మీరే చేయండి. విద్యుత్ ప్రాజెక్టుల గురించి మా నాయకుడు డా.వై.ఎస్. రాజశేఖరరెడ్డి స్పష్టం చేయడం జరిగింది. 4 1/2 సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో నమ్మకంతో, విశ్వాసంతో ఇచ్చినటువంటి ప్రయివేటు విద్యుత్ సంస్థలు ఒక్క మెగావాట్టు విద్యుత్-అయినా ఉత్పత్తి చేయగలిగాయా? అదనంగా విద్యుత్ అందించకపోగా శ్రీశైలం విద్యుత్ కేంద్రాన్ని నిర్లక్ష్యం చేయడం వలన, అధికారులయొక్క సోమరితనం వలన, సుమారుగా రూ.300 కోట్లు ఖర్చు పెట్టవలసివచ్చింది. ఎన్.టి.పి.సి.లో అధికారుల నిర్లక్ష్యంవల్ల కాలిపోవడం వలన రూ.50 కోట్లు ఖర్చు పెట్టవలసివచ్చింది. విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నటువంటి కేంద్రాలకు వాటి మరమత్తు కోసం అదనంగా రూ.350 కోట్లు

ఖర్చు పెట్టవలసి వచ్చింది. ముఖ్యంగా రైతుల ప్రయోజనాలు కాపాడడం కోసం దరఖాస్తులు చేసుకొన్న రైతులందరికి విద్యుత్ కనక్షన్సు ఇవ్వడం కోసం స్పష్టంగా గవర్నరుగారి ప్రసంగంలో ప్రభుత్వం యొక్క వైఖరి ఏమిటో చెప్పలేకపోయారు. How many applications are pending with you, How many applications are you going to accept, etc. స్పష్టం చేయవలసిన అవసరం వుంది. విద్యుత్ బకాయిల నిర్బంధ వసూళ్ళ నిలిపివేయాలి. కొత్తగా కనీసం 50 శాతం రైతాంగానికి విద్యుత్ కనక్షన్సు ఇవ్వవలసిన బాధ్యత ప్రభుత్వంపైన వుంది. పెద్దలు శ్రీ విజయరామారావుగారు ఆర్.అండ్ బి మంత్రి అయినారు. వారు అపూర్వమైనటువంటి అనుభవం ఉన్న అధికారి. ఈ మధ్య కాలంలో 2,500 కిలోమీటర్ల జిల్లా పరిషత్తు రోడ్లు ఆర్.అండ్.బి కి బదిలీ చేయడం జరిగింది. వాటి అన్నిటిని ఏవిధంగా పూర్తి చేయగల్గుతారు? ప్రపంచబ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంటు బ్యాంకు, నాబార్డు సంస్థల నుంచి వచ్చిన డబ్బులు రోడ్లకు ఏవిధంగా ప్రయారిటీ ఇస్తున్నారు? వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం వుంది. వెనుకబడిన ప్రాంతాలలో కమ్యూనికేషన్స్ డెవలప్‌చేయడానికి దళితులకు, గిరిజనులకు ట్రాన్సుపోర్టు సదుపాయం కల్పించడం కోసం వచ్చినటువంటి డబ్బును నిష్పక్షపాతంగా ప్రాంతీయతకు అతీతంగా ఈ రహదారుల నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టవలసిన అవసరం వుంది. ఇది బడ్జెటు స్పీచ్ కాదు గవర్నరుగారి ప్రసంగంలో వివరంగా మెన్షన్ చేయడానికి ఆస్కారం వుండదు. కరువు పరిస్థితి పైన తక్షణమే శాసన సభ ముగిసే లోపల ప్రభుత్వం ఒక పాలసీ ప్రకటించాలి. ప్రతిసారి కరువు గురించి వెనుకబడిన ప్రాంతాల గురించి మాట్లాడుతున్నాము, తెలంగానా, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలలోని నీటి సమస్య, త్రాగునీటి సమస్య, ఉపాధి సమస్యలపైన మాట్లాడుతునే ఉన్నాము. రాజకీయాలకు అతీతంగా, సిద్ధాంతాలకు అతీతంగా ప్రాంతాలకు అతీతంగా అవసరాలు ఎక్కడ ఉన్నాయో సమిష్టిగా చర్చించాలి, సమిష్టిగా నిర్ణయాలు తీసుకోవాలి, సమిష్టిగా ప్రజల కోసం మనం నిర్ణయాలు తీసుకొంటే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ తరుపున నేను ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ సెషన్‌లో కరువు పరిస్థితులపైన ఖచ్చితమైనటువంటి, నిర్దిష్టమైన స్పష్టమైన చర్చించాలి. తక్షణమే కరువు కోరల్లో చిక్కుకొన్న రైతాంగాన్ని ఆదుకోవడం కోసం నిర్దిష్టమైన శాస్త్రీయమైన ఆచరణ సాధ్యమైన ప్రణాళిక రూపొందించుకొని. కార్యక్రమాన్ని చేపట్టవలసిన బాధ్యత ప్రభుత్వం పైన వుందని చెప్పి మనవిచేస్తూ మీకు ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకొంటున్నాను.

శ్రీ పి. రఘునాథరెడ్డి .(నల్లమడ):- అధ్యక్షా, ఈ తెలుగుదేశం పార్టీ దాపరికంలేని స్వచ్ఛమైన, నీతివంతమైన, సమర్థవంతమైన పరిపాలన అందించాలని, ఆంధ్రప్రదేశ్ అక్షరక్రమంలోనే కాకుండా అభివృద్ధి పదంలో కూడా అగ్రస్థానంలో నిలపాలని, పీడిత, తాడిత ప్రజానీకానికి బడుగు బలహీనవర్గాల చీకటి జీవితాల్లో వెలుగు చూపించాలని, ఈ రాష్ట్రాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సాంస్కృత పరంగా ఆధునిక సాంకేతిక రంగంలో కూడా దక్షిణ కొరియా, మలేషియా, సింగపూర్ వంటి

దేశాలను మైమరిపించే రీతిలో తీర్చిదిద్దే ఉద్దేశ్యంతో లక్ష్యంతో, అభిప్రాయంతో ఈ ప్రభుత్వం అనన్యసామాన్యమైన, అసాధారణమైన అద్భుతమైన, అమోఘమైన, పధకాలను కార్యక్రమాలను రూపొందించింది. తెలుగు దేశం పార్టీ స్థాపించక ముందు ధనబలం, కులబలం, కండబలం ఉండి రాజకీయాల్లో కొనసాగేవాళ్ళు, అధికార పదవులు సాధించేవారు. తెలుగు దేశం పార్టీని స్థాపించిన తరువాతనే కుల, మత, వర్గ విచక్షణ లేకుండా ఎస్.సి.లు, ఎస్.టి.లు, బిసిలు, మహిళలు, మైనారిటీస్, ప్రతిఒక్కరు రాజకీయాల్లో కొనసాగుతున్నారు, పదవులు అనుభవిస్తున్నారు. అంటే బడుగు వర్గాలను రాజకీయాలలోకి ఆహ్వానించిన ఘనత, కీర్తి, ప్రతిష్ఠ ఒక్క తెలుగు దేశం పార్టీకే దక్కిందని సభాముఖంగా మనవిచేస్తున్నాను. ఒక విషయాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే రాజకీయాలలో కొత్త ఒరవడి సృష్టించబడిందేమో అనేటట్లు అన్ని విధాలుగా శ్రద్ధ తీసుకొందని మీకు మనవిచేస్తున్నాను. ఎన్నడూ లేని విధంగా ఈ ముఖ్యమంత్రిగారు జర్నలిస్టుకు, డ్వాక్రా మహిళకు, నోడల్ ఆఫీసర్లకు, మాజీ సి.బి.ఐ అధికారికి పార్టీ టికెట్లు ఇచ్చారు. రాజకీయాల్లో వర్గాలకు అతీతంగా రాజకీయాల్లో ఒక చైతన్యం తీసుకొని రావాలి. ఈ సమాజాన్ని సంస్కరించాలనే ఉద్దేశ్యంచేత ఈ ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు తీసుకొని ప్రపంచం అంతటా కీర్తించేటట్లు ప్రవర్తించిందని మీకు మనవిచేస్తున్నాను. అంతేకాకుండా రాజకీయాల్లో అవగాహన ప్రజల్లో చైతన్యం స్ఫూర్తిని తెచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికి వుందని చెప్పి మీకు మనవిచేస్తున్నాను. ఈ మధ్యనే ముఖ్యమంత్రిగారు ధర్మవరం పర్యటించినపుడు ఒక చిన్న బాలుడు చేతిలో మొక్కను పట్టుకొని నిలబడడం చూసి అతన్ని సమీపించి ఈ మొక్కను నేవు ఏమి చేస్తామని అంటే నాటుతాను అని చెప్పాడు. దాని వలన ఏమి లాభం అని ముఖ్యమంత్రిగారు అడిగితే వాతావరణ కాలుష్యం పోతుంది. వర్షాభావం పోతుంది కరువు నివారణ చేయువచ్చు అని ఆ పిల్లవాడు చెప్పాడు. అంటే ప్రజల హృదయాల్లో ప్రజా కార్యక్రమాలు ఏవిధంగా దూసుకుపోతున్నాయో మీకు ఒకసారి మనవిచేస్తున్నాను. Politicians think about the next election and the Statesmen think about the next generation. ముఖ్యమంత్రిగారు ఎప్పుడు కూడా నెక్స్ట్ ఎలక్షన్సు గురించి ఆలోచించలేదు. 2020 సంవత్సరానికి ఎట్లా ఆంధ్రప్రదేశ్‌ను సకల సిరిసంపదలతో, శాంతిసౌభాగ్యాలతో తీర్చిదిద్దేలా స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలని ఉద్దేశ్యంచేత ఒక దీర్ఘకాలిక ప్రక్రియ ఏర్పాటు చేశారు తప్ప తాత్కాలిక ప్రయోజనాలకు ఏమాత్రం ముఖ్యమంత్రిగారు చూడలేదని మనం చెప్పవచ్చు. ఈ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజలు, ప్రతిపక్షాలు, పత్రికలు స్వంతం వేనోళ్ళ కొనియాడబడుతూ పవిత్రమైన కార్యక్రమంగా పరిగణించే ఈ జన్మభూమి కార్యక్రమాన్ని మనం భావించవచ్చు. ఈ జన్మభూమి కార్యక్రమంలో ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒకచోట కూర్చొని ఊరికి రోడ్డు కావాలన్నా, డ్రైనేజీ కావాలన్నా, స్కూలు బిల్డింగ్ కావాలన్నా పరిష్కరించగల్గుతున్నారు అంటే ఇంత కంటే కావలసింది ఏమిటని ప్రజలు ఆలోచించారని ఈ సభాముఖంగా తెలియచేస్తున్నాను. ఇంతకు ముందు ఎంఎల్ఏ కాని మంత్రులు కాని

ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదు. కాని సాక్షాత్ 8 కోట్ల ప్రజలకు అధిపతి అయిన ముఖ్యమంత్రి గారు ఏదో ఒక కుక్ గ్రామానికి పోయి ఒక చెట్టు క్రింద కూర్చొని ఒక పిల్లవాడిని పిలిచి మీ ఊరిలో స్కూలు ఉందా? ఊరికి రోడ్డు ఉందా? బోరింగ్ ఉందా? మీ విద్యా కమిటీ చైర్మన్ ఎవరు? అని అడుగుతున్నారు. ఇంతకంటే చైతన్యాన్ని, స్ఫూర్తిని, అవగాహనని ఏ ప్రభుత్వం వారు ఇస్తారని నేను సభా ముఖంగా మనవిచేస్తున్నాను. కొన్ని విషయాల్లో అత్యధిక శ్రద్ధ చూపించడం అతిశయోక్తి కాదు. గత 40 సంవత్సరాలలో ఈ సమాజాన్ని పరిపాలించిన ప్రభుత్వంపై పేద ప్రజల సంక్షేమాన్ని కాని సౌభాగ్యాన్ని కాని ఏమాత్రం ఆలోచించకుండా అస్తవ్యస్థంగా పరిపాలించడంవల్ల ఈ సమాజం కుళ్లి, కృషించి, నశించి అవసాన దశకు చేరింది. పేదలు మరింత పేదవారు అయినారు, ధనవంతులు మరింత ధనికులైనారు. దారిద్ర్యరేఖకు దిగువన ఇప్పటికి 50 సంవత్సరాలు గడిచినా కనీస అవసరాలు నోచుకోలేని దుర్భరమైన పరిస్థితులు ఈ భారత దేశంలో ఉన్నాయి అంటే వారు చేసిన అవకతవకలేనని ఈ సభా ముఖ్యంగా మనవిచేస్తున్నాను. ఈ ప్రభుత్వం ముఖ్యంగా మహిళలకు కనీవినీ ఎరుగని రీతిలో జీవితాంతం గుర్తు పెట్టుకొనే రీతిలో ప్రవర్తించిందని సభాముఖంగా మనవిచేస్తున్నాను. స్త్రీలకు స్థానిక సంస్థలల్లో, ప్రభుత్వరంగ సంస్థల్లో 33 1/3 శాతం రిజర్వేషన్ పాటించడమే కాకుండా వ్యవసాయ భూములు, ఇళ్ల పట్టాలు, చౌకధర డిపోల్లో వాళ్లకి ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా ఇంతకు ముందు ప్రభుత్వాలు 6 లక్షల డ్వాక్రా గ్రూపులు మాత్రమే ఏర్పాటు చేస్తే ఎవరూ వూహించని విధంగా రెండు లక్షల డ్వాక్రా గ్రూపులు ఏర్పాటుచేసినది దీపం పథకం, సుఖీభవ పథకం వంటి అనేక పథకాలు మహిళలకు కల్పతరువు, ఇల్లాలు బాగుంటే కుటుంబం బాగుంటుదని సూక్తి ఉన్నది.

(గౌ. సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

1.50 మ. "ఇల్లాలు బాగుంటే కుటుంబం బాగుంటుంది, కుటుంబం బాగుంటే దేశం బాగుంటుంది", "ఏదేశంలో స్త్రీ గౌరవింపబడుతుందో, ఏ దేశంలో స్త్రీ పూజింపబడుతుందో ఆ దేశం సర్వసౌఖ్యాలతో, సకల సంపదలతో వర్థిల్లుతుంది" అనే సూక్తుల ఆధారంగా మహిళల అభ్యుదయం కొరకు ఎన్నో కార్యక్రమాలు ఈ ప్రభుత్వం చేపట్టింది. మొట్టమొదటిసారిగా అనేకమంది మహిళలకు శాసనసభ్యులురాల్లు కావటానికి అవకాశం ఇవ్వటం, గెలిచినవారిలో అనేకమందికి మంత్రిపదవులు ఇవ్వటం మాత్రమే కాకుండా ప్రప్రథమంగా శాసనసభ స్పీకర్ పదవి ఒక మహిళకు ఇచ్చిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుంది. మహిళాభ్యుదయానికి ఈ ప్రభుత్వం చేసినట్లు ఏ ప్రభుత్వం చేయలేదని తెలియచేస్తున్నాను. మైనారిటీలకు కూడా ఈ ప్రభుత్వం చేసిన సహాయం ఏ ప్రభుత్వమూ చేయలేదు. ఇళ్ల స్థలాల్లో 10 శాతం స్థలాలు వారికి కేటాయించటం అపురూపం, గతంలో మసీదులకు కనీసం ఎప్పుడైనా సున్నమైనా వేపించిన దాఖలాలు లేవు. అయితే ఆరువేల మసీదులకు మరమ్మత్తులు చేపించిన ఘనత, కీర్తి,

ప్రతిష్ఠ ఒక్క తెలుగుదేశం ప్రభుత్వానికే దక్కుతుంది. 301 షాదీఖానాలు కట్టించటం జరిగింది. 12 జిల్లాల్లో ఉర్దూను ద్వితీయ అధికార భాషగా చేశారంటే ఈ మైనారిటీ సోదరుల పట్ల ఈ తెలుగుదేశం పార్టీకి ఎంత ప్రేమ, ఎంత ఆప్యాయత, ఎంత గౌరవం ఉందో ఒక్కసారి పరిశీలించవలసినదిగా కోరుతున్నాను. మహిళలకు, మైనారిటీలకు ఈ ప్రభుత్వం చేసిన సహాయం మరే ప్రభుత్వం చేయలేదంటే అతిశయోక్తికాదు. ఈ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను తారాస్థాయిలో చేపడుతోందనటానికి ఉదాహరణేమంటే మలేషియా దేశపు ప్రధాని పుట్టపర్తిని దర్శించటానికి ఆంధ్రప్రదేశ్ వస్తున్నప్పుడు వారి మిత్రుడొకరు అమెరికా నుండి వారికి ఒక లెటర్ వ్రాశారు. ఎటూ పుట్టపర్తి వెళుతున్నారు కాబట్టి, అంటే ఆంధ్రప్రదేశ్ వెళుతున్నారు కాబట్టి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పంథాన నడిపిస్తున్న చంద్రబాబునాయుడుగారిని తప్పక కలవమని ఆ లెటర్ సారాంశం. ముఖ్యమంత్రి గారు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ఎక్కడా కూడా ఏ ముఖ్యమంత్రి కూడా చేపట్టని కార్యక్రమాలు ఇక్కడ చేస్తున్నారు. ఈ ప్రభుత్వం నిజాయితీతో, చిత్తశుద్ధితో, ఎటువంటి అవినీతి ఆరోపణలూ లేకుండ అన్ని బలహీన వర్గాలకు, ముఖ్యంగా ఎస్.సి., బి.సి. ఎస్.టి. లకు చేస్తున్న సేవ మరపురానిది, మరవలేనిది, అపూర్వమైనది. బి.సి.లు సుమారు 20 లక్షలమంది ఉన్నారని ఒక అంచనా, గీత కార్మికులు, చేనేత కార్మికులు, మత్స్య కార్మికులు, వడ్రంగి, వడ్డెర, నాయీ బ్రాహ్మణ, రజకులు మొదలగు 20 లక్షల మంది బి.సి. కుటుంబాలకు చెందినవారికి పనిముట్లు అందింపచేసే "ఆదరణ" అనే అపూర్వ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానిదే. సుమారు 2.5 లక్షల మంది జనాభా కలిగిన ఎస్.టి.లకు సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో "చైతన్య" అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. సమాజంలో నిర్లక్ష్యం చేయబడిన ఎస్.సి.లను అభివృద్ధి చేయాలనే తలంపుతో ప్రవేశపెట్టబడిన కార్యక్రమమే "ముందడుగు" మైనారిటీల కొరకు "రోష్ని" అనే కార్యక్రమం ప్రవేశపెట్టబడింది. ఈ విధంగా ఎన్నెన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇండ్ల నిర్మాణం విషయానికొస్తే యావత్ భారత దేశంలో 60 లక్షల ఇండ్లు కట్టించటం జరిగితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 30 లక్షల ఇండ్ల దాకా ఇవ్వటం జరిగింది. దీనినిబట్టి ఈ ప్రభుత్వానికి పేదప్రజల సంక్షేమం పట్ల, సౌభాగ్యంపట్ల ఎంత ఆదరణ ఉందో గమనించాలి. సంవత్సరానికి 7 లక్షల ఇండ్లను ఇస్తూ త్వరలో మొత్తం 30 లక్షల ఇండ్లు భర్తీచేయాలని ఈ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. భారతదేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఇన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఉన్నాయేమో చూడండి, గౌరవనీయులైన శాసనసభ్యులందరూ చూసి చెప్పండి. ఇన్ని పథకాలు ఏ ప్రభుత్వమూ అమలు చేయటం లేదు. పార్టీలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా, అన్నింటికీ అతీతంగా ప్రతిఒక్కరూ పనిచేయాలి. ముఖ్యమంత్రిగారు ఒకమాట చెప్పారు. ఇక ఎలక్షన్స్ గురించిగానీ, పాలిటిక్స్ గురించిగాని మాట్లాడనని ఇకముందు అభివృద్ధి గురించే మాట్లాడతానని చెప్పారు. వారు

అవిరళంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. గౌరవనీయులైన ప్రతిపక్ష నాయకులు రాజశేఖర్‌రెడ్డిగారు చేసిన ఒక సూచన చాలా గొప్పది. ఫ్యాక్షన్, హింస లేకుండా 20వ శతాబ్దంలోకి అడుగుపెడదామన్నారు. మా ఉద్దేశ్యం కూడా అదే. అయితే వాళ్ళ వారే ఫ్యాక్షన్‌లో ఉన్నారు. ఫ్యాక్షన్‌ను నిర్మూలించటానికి మేము కూడా సహకరిస్తాము. ఏ రాజకీయ నాయకుడూ చెప్పని గొప్ప మాట మా రాజకీయ నాయకుడు చెప్పారు. పొరపాటున ఏ అసమర్థునికో, చెడు ప్రవర్తన కలిగిన వారికో టికెట్ ఇచ్చినట్లయితే వారిని మీరు ఓడించండని వారితాత్మకంగా ఒక సభలో వారు చెప్పారంటే దానికంటే ఇంకేమి కావాలి; ఫ్యాక్షన్ అనేది ఎక్కడా కూడా ఉండకూడదు. 20వ శతాబ్దంలో హింస, ఫ్యాక్షన్ మొదలైన వాటి ఆమాకీనే ఉండకూడదు. మీరు ఒక కోటి ఉద్యోగాలు ఇస్తామని చెప్పారు. అయితే ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో నాకు తెలియదు, అయితే మేము మాత్రం ఒక లక్షా యాభైవేలమంది టీచర్స్‌ను భర్తీచేశాము. ఇంత భారీసంఖ్యలో ఎవరూ రిక్రూట్‌మెంట్స్ చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వం ఏది చెబుతుందో అది చేస్తుంది. కాబట్టి ప్రజలు మాకు పట్టం కట్టారు. నెగెటివ్ ఓటింగ్ జరగలేదంటే కారణం ప్రజల హృదయాన్ని దోచుకోగలిగినందుకే, పేద ప్రజల సంక్షేమానికి, సౌభాగ్యానికి మేము కట్టుబడి ఉన్నాము, వేరే ఆలోచనే మాకు లేదు. మాప్రభుత్వం అన్ని రంగాలలో అభివృద్ధి సాధిస్తుందని మరొక్కసారి గుర్తుచేస్తున్నాను. మీరు ఇచ్చిన సూచనలు నిర్మాణాత్మకంగా ఉంటే పరిశీలించి తప్పకుండా వాటిని ప్రభుత్వం అమలుచేస్తుందని తెలియచేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియచేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

Sri P. Ashoka Gajapathi Raju:- Madam Speaker, I wanted to make a submission to this House. We have to encourage maiden speech of every Member. But unfortunately, we are seeing something different today. I wanted to bring the same to your notice and through you to the House.

మేడమ్ స్పీకర్:- గౌరవసభ్యులందరికీ ఒక విషయం తెలియచేస్తున్నాను. క్రొత్తగా వచ్చిన శాసనసభ్యులు మొదటిసారిగా మాట్లాడేప్పుడు సీనియర్ సభ్యులు కామెంట్ చేయకుండా వారిని ఎంకరేజ్ చేయాలని నేను అందరికీ తెలియచేస్తున్నాను.

Now, the House is adjourned to meet again at 9-00 A.M. on 15th November, 1999.

(The House then adjourned at 1-57 P.M. to meet again at 9-00 A.M. on Monday, 15th November, 1999.)

సభాపతి మహాశయా!
ఆంధ్రప్రదేశ్ శాసనసభ గౌరవ సభ్యులారా.

విన్నూత ఆకాంక్షలను చిగురింపజేసి సుఖశాంతులతో మన జీవితాలలో కొత్త వెలుగులు నింపుతుందని ఆపేక్షిస్తున్న నూతన సహస్రాబ్ది ఆరంభానికి ముందుగా కొత్తగా ఎన్నికైన ఈ శాసనసభ తొలి సమావేశాన్నుద్దేశించి ప్రసంగించడం నాకెంతో ఆనందంగా వుంది. మానవాళి అభ్యున్నతికి విజ్ఞానం, సమాచారం కీలకమని భావించే నూతన ప్రపంచంలోకి మనం అడుగిడుతున్నాం. విజ్ఞాన సమాజం విసిరే కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి మనం సమాయత్తం కావాలి. సమాచారం, విజ్ఞానం, మేధాసంపత్తి పునాదులుగా మన రాష్ట్ర మహోన్నత సౌధాన్ని నిర్మించాలి.

వచ్చే సంవత్సరానికి మరొక విశిష్టత వుంది. రాబోయే సంవత్సరం భారత గణతంత్ర స్వర్ణోత్సవ సంవత్సరం. ఈ చారిత్రకమైన కీలక తరుణంలో మన ప్రజలు లౌకిక విధానం, నిజాయితీ, సాంఘిక న్యాయానికి సంబంధించిన సూత్రాలపై తమకుగల దృఢమైన నిబద్ధతను కనబరిచారు. పనిచేస్తే ఫలితముంటుందని రాష్ట్ర ప్రజలు చాటి చెప్పారు. ముందుచూపు కలిగివుండి ప్రజల బాగోగులను పట్టించుకుంటూ, అభ్యుదయ లక్ష్యం దిశగా కార్యోన్ముఖులను చేసే ప్రభుత్వాన్నే సముచితంగా గౌరవిస్తూ తమ తీర్పును ఇచ్చారు. ఇతరులకు ఆదర్శప్రాయమని సర్వత్రా ప్రశంసలందుకుంటున్న ప్రభుత్వంపై మనరాష్ట్ర ప్రజలు తమ నమ్మకాన్ని ప్రకటించారు. మన రాష్ట్ర నాయకత్వం జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలను పొందుతున్నది. ఈ మధ్యకాలంలో జరిగిన అనుభవాల ఆధారంగా రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుకున్న తమ ఆశలకు మన ప్రజలు చేసిన రూపకల్పన సృజనాత్మకమైనది.

ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు, మనకు మున్ముందు ఎదురయ్యే ఎన్నో సవాళ్లను మనకు తెలియజేస్తూ, మన ఓటర్ల వివేకాన్ని ప్రతిబింబిస్తున్నది. ధైర్యంతోను, దృఢ సంకల్పంతోను, వినమ్రతతోను పనిచేస్తే ఫలితముంటుందని రాష్ట్ర ప్రజలు చాటిచెప్పారు. ముందు చూపు కలిగివుండి ప్రజల బాగోగులను చూసి, అభ్యుదయ లక్ష్యం దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేసే ప్రభుత్వాన్నే తగురీతిగా గౌరవిస్తామని ప్రజలు తమ తీర్పును ఇచ్చారు. ఇతరులకు ఆదర్శప్రాయం అని కొనియాడబడుతున్న ప్రభుత్వంపై మన రాష్ట్ర ప్రజలు తమ నమ్మకాన్ని ప్రదర్శించారు. మన రాష్ట్ర నాయకత్వం జాతీయంగా, అంతర్జాతీయంగా ప్రశంసలను పొందుతున్నది. ఈ మధ్యకాలంలో జరిగిన అనుభవాల ఆధారంగా మన రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టుకున్న తమ ఆశలకు చేసిన రూపకల్పన ఎంతో సృజనాత్మకమయినది.

ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు, మనకు మున్ముందు ఎదురయ్యే ఎన్నో సవాళ్లను మనకు తెలియజేస్తూ, మన ఓటర్ల వివేకాన్ని ప్రతిబింబింపజేస్తున్నది. ధైర్యంతోను, దృఢసంకల్పంతోను, అలాగే వినమ్రతతోను అట్టి సవాళ్లను సంపూర్ణంగా ఎదుర్కోవచ్చును. ఈ బాధ్యతతో, వినమ్రతతో నా ప్రభుత్వం రాష్ట్రానికి సేవ చేసేందుకు

సమాయత్తమైంది. గత నాలుగు సంవత్సరాలుగా వినూత్నత, సోషల్ ఇంజనీరింగ్ వంటి రంగాలలో పొందిన అనుభవాల ఆధారంగా ఇప్పుడు రాష్ట్రం మరింతగా ఉన్నత అభివృద్ధిని సాధించే ధ్యేయంతో నియుక్తమైఉన్నది.

ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ, ప్రతి సంఘం తమ విశ్వాసాన్ని, ఆకాంక్షను, స్వప్నాలను కలిగి ఉంటాయి. అనుభవాలు వీటిని విస్తృతపరచి, సుసంపన్నం చేస్తాయి. కాల్పనికి నాయకత్వం ఉమ్మడి విశ్వాసానికి ఒక రూపం ఇచ్చి, స్పష్టతను ఏర్పరుస్తుంది. అంతేకాకుండా, భాగస్వామిక వాస్తవికత కోసం కలసికట్టుగా కృషి చేసేందుకుగాను ప్రజలను కార్యోన్ముఖులుగా చేయడం కూడా జరుగుతుంది. ఒకసారి చైతన్యాన్ని తీసుకొనివస్తే, "అసాధ్యం" అనేమాట అదృశ్యమైపోతుంది. మానవుల ప్రతిభ అపరిమితంగా ఉంటుందని మన ప్రాచీన ఋషులు పేర్కొన్నారు. అన్ని యుగాలలోని గొప్ప సంస్కరణకర్తలు, అతి క్లిష్టమైన పరిస్థితులలో కూడా ఏయే అంశాలను సాధించవచ్చునో తెలియజేశారు. ప్రవాస భారతీయులు, మానవ కృషికి సంబంధించిన ప్రతి రంగంలోను అత్యంత ప్రతిభను సాధించారు. మనకు అవసరమైన దేమిటంటె, ప్రోత్సాహంతో కూడిన ముందుచూపు, గమ్యం చేరుకునేందుకు అంకిత భావం. ఈ దిశలో స్పష్టంగా ప్రయత్నించడమన్నది మన రాష్ట్రంలో ప్రారంభమైంది.

ఈ సంవత్సరం ప్రారంభంలో శాసన సభ్యులను ఉద్దేశించి ప్రసంగించేటప్పుడు, విజన్-2020 డాక్యుమెంటులోని సిద్ధాంతతాల గురించి రాష్ట్రంలోని ప్రతి వ్యక్తి చదవాలని, అందులో పేర్కొన్న ముందు చూపు విషయాలను, మార్గాలను అభినందించాలని, అందులో వుండె భావాలను అవగాహన చేసుకోవాలని కోరాను. గడచిన తొమ్మిది మాసాలలో, విజన్ లక్ష్యాలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి సంబంధించి నా ప్రభుత్వం యొక్క సామర్థ్యంపైన, బాధ్యతపైన మన ప్రజలు తమ విశ్వాసాన్ని పునరుద్ఘాటించారు. ప్రతి ఒక్కరూ అత్యంత మంచి భవిష్యత్తును ఊహించుకోవడాన్ని ప్రారంభించారు. సానుకూల సహనం ప్రదర్శిస్తే, సానుకూలమైన ఫలితాలు వనకూరుతాయి. కష్టపడి పని చేయడంతో పాటు ఉత్తమ భావనలు కలిగివున్నట్లయితే అది సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుంది.

ఎన్నికలకు ముందు ప్రజలకు చేసిన వాగ్దానాలు విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న లక్ష్యాల ప్రాతిపదికగా ఉన్నాయి. అంతిమంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఏడాదికి 9-10 శాతం వరకు పెరగవలసి వుంటుఉదని, జనాభా పెరుగుదలను ఏడాదికి 0.83 శాతం చొప్పున అరికట్టాల్సి వుంటుందని, వ్యవసాయానికి సంబంధించి ఏడాదికి సగటున 6 శాతం రేటు చొప్పున పెరగవలసి వుంటుందని ఉద్దేశించడమయింది. పరిశ్రమలకు సంబంధించి 11 శాతం వార్షిక పెరుగుదల రేటును సాధించవలసి వుటుంది. సర్వీసుల రంగానికి సంబంధించి ఏడాదికి 12 శాతం చొప్పున పెరుగుదలను సాధించవలసి వుంటుంది. ప్రజలకు చేసిన వాగ్దానాలను వచ్చే అయిదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం నిర్దిష్టమైన దిశలో, వాస్తవికంగా నెరవేర్చవలసి వుంది. నా ప్రభుత్వ అభివృద్ధి సిద్ధాంతం, ముందు చూపుతో కూడిన విజన్ ప్రాతిపదికగా ఉంది. ఈ కారణంగా,

రాష్ట్ర సాంఘిక, ఆర్థిక పురోభివృద్ధిని మన రాష్ట్రప్రజలు తమ నాయకత్వం, తమ తీర్మానం పట్ల అపారమైన విశ్వాసం వుంచి, తమ పరిపక్వతను చాటుకున్నారు.

పదే పదే స్పష్టంగా వివరిస్తున్నట్లుగా మానవ వనరుల అభివృద్ధి, సహజ వనరుల సక్రమ నిర్వహణ, పునరుద్ధరణ, ఉపాధికల్పనను అభివృద్ధిపరచే మార్గాల అన్వేషణ అనే అంశాలు ప్రజల పూర్తి భాగస్వామ్యంతో మన అభివృద్ధి విధానానికి మూడు విధాలైన సంయోగశక్తిగా రూపొందగలవు. గ్లోబలైజేషను ప్రాబల్యాలు, ఇన్‌ఫర్మేషను, కమ్యూనికేషను టెక్నాలజీ ఆవిర్భావం అనేవి అభివృద్ధికి సంబంధించిన పూర్వాపరాలు మరియు కూర్పును పూర్తిగా మార్చివేశాయి. స్వచ్ఛమైన సహేతుకమైన భావనతో మన ప్రజలు సంక్షేమానికి ఆదర్శప్రాయంగా అనువైనట్టి ఉత్తమ పద్ధతి విధానాలను మనం అంగీకరించాలి. మన సహజ వనరులను సమర్థనీయంగా ఉపయోగించుకునేట్లు చూడాలి. ఒక్కనీటి బొట్టును కూడా వృధా చేయకూడదు. ఏ భూభాగాన్ని కూడా బీడుభూమిగా ఉంచరాదు. అత్యంత సముచితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకున్నప్పుడు, పర్యావరణ అభివృద్ధి విషయంలో ప్రజలకు భాగస్వామ్యాన్ని కల్పించినప్పుడు సహజవనరులను అత్యంత సమర్థవంతంగా ఉపయోగించుకోవడానికి వీలవుతుంది. ఇదే సమయంలో, మన సమాజంలో అలక్ష్యానికి గురైన వర్గాలకు సంబంధించి ప్రాథమిక విద్యను, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను అందుబాటులోకి తీసుకువచ్చి, ప్రత్యేకంగా సానుకూల చర్యలను తీసుకున్నట్లయితే, మానవాభివృద్ధి సుసాధ్యమవుతుంది. గ్రామీణాభి వృద్ధి చర్యలు, పేదరిక నిర్మూలన కార్యక్రమాలు, స్వయం సహాయక గ్రూపులు మున్నగు పథకాల వలన దారిద్ర్యరేఖకు దిగువనవున్న ప్రజలకు ఉపాధికల్పన అవకాశాలు మెరుగవుతాయి.

స్వేచ్ఛ, అభివృద్ధి అనే విషయాలు అంతర్గత సంబంధాలను కలిగివున్నాయి. ప్రతి మనిషికీ పేదరికం, ఆకలి నుండి విముక్తి పొందే హక్కు వుంది. అలాగే అజ్ఞానం, వ్యాధి, అవకాశాల కొరత నుండి కూడా విముక్తి పొందే హక్కు ఉన్నది. మన కృషిలోని అంతర్భాగం. కాబట్టి, పేదరిక నిర్మూలన, ఉపాధికల్పన, ప్రజలను బలోపేతం చేయడం, మానవవనరుల అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, అలాగే నేర్పుగల, మెరుగైన పరిపాలన ద్వారా సమతుల్యమైన రంగం వారీగా, ప్రాంతీయ వారీగా అభివృద్ధి నా ప్రభుత్వ మౌలిక లక్ష్యం. సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఒక స్పష్టమైన భవిష్య దర్శనం ద్వారా నిర్వహణను జరిపే అధికారంతో ఉత్కృష్ట విధానాల ద్వారా నిరంతరం ముందుకు సాగే ప్రభుత్వం ఇది.

స్థిరమైన అభివృద్ధి కోసం ప్రజల మౌలిక అవసరాలను నెరవేర్చవలసి వుంది. రాబోవు ఐదు సంవత్సరాలలో, 200 లేదా అంతకంటే ఎక్కువ జనాభా గల నివాసిక ప్రాంతాలు అన్నింటికి రక్షిత మంచినీటి సదుపాయాన్ని కల్పిస్తామని. వచ్చే మూడు సంవత్సరాలలో 25 లక్షల మంది అర్హతగల పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలను పంపిణీ

చేస్తామని, సంవత్సరానికి ఏడు లక్షల గృహాల చొప్పున బలహీన వర్గాల వారికి ముప్పది ఐదు లక్షల గృహాలను నిర్మిస్తామని, సంవత్సరానికి పది లక్షల వ్యక్తిగత సానిటరీ యూనిట్లను నిర్మిస్తామని, ప్రతి నివాసిక ప్రాంతం నుండి ఒక కిలోమీటరు పరిధిలో ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పుతామని, ప్రతి శాసనసభ నియోజకవర్గంలో ఒక నివాసిక పాఠశాలను ఏర్పాటు చేస్తామని, ముప్పయి లక్షల మంది పిల్లలకు అంగనవాడి సౌకర్యాన్ని లభింపజేస్తామని, ప్రతి నివాసిక ప్రాంతానికి పక్కా రోడ్డు వేయడం జరుగుతుందని, ఒక వెయ్యిమంది కంటే ఎక్కువ జనాభా గల అన్ని గ్రామాలకు బి.టి. రోడ్లు వేస్తామని వాగ్దానం చేయడం జరిగింది.

ఉపాధి కల్పన రంగంలో స్వయం సహాయం గ్రూపుల ద్వారా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రొసెసింగు, చిన్నతరహా పరిశ్రమలు, ముఖ్యంగా పర్యాటక రంగాలకు ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా భారీ ఎత్తున ఉద్యోగ అవకాశాలను ఏర్పాటు చేయడం జరుగుతుంది. దారిద్ర్య నిర్మూలన విషయంలో, ముందడుగు, చైతన్యం, ఆదరణ, రోషిణి, ఛేయూత వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు పరచడం ద్వారా ప్రస్తుతం దారిద్ర్యరేఖకు దిగువన వున్న నలభై లక్షల కుటుంబాలను అభివృద్ధి పరచడానికి దారిద్ర్య నిర్మూలన ప్రచారాన్ని ప్రారంభించడమవుతుంది.

మానవ వనరుల అభివృద్ధి విషయంలో జనాభా పెరుగుదల రేటును 0.83 శాతానికి వెంటనే తగ్గించాలని, అక్షరాస్యత రేటును 83 శాతానికి పెంచి రాష్ట్రాన్ని పరిజ్ఞాన సమాజంగా అభివృద్ధి పరచాలని, ఆరోగ్య విషయంలో నాణ్యతను మెరుగుపరచాలని, రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగింది.

రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికై అదనంగా 25 లక్షల ఎకరాలకు సాగునీటి సదుపాయం అందించగలదని ఆశించడమయింది. రైతుల స్థితిగతులను మెరుగుపరచే విషయానికి సంబంధించి క్షేత్ర ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను లభించేలా చూడడానికి రూ. 100 కోట్లతో మార్కెటు మధ్యవర్తిత్వ నిధిని ఏర్పాటు చేయడమవుతుంది. వచ్చే ఐదు సంవత్సరాలలో ప్రతి లక్షమంది జనాబాకు ఒక రైతు బజారు కాంప్లెక్సును నిర్మించడానికి అదనంగా, వ్యవసాయ పెరుగుదల రేటును 3.7 శాతం నుండి 6.1 శాతం వరకు పెంచాలని నా ప్రభుత్వం ఆశిస్తున్నది.

జనాభాలో సగంమందిగా వున్నటువంటి మహిళలు వెనుకబడి వున్నట్లయితే, ఏ సమాజం కూడా అభివృద్ధి చెందడానికి వీలుపడదు. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలించి చూస్తే, మహిళలు బలోపేతంగా వున్నచోట్ల అభివృద్ధి సమతుల్యంగా ఉండడాన్ని గమనించడమవు తున్నది. ఈ దిశలో సత్వరం చేపట్టవలసిన కొన్ని చర్యలలో, శాసనసభలో మహిళలకు 1/3వ వంతు రిజర్వేషను అమలుపరచడానికి ప్రభుత్వం కృషిచేయడం, మహిళా

బ్యాంకులను ఏర్పాటు చేయడం, స్వయం సహాయ గ్రూపులకు పెద్ద ఎత్తున సహకారాన్ని అందించడం, దీపం పథకం క్రింద గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని పేద కుటుంబాలకు ఎల్‌పిజి కనెక్షన్లను ఇవ్వడం, కుటుంబంలోని మహిళా పేరిట ప్రభుత్వ ప్రతిపాదిత ప్రయోజనాలను అందజేయడం, వోస్టు గ్రాడ్యుయేటు స్థాయివరకు విద్యార్థినులందరికీ ఉచిత విద్యా సదుపాయాన్ని కల్పించడం మున్నగునవి చేరి వున్నాయి.

పరిసరాలను అభివృద్ధి పరచే కాలుష్యాన్ని తగ్గించే, వాతావరణ సమతుల్యాన్ని పునరుద్ధరించే ఉద్దేశంతో ప్రతిసంవత్సరం 25 కోట్ల మొక్కలను నాటడమన్నది ప్రధాన వాగ్దానం. పరిశుభ్రత, పచ్చదనం ఉద్యమాన్ని రాష్ట్రమంతటా మరింత ముమ్మర పరచడమవుతున్నది దీనికి అదనంగా, రాజకీయ ప్రక్రియను స్వచ్ఛంగా చేయడానికి, మరింతగా వికేంద్రీకరించడానికి వివిధ సంస్కరణలను చేపట్టడం జరుగుతుంది.

ఈ సందర్భంగా చెప్పబడినవే ఇప్పటివరకు చేసిన ముఖ్యమైన వాగ్దానాలలో కొన్ని కాని, మనం ఇప్పుడే అడుగుపెట్టిన ఉత్తేజభరిత అభివృద్ధి దశ, ప్రభుత్వంలోపలనూ, ప్రభుత్వం వెలుపలనూ ప్రతి కార్యకలాపంలో ఇదే మాదిరి సత్ఫలితాల నిస్తుందని రాష్ట్రంలోని ప్రతి ఒక్కరూ విశ్వసించడానికి కారణముంటుందని నేను నమ్ముతున్నాను. రాష్ట్ర విధాన ఆదేశాత్మక సూత్రాలు, ప్రాథమిక హక్కులు ప్రజాశ్రేయస్సుకు ఆధార మవుతుండగా మనం రాజ్యాంగంలో విశదీకరించిన ప్రాథమిక విధులను మనకు మనమె నిరంతరం మననం చేసుకోవాలి. మనం, మన రాష్ట్రం కోసం ఏమేమి చేయాలని మనకు మనమె ప్రశ్నించుకోవాలి.

ప్రభుత్వంతో ప్రజల భాగస్వామ్యం అంటే వ్యాపారం అనేది ప్రజల జీవనోపాధులలో ఏవిధంగా మంచి మార్పును తీసుకు రాగలదో ఆసియాలోని కొన్నిదేశాల అద్భుతమయిన అభివృద్ధి విశదీకరించింది. మంచి పరిపాలన వలన వ్యూహాత్మకమయిన ముందుచూపు, అట్టడుగు స్థాయిలో కనీస వివేచనతో ఉత్తమ న్యాయ నిర్ణయం, పారదర్శకత, సరయిన బాధ్యత, ఏకాభిప్రాయసాధన, సమధర్మవికాసం, కార్యదక్షత, సమర్థనీయత, అంతిమంగా జవాబుదారీతనానికు వీలవుతుంది. మంచి పరిపాలన మూలంగా, ప్రజలు తమ మౌలిక విధులను నిర్వహిస్తారన్నది కూడా సూచిస్తుంది.

గత కొన్ని సంవత్సరాల కాలంగా, పాలనాపరమయిన అనేక సంస్కరణ చర్యలను ప్రారంభించడం జరిగింది. వాటి అమలుకు గట్టికృషి జరుగుతున్నది. శాసనాలను నియమ సంపుటిలను, సంహితలను, ఆదేశాలను తాజాపరిచేపనని అన్ని శాఖలలోను సకాలంలో చేపట్టడం జరిగింది. వాటిని సంగ్రహపరచడమవుతున్నది. ఇందువలన, ఆసక్తి మన్న ప్రజలు కూడా వాటిని పొందటానికి వీలవుతుంది. రాష్ట్ర హెచ్.ఆర్.డి. సంస్థ సహకారంతో జాబ్ చార్టులను తయారుచేయడం జరుగుతున్నది. ఇందువలన ఒక్కొక్క శాఖకు సముచితమయిన శిక్షణా నియమసంపుటిలను తయారుచేయడానికి వీలవుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫైళ్ల పరిష్కారాన్ని పర్యవేక్షించడమవుతున్నది. గ్రామీణ ప్రాంతాలను

స్థిరంగా అభివృద్ధి పరచడం కోసం, వివిధ శాఖీయ కార్యక్రమాలను సమన్వయం చేసేపనిని స్వామి రామానంద తీర్థ రూరల్ ఇన్స్టిట్యూట్‌కు అప్పగించడం జరిగింది.

పలుదరు కార్యవిధానాన్ని సంస్కరించడం జరిగింది. కొన్ని ఎంపికచేసిన శాఖలు, సంస్థలకు సంబంధించి సిటిజన్స్ చార్టర్‌ను రూపొందించడమయింది. సరికొత్త చర్యలను సూచించి, అమలు పరచడం కోసం శాఖీయ నిర్దిష్ట కమిటీలను నెలకొల్పడం జరిగింది. పరిపాలనా విషయాల్లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని నిరివిగా వినియోగించడమయింది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో మధ్యదళారీలను తొలగించడంతో పాటుగా స్టేక్ హోల్డర్లతో ప్రభుత్వ యంత్రాంగపు సన్నిహిత సమన్వయాన్ని ప్రోత్సహించడం జరిగింది. అనేక శాఖలు శాఖీయ నిర్దిష్ట బదిలీ విధానాన్ని, కౌన్సిలింగ్ పద్ధతిని రూపొందించాయి. రాబోయే సంవత్సరంలో మౌలిక సంస్థలను పటిష్టపరచేందుకోసం ఈ చర్యలన్నిటినీ తీవ్రతరం చేయడమవుతున్నది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం ప్రభుత్వం అత్యంత కార్యోన్ముఖంతోను, కలసికట్టుగాను పనిచేయవలసివుంది.

అట్టడుగు స్థాయిలో అభివృద్ధిని సాధించాలనే ఉద్దేశంతో ప్రజల ముంగిటకు పాలనను తీసుకురావడానికై జన్మభూమి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. స్వచ్ఛందత, భాగస్వామ్యత, పారదర్శకత, జవాబుదారీతనం సూత్రాలను దూరదృష్టితో అమలు పరచడం ద్వారా ఉత్తమమయిన రీతిలో అభివృద్ధిని ఏ విధంగా సాధించగలమో అనే విషయాన్ని గత పది విడతల జన్మభూమి కార్యక్రమాలు రుజువుచేశాయి. ప్రతివిడత కార్యక్రమంలోను లక్షలాదిమంది పాల్గొని, నూతనోత్తేజాన్ని, ఉత్సాహాన్ని చూపారు. జన్మభూమి కార్యక్రమం విజయవంతమై, స్వాభావిక వికాసంతో సహా సర్వతోముఖాభివృద్ధిని సాధించినందువలన, ప్రభుత్వం కూడ ఈ కార్యక్రమాన్ని ఇంకా ఏ విధంగా పటిష్ట పరచి విస్తరింపచేయాలనే అంశాల గురించి ఆలోచించింది. రాష్ట్రంలోని అత్యంత విస్తృతమయిన అంతర్గత రంగపు, భాగస్వామ్యపు అభివృద్ధి చర్యగా జన్మభూమి ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ ఆమోదయోగ్యమయిన కార్యక్రమంగా తయారయింది. సాంఘిక దురాచారాలను, పర్యావరణ క్షీణతను, ఆర్థిక విహీనతను రూపుమాపే కార్యక్రమంగా రూపొందించడమయింది. బాధ్యతాయుత ప్రభుత్వం అట్టడుగు ప్రజలకు చేరువై యావత్ రాష్ట్రమంతటా మార్పు తీసుకురాగలదని ఇది నిరూపించింది.

మన రాష్ట్రంలో స్వయం సహాయక గ్రూపుల విజయం గురించి ప్రత్యేకంగా వివరించాల్సిన అవసరం లేదు. ఏదైనా అభివృద్ధి కార్యక్రమాన్ని రూపొందించి, దానిని తీర్చిదిద్ది, అమలుపరచడంలో స్టేకు హోల్డర్ల భాగస్వామ్యం ఎంత కీలకమైనదో రుజువు అయింది. ప్రజలను స్వయం పోషకులుగా చేయడం, వ్యర్థ నష్టాలను బాగా తగ్గించడం, మధ్యదళారీలను తొలగించడం, వనరులను అత్యంతానుకూలంగా ఉపయోగించడం అనునవి స్వయంసహాయక గ్రూపుల తత్వంలోని ప్రధాన అంశాలుగా రూపొందాయి. సామాజిక భాగస్వామ్యం, శ్రామిక గౌరవాల ద్వారా వారిలో ఉమ్మడికృషి స్ఫూర్తిని కూడా స్వయంసహాయక గ్రూపులు ప్రోత్సహిస్తాయి. నీటి వినియోగదారుల

సంఘాలు, వాటర్ షెడ్ అభివృద్ధి కమిటీలు, వనసంరక్షణ సమితుల విషయంలో, ఆహార ఉత్పాదకతతోపాటు సహజవనరుల నిర్వహణ, పునరుత్పాదన అంశాలపై అవి సాధించిన విజయానికి అంతర్జాతీయ ఆమోదం లభించింది. ఈ అంశాలు మంచి ప్రభావాన్ని చూపడం జరిగింది.

ఉమ్మడి అటవీ నిర్వహణ కార్యక్రమాన్ని, ఆగ్నేయాసియాలో జరిగిన విజయానికి ఉదాహరణగా ప్రపంచబ్యాంకు పేర్కొనింది. ఈ కార్యక్రమం క్రింద, 16 లక్షల హెక్టార్లకు పైగా క్షీణించిన అడవులను ఆరువేల వనసంరక్షణ సమితులు పరిరక్షిస్తున్నాయి. ఇందులో 13 లక్షల మంది గ్రామీణ పేద ప్రజలు పాల్గొంటున్నారు. గత రెండు సంవత్సరాలలో, నీటి వినియోగదారుల సంఘాల కృషి మూలంగా, 9.5 లక్షల ఎకరాల భూమిని నమ్మకమయిన సాగునీటి క్రిందికి తీసుకురావడం జరిగింది.

మానవాభివృద్ధికి సంబంధించి ప్రాథమిక విద్యారంగంలో చోటుచేసుకున్న ప్రధాన ప్రగతి బాటల గురించి మీకు తెలిసిన విషయమే. విద్య అభ్యుదయాన్ని చేకూర్చడమే కాకుండా మానవ లాక్షణిక ప్రవర్తనను కూడా నిర్మాణం చేసి, సమాజం కోనియాడే విలువలను మీ విద్యార్థులలో ప్రేరేపిస్తుంది. అందరికి విద్యను అందుబాటులోకి తీసుకు రావలసి వుండగా, అదే సమయంలో విద్యా ప్రమాణాలను మెరుగు పరచవలసి వుంది. పాఠశాల కమిటీల ఏర్పాటు ఈ దశలో చేపట్టిన ప్రధాన చర్య సామర్థ్యం, కౌన్సిలింగు ఆధారంగా ఉపాధ్యాయుల బదిలీ. వారి నిర్వహణను మరింత బాగా మెరుగు పరచడానికి ఉద్దేశించడమయింది. ముమ్మర ఉపాధ్యాయుల శిక్షణకు అదనంగా, అవశ్యకతలను నెరవేర్చగలిగే, విలువలను పరిరక్షించే పాఠ్యప్రణాళిక, సకమ్రమైన విద్యా సంబంధం సాఫ్ట్‌వేర్ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

ఉన్నత విద్య, సాంకేతిక విద్యారంగంలో కూడా, గత కొద్ది సంవత్సరాలలో అత్యున్నత పురోగతిని సాధించడం జరిగింది. వైద్య విద్య, సాంకేతిక విద్య ప్రయివేటీకరణ, శిక్షణ పొందిన ప్రొఫెషనల్ సిబ్బంది సంఖ్య గణనీయంగా పెరగటానికి దోహదపడింది. అట్టి విద్యా సంస్థలలో బోధన, శిక్షణ నాణ్యతను మెరుగు పరచడానికి మనం మరింత శ్రద్ధ వహించవలసి వుంది. ఇటీవల కాలంలో ఉత్కృష్టత గల అనేక కేంద్రాలను నెలకొల్పిన నా ప్రభుత్వం విద్యా ప్రమాణాలను ఇంకా మెరుగు పరచడానికి నిర్విరామంగా కృషి చేస్తుంది. తద్వారా, మన బాలబాలికలు దేశంలోని ఉత్తమమైన, ప్రతిభావంతులైన వారిగా గుర్తింపబడుతున్నారు. రాష్ట్రం సత్వర విజ్ఞానవంతమైన సమాజంగా మార్పుచెందేందుకు అక్షరాస్యత స్థాయిలను సత్వరం మెరుగుపర్చడానికి, అన్ని స్థాయిలలో పాఠ్యాంశాలను సంస్కరించడానికి, విద్యా సంస్థలలో క్రమశిక్షణను పాటించడానికి, వృత్తి విద్య, నైపుణ్యాల పెంపుదల వల్ల ప్రాధాన్యమివ్వడానికి అన్ని అవకాశాలను నా ప్రభుత్వం అన్వేషిస్తున్నది.

విద్యారంగం మాదిరిగానే, అత్యున్నత జీవన ప్రమాణాలను సాధించడానికి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సేవలకు విస్తృత అవకాశాలను కల్పించడమనేది కీలకమైనది. అనేక పథకాల ద్వారా ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి వివిధ చర్యలను చేపట్టడమయింది. వైద్య దంత కళాశాలలతో పాటుగా, ఆరోగ్యసంస్థలు పురోభివృద్ధి చెందాయి. కేంద్రీకృత ఔషధాల సేకరణ, పంపిణీ విధానాన్ని ప్రారంభించడం మూలంగా, అవసరమున్న వారికి నాణ్యమైన ఔషధాల లభ్యత విస్తృతంగా పెరిగింది. రాష్ట్రంలోని అన్ని కేటగిరీల ఆరోగ్య సంస్థలకోసం నెలకొల్పబడిన సలహా సంఘాలు, ఆరోగ్యసేవల తీరుతెన్నులను మార్పు చేయడాన్ని ప్రారంభించాయి. ప్రజారోగ్య శిబిరాలు, పోలియో పై సల్స్ ముమ్మర ఉద్యమాలు గణనీయమైన విజయాలు సాధించాయి.

రాష్ట్రంలో జనాభా పెరుగుదల నియంత్రణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోంది. మన రాష్ట్రంలో జనాల రేటును గణనీయంగా తగ్గించడమయింది. మన రాష్ట్ర కేరళ, తమిళ నాడు రాష్ట్రాల తర్వాత దేశంలోని పెద్ద రాష్ట్రాలలో మూడవ స్థానంలో వుంది. గౌరవనీయ సభ్యులారా! విద్య, ఆరోగ్యం వంటి సాంఘిక రంగాలలో సముచితమైన బడ్జెటు కేటాయింపు, ఒక వివేకవంతమైన విధానాన్ని అనుసరించడం, తదనంతరం, నిరంతర పర్యవేక్షణ, ఏవిధంగా అద్భుత ఫలితాలను ఇవ్వడం ప్రారంభించిందో మీరు గమనిస్తారు! వాస్తవానికి, ఈ సంవత్సరపు మొత్తం ప్రణాళిక వినియోగంలో దాదాపు 31 శాతం సాంఘిక సేవా రంగానికి ప్రత్యేకించడమయిందని తెలుసు కోవడానికి మీరు సంతోషిస్తారు. రాబోయే సంవత్సరాలలో, సాంఘిక రంగంలో వ్యయాన్ని పెంచడం కొనసాగించడమవుతుంది.

అత్యున్నతమైన అంతర్జాతీయ పద్ధతుల ఆధారంగా సాంకేతిక విజ్ఞానం సమీకరణలు విజ్ఞాన సమాజంలోకి మన ప్రవేశానికి దోహదపడుతుండగా, మన హృదయం సమాజంలోని బడుగువర్గాల గురించి తప్పించాలి. వారి కోసం అనేక నిర్మాణాత్మక చర్యలను చేపట్టడం జరిగింది. -

సామాజిక రంగంలో ప్రజలు, ప్రత్యేకించి, షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలు, వెనుకబడిన తరగతులు, మైనార్టీలకు చెందిన వారి సాంఘిక, ఆర్థిక విద్యా ప్రమాణాలను మెరుగు పరచడానికి కృషిని ముమ్మరపరచడమయింది. 'ముందడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించడమనేది ఈ దిశలో ఒక మైలురాయి వంటిది. అంతే కాకుండా, పెక్కు ఆర్థిక ప్రయోజనాలను పెంచడం, కౌమార్య బాలికలకోసం దీర్ఘకాలిక బ్రిడ్జి కోర్సులు, నివాసిక పాఠశాలలో దీర్ఘకాలిక ఎంసెట్ కోచింగ్, ఇంగ్లీషు మీడియం కోచింగ్ ను క్రమబద్ధంగా పటిష్టపరచడం, సివిలు సర్వీసుల పరీక్షలు వ్రాసే వారికి కోచింగ్ ఇవ్వడం కోసం నాలుగు ఆంధ్రప్రదేశ్ స్టడీ సర్కిల్ బ్రాంచీలను ప్రారంభించడం, ప్రత్యేక కోర్టులను నెలకొల్పడం, డి.ఎస్.పి. స్థాయి పదవులను మంజూరుచేయడం, అంటరానితనాన్ని నిర్మూలించి, అత్యాచారాల నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలుపరచడం వంటి అనేక చర్యలను పాటించడం అనేవి, రాష్ట్రంలోని షెడ్యూలు కులాల స్థితిగతులను మెరుగు పరచాలనే

ప్రభుత్వ వ్యూహంలోని ప్రధాన కార్యక్రమాలలో కొన్ని అంశాలుగా వున్నాయి.

అదేవిధంగా, చైతన్యం కార్యక్రమం 2.5 లక్షల గిరిజన కుటుంబాలకు ప్రయోజనం కల్పించగలదు. వారికోసం గృహనిర్మాణ కార్యక్రమంలో కేటాయింపును రెండింతలు చేయడం, గిరిజనుల ముంగిట కనీస వైద్య సదుపాయాలు కల్పించడానికి 8,500 మంది గిరిజన మహిళలను నియమించడం, పాఠశాలలు లేని గిరిజన నివాస ప్రాంతాలన్నింటిలో పాఠశాలలను (మాబడి) ప్రారంభించడం మున్నగునవి గిరిజన సంక్షేమ రంగంలో చేపట్టిన కొన్ని ముఖ్యమైన చర్యలుగా ఉన్నాయి.

ఆదరణ కార్యక్రమం క్రింద సహాయం పొందేందుకు వెనుకబడిన తరగతులకు చెందిన ఎనిమిది లక్షల కంటె ఎక్కువమంది చేతిపని వారిని గుర్తించడం జరిగింది వారిలో నుండి ఆరులక్షల కంటె ఎక్కువ మందికి ఇప్పటికే మెరుగుపరచిన పనిముట్లు, పరికరాలు అందజేయడమైంది. ఈ సంవత్సరం ఈ కార్యక్రమానికి తగిన బడ్జెటు కేటాయింపుతో, ఆదరణ కార్యక్రమం ఇదివరలో లేనివిధంగా చేతిపనివారి జీవనశైలిని మెరుగుపరుస్తుందని ఆశించడమైంది. దీనితోపాటు, ప్రత్యేకంగా మత్స్యకారుల పిల్లల కోసం రెండు నివాసిక పాఠశాలలతో సహా కొత్తగా ఎనిమిది నివాసిక పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది. మత్స్యకారులకు 26,000కు మించి ఇళ్లను మంజూరు చేయడంతో పాటు అనేకమంది మత్స్యకారులను అభివృద్ధి పరచడానికి అనేక ఇతర చర్యలు తీసుకోవడం జరిగింది. అదే విధంగా, నేతకారుల ఆర్థికపరిస్థితిని మెరుగుపరిచేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతున్నది.

రోషిణి కార్యక్రమం క్రింద, అల్పసంఖ్యాక వర్గాల వారి శ్రేయస్సుకు ఒక సమగ్ర వ్యూహాన్ని అనుసరించడం జరుగుతున్నది. 301 ఉర్దూ ఘర్-షాదీఖానాలను మంజూరు చేయడం, హైదరాబాదులో హజ్‌హౌజ్ నిర్మించడం, 6000కు పైగా మసీదుల మరమ్మత్తు నిర్మాణం పనులకోసం ఆర్థిక సహాయాన్ని మంజూరుచేయడం అనేవి అల్పసంఖ్యాక వర్గాల వారి విషయంలో తీసుకొన్న అనేక ప్రోత్సాహక చర్యలు. ఉర్దూ భాషను పన్నెండు జిల్లాలలో రెండవ అధికారభాషగా ప్రకటించడమయింది. తత్కాల్ పథకం క్రింద ఆర్థిక సహాయం మంజూరు చేయడం మూలంగా వితంతువులు ప్రయోజనం పొందుతారు. అదేమాదిరిగా, అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సహాయ సంస్థ నిరుద్యోగ యువత కోసం నేడు ఋణాలను మంజూరు చేసింది.

బలహీన వర్గాల గృహనిర్మాణ కార్యక్రమం వల్ల, లక్షలాది ఇళ్లస్థలాలను సమకూర్చడం వల్ల సామాజికంగా వంచించబడిన, ఆర్థికంగా క్షీణించిన వర్గాల వారందరికి యదార్థంగా ప్రయోజనం చేకూరుతుంది. ఆపద్బంధు, సుఖీభవ వంటి కార్యక్రమాలు నిరుపేదల జీవితాలలో చెప్పుకోదగ్గ మేరకు మార్పులు తెచ్చాయి.

మహిళాభ్యుదయం, శిశుసంక్షేమ రంగాలలో గణనీయమైన పురోగతిని సాధించడమైంది. రాష్ట్రంలోని వివిధ అభివృద్ధి కార్యకలాపాలలో మహిళలు భాగస్వామ్యం ఇంతకు ముందెన్నడూ లేని స్థాయికి చేరుకుంది. రాష్ట్రమంతట మాతృసంఘాలు ఏర్పాటు, పొదుపు గ్రూపుల స్థిరీకరణ, బాలికల సంరక్షణ పథకం, తెలుగు బాలమహిళా ప్రగతి ప్రాంగణం మొదలైనవి గ్రామాలలో గణనీయమైన, విశిష్టమైన మార్పులు తెచ్చాయి.

రాష్ట్ర యువజన విధానపు ఉపపథకమైన ముఖ్యమంత్రి యువజన ఉపాధి కల్పన విధానం (సిఎంఇవై) విజయవంతమయిందనే విషయం మీ అందరికీ తెలుసు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇరవై వేలకుపైగా యువజన సంఘాలకు ఆర్థిక సహాయాన్ని విస్తరింపజేయడం జరుగుతుంది.

గౌరవనీయ సభ్యులారా, స్వయం సహాయక గ్రూపులు, సాంఘిక సంక్షేమ ద్వారా సహజ వనరుల నిర్వహణ రంగాల్లో నా ప్రభుత్వ వ్యూహం, పనితీరు గురించి నేను స్థూలంగా విశదీకరించాను. విజన్ దృక్పథం దృష్ట్యా ప్రజలకు చేసిన వాగ్దానాలు ఉత్తమ పరిపాలన, పరిపాలక సంస్కరణాలు, ప్రజల సహకారం ద్వారా వాటిని ఏవిధంగా అమలుపరచాల్సి ఉంటుందనే విషయం గురించి కూడా నేను ప్రస్తావించాను.

రాష్ట్రమంతటా క్రమబద్ధమైన అభివృద్ధి జరిగేలా చూడడానికి, పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరచడానికి, రాజకీయ పరిపాలక అధికారాన్ని వికేంద్రీకరించడానికి అనేక చర్యలు చేపట్టడమైంది. వాస్తవానికి, అధికారాన్ని, బాధ్యతను పూర్తిగా అప్పగించడం, వనరుల కేటాయింపును అధికం చేయడం, గ్రామాభివృద్ధికోసం మైక్రోప్లానులు తయారు చేయడం మున్నగు వాటిద్వారా స్థానిక సంస్థలను పటిష్టపరచాలన్నది నా ప్రభుత్వ ముఖ్య విధానం. స్వయం ఉపాధి, వేతనంతో కూడిన ఉపాధితోపాటు డిపిఎపి, మరుభూమి అభివృద్ధి కార్యక్రమం, వాటర్‌షెడ్ అభివృద్ధి కార్యక్రమం వంటి నిర్దిష్ట కార్యక్రమాలను, వృద్ధులు, గర్భిణీస్త్రీల వంటి దుర్బలులైన వారి ప్రయోజనం లక్ష్యంగా ఉన్న కార్యక్రమాలను ముమ్మరపరచడమైంది. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, గ్రామీణ రోడ్ల రంగాలలో ప్రభుత్వ పనితీరు, ఆయా రంగాలలో వాగ్దానం చేసిన లక్ష్యాలను నెరవేర్చగలమనే విశ్వాసాన్ని కలిగించింది.

మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రముఖపాత్ర వహిస్తున్నది. క్షేత్ర ఉత్పాదకతను పెంచడానికి, తమ జీవనోపాధికోసం వ్యవసాయంపై ఆధారపడిన వారు తమ ఆదాయాన్ని హెచ్చింపు చేసుకోవడానికి, రైతుల సంక్షేమాన్ని ధ్యేయంగా పెట్టుకోవడానికి అనేక చర్యలు తీసుకోవడమయింది. ఉత్తమ సాగునీటి అవసరాలు, వివిధ పర్యావరణ పునరుజ్జీవన కార్యక్రమాలతోపాటు సమగ్ర వ్యవసాయాభివృద్ధి కార్యాచరణ ప్రణాళికను నా ప్రభుత్వం సకాలంలో ప్రవేశపెట్టింది. తత్ఫలితంగా, 1998-99లో రాష్ట్రంలో 152 లక్షల మె. టన్నుల మేరకు అత్యధిక ఆహారధాన్యాల ఉత్పత్తికి దోహదపడింది. ఉద్యానవన కృషి, పట్టు పరిశ్రమ, పశుసంవర్ధన, చేపల పెంపకం రంగాలలోని ఇదే మాదిరి చర్యలు అధిక దిగుబడులను నివ్వడం ప్రారంభించాయి. రైతుబజార్ల ద్వారా రైతులు, వినియోగదార్ల

మధ్య కల్పించిన నేరు బేరసారాలు ఉత్పాదకులు, వినియోగదారులకు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయి. సహకార కిసాన్ క్రెడిట్ కార్డులు కం పాస్‌పుస్తకాలు ప్రవేశ పెట్టడం మూలంగా రైతులు సులువుగాను, సకాలంలోను పరపతిని పొందగలిగారు.

541 మండలాలలోని అనావృష్టి పరిస్థితిని, శ్రీకాకుళం జిల్లాలోని పెను తుఫానును కూడా నా ప్రభుత్వం సమర్థవంతంగా ఎదుర్కొన్నది. సహాయాన్ని సకాలంలో సమకూర్చింది. దీనికి అదనంగా, ఆచార్య ఎన్. జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం తయారుచేసిన కంటిజెన్సీ ప్లానును అమలు పరచేందుకు నిధులు విడుదల చేయడమయింది.

పరిశ్రమల రంగంలో విజన్ 2020 క్రింది లక్ష్యాలను స్పష్టంగా గుర్తించిన పురోగతిలో సాధించడానికి రాష్ట్రం కృషిసల్పుతుంది. పారిశ్రామిక వాడలలో నీటి సరఫరా విద్యుత్తు, రోడ్లు, డ్రైనేజీ మొదలైన క్లిష్టతరమైన మౌలిక సదుపాయాలను సమకూర్చడానికి ప్రభుత్వం ఇచ్చే 50 శాతం నిధి పారిశ్రామిక సంఘాలు ఇచ్చే మ్యాచింగు విరాళంతో క్లిష్టతరమైన మౌలిక సదుపాయాల సమతుల్యత నిధి అనే ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయడం రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతిని ప్రోత్సహిస్తుంది. బయోటెక్నాలజీ, వైద్య, ఆరోగ్య రక్షణ, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సంప్రదాయేతర ఇంధన వనరులు, వేస్ట్ మేనేజిమెంటు, అడ్వాన్స్‌మెటీరియల్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో పరిశోధన చేపట్టడానికి రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన నాలెడ్జిపార్కు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తుంది; రాష్ట్రంలోని చిన్నతరహా పరిశ్రమలకు సహాయపడడానికి ఏపి టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్‌ను భారతీయ పరిశ్రమల సమాఖ్య సహకారంతో ఏర్పాటు చేయడమయింది. వాస్తవానికి, రాబోయే కాలంలో, రాష్ట్ర ఆర్థిక పునరుజ్జీవనలో పరిశ్రమలు, సర్వీసు రంగాలు మహోన్నత పాత్ర వహిస్తాయి.

ప్రభుత్వం, మౌలిక సదుపాయాల రంగంలో స్వయంగా విశిష్ట కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ సంవత్సరపు ప్రణాళిక వినియోగంలో రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి వెన్నుముకగా వుండే సాగునీటి, ఇంధన రంగాలకు ఇరవై నాలుగు శాతం, పదహారు శాతం కేటాయించడం మూలంగా, ఆయారంగాలు అత్యధిక ప్రగతిని సాధిస్తాయి. వ్యవసాయ ఉత్పత్తికి, సాగునీరు అత్యంత క్లిష్టమైన అంశం. నీటి వనరులను అభివృద్ధి పరచడమే కాకుండా, అది పెద్ద ఎత్తున ఉపాధికల్పన సామర్థ్యాన్ని కలిగివుంది. సాగునీటి సౌకర్యాలను అభివృద్ధి పరచడం, వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ల ద్వారా వర్షపు నీటిని పరిరక్షించడం, చెట్లునాటడం వల్ల తగినంత ఆహారం లభ్యమవుతుంది. మన ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

లభ్యమయ్యే నీటి వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకునే ఉద్దేశంతో, రాష్ట్రంలో సాగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి నా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత నిస్తూనే వుంటుంది. కొనసాగుతున్న ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారాను, వాటి నిర్వహణలో రైతు సంఘాలకు ప్రమేయం కల్పించడం ద్వారాను గరిష్ఠంగా సాగునీటి

సదుపాయం సమకూర్చాలన్నదే వ్యూహంగా వుంది. సాధించిన విజయాలలో, భారీ ప్రాజెక్టుల రంగంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 1వ దశ (234 వ కిలోమీటరు దిగువన), ప్రియదర్శిని జూరాల, తెలుగు గంగ ప్రాజెక్టులు, మధ్య తరహా రంగంలో, 8 పథకాలు అంటే వట్టివాగు, 1వ దశ, సాత్నాల, కౌలసనాల, తలిపేరు, ఆండ్ర, ఎర్రకాల్వ, వెంగళ రాయసాగరం, వెలమల వాగు పథకాలను ప్రారంభించడం చేరివున్నాయి. శ్రీశైలం ఎడమగట్టు కాలువను త్వరితగతిన పూర్తి చేసినందుకు అత్యధిక శ్రద్ధ వహించడమయింది. తెలుగు గంగ, హంద్రీనీవా, గాలేరు నగరి, వెలిగొండ, నెట్టంపాడు, కల్వకుర్తి, భీమా, గురు రాఘవేంద్ర, నిజాంసాగరు ఎత్తిపోతల పథకం, రాజోలిబండ లింక్ కాలువ, తోటపల్లి రెగ్యులేటర్, తారకరామ తీర్థ సాగరు, పులిచింతల, వంశధార (2వ దశ) ప్రాజెక్టులను సత్వరమే ప్రారంభించాలని సంకల్పించిన ఇతర భారీ పథకాలు. ప్రస్తుత మున్న సాగునీటి వ్యవస్థలను పునరుద్ధరించడంలో రైతుల సంఘాలు సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకొని, నీటి వినియోగదార్ల సంఘాలను మరింత పటిష్టపరచి, అన్ని సాగునీటి వ్యవస్థల నిర్వహణ సంపూర్ణ బాధ్యతను వారికి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గోదావరి జలాలను వినియోగించుకునేందుకు ఒక ప్రత్యేక అధికార వర్గాన్ని ఏర్పాటు చేయడమయింది. ఈ అధికారవర్గం పనిచేయడం ఇదివరకే ప్రారంభించి, మొదటి దశలో 117 టి.ఎం.సి.ల నీటిని వినియోగించుకునేందుకు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసింది. గోదావరినదిపై ఇచ్చంపల్లి, పోలవరం, దుమ్ముగూడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు సంబంధించి సవివరమయిన ప్రాజెక్టు నివేదికలను ఖరారు చేయడమవుతున్నది. లెండి, పెనగంగ, జంఝావతి ప్రాజెక్టులకు సంబంధించి అంతర్‌రాష్ట్ర ఆమోదాన్ని పొందడానికే, అంతర్ రాష్ట్ర నది కృష్ణాజలాలపై రాష్ట్ర ప్రయోజనాలకు కాపాడడానికి కొంత కృషి జరుగుతున్నది.

విద్యుత్ రంగంలో, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల ప్రక్రియను ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషనును నియమించడం ద్వారా వర్తమాన సంవత్సరంలో కొనసాగించడ మయింది. కొత్తగా ఏర్పాటయిన ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ కార్పోరేషన్ (ఎ.పి. ట్రాన్స్‌కో), పవర్ జనరేషన్‌ను కార్పోరేషను (ఎ.పి.జెన్‌కో) పూర్తి స్థాయి యాజమాన్యంతో పనిచేయడం ప్రారంభించాయి. వివిధ ఆర్థిక సహాయ ఏజెన్సీలు మొత్తం సుమారు రూ. 1200 కోట్ల పైకాన్ని మంజూరు చేశాయి. ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను పటిష్టపరచే పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గత రబీలో వ్యవసాయ పంపుసెట్ల క్రింద సాగుచేసే విస్తీర్ణం రెండింతలు పెరిగినప్పటికీ పొలాల్లోని పంటలకు విద్యుత్ సరఫరాను కొనసాగించగలిగింది. ఈ సంవత్సరంలో యాభైవేల వ్యవసాయ పంపుసెట్లను విద్యుదీకరించడమవుతుంది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ క్రమంగా రెండవ సంవత్సరం కూడా లాభాన్ని ఆర్జించగలిగింది.

రోడ్లు, ఓడరేవుల రంగంలో, ప్రభుత్వం 10,266 కిలోమీటర్ల రోడ్ల కోర్ నెట్ వర్క్‌ను గుర్తించింది. వివిధ అంతర్జాతీయ, జాతీయ ఆర్థిక సహాయ ఏజన్సీల నుండి నిధులను పొందడం ద్వారా ఈ రోడ్లను అభివృద్ధి పరచాలని ప్రతిపాదించడమయింది. రాష్ట్రమంతటా రోడ్లను వెడల్పు చేసే కార్యక్రమానికి విస్తృతమైన ఆదరణ లభించింది. మూడు రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్పు చేయడం జరిగింది. రోడ్డు భద్రతకు, రోడ్లపై ప్రమాదాల రేట్లను తగ్గించేందుకు కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం, నిర్వహణ గ్రాంట్లలోని 5 శాతం మొత్తాన్ని కేటాయించడం జరుగుతున్నది. ఓడరేవుల అభివృద్ధికి సంబంధించినంత వరకు, ఓడరేవుల మౌలిక సదుపాయాలను ప్రయివేటీకరించడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా గుర్తింపు పొందింది. శంషాబాద్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయం కోసం మరింతగా ప్రయత్నించడం జరుగుతున్నది. ఇందుకోసం ప్రభుత్వం భూసేకరణను ఇదివరకే ప్రారంభించింది. విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలలో చేపట్టిన అభివృద్ధి పనులు నా ప్రభుత్వ కృషికి తార్కాణాలు. ప్రయివేటు రంగం క్రియాశీలక భాగస్వామ్యంతో ఇతర చిన్నచిన్న విమానాశ్రయాలను కూడా త్వరలో అభివృద్ధి పరచడమవుతుంది.

ఇన్‌ఫర్మేషన్, కమ్యూనికేషను టెక్నాలజీ రంగంలో ఈనాడు హైదరాబాదు దేశంలోనే ప్రధాన కేంద్రంగా వుంది. ఈ పరిశ్రమల రంగం ప్రతి సంవత్సరం 100 శాతం పైగా అభివృద్ధిని సాధిస్తున్నది. 1998-99 సంవత్సరంలో ఎగుమతుల రంగంలోనే దాదాపుగా రూ. 600 కోట్ల స్థాయికి చేరుకుంది. ఈ సంవత్సరం కూడ 100 శాతం పెరుగుదలను ఆశిస్తున్నాము. హైటెక్‌సిటీలో ఇప్పుడు ప్రపంచవ్యాప్త ఇన్ఫర్మేషను టెక్నాలజీ పరిశ్రమ రంగంలోని కొన్ని పెద్ద పెద్ద సంస్థలకు వసతిని సమకూర్చడమవుతున్నది. మొదటిదశ దాదాపుగా పూర్తికావస్తున్నది. 2వ దశ పనులు అతిత్వరలో ప్రారంభంకానున్నాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పరిశ్రమ కోసం ప్రోత్సాహక విధానాన్ని ప్రకటించడం జరిగింది. ఇన్ఫర్మేషను టెక్నాలజీలో ప్రపంచవ్యాప్త ఉపాధికల్పన అవకాశాలను అనుసరించి, ఈ రాష్ట్రంలో ఈ సేవలను చేపట్టాలని ఉద్దేశించడం జరిగింది. అవసరమయిన కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలతో సహా ఈ ప్రోత్సాహకాల వలన, విద్యావంతులయిన నిరుద్యోగ యువతకు, ముఖ్యంగా, మహిళలకు ఉపాధికల్పన అవకాశాలు చెప్పుకోదగ్గ మేరకు పెరుగుతాయి. హైదరాబాదులో ఐఐటి పరిశ్రమను నెలకొల్పడం వలన, ఇన్ఫర్మేషను టెక్నాలజీ పరిశ్రమ కోసం రాష్ట్రంలో అవసరమయిన మానవవనరులు అభివృద్ధి చెందుతాయి. సాధారణంగా, పరిపాలనా వ్యవహారాలను మెరుగుపరచడానికి, ముఖ్యంగా పౌరసేవల నాణ్యతను మెరుగు పరచడానికి ఇన్ఫర్మేషను టెక్నాలజీ వినియోగం కీలకమయిన అంశంగా ఉంది. ఈ దిశలో ఉద్దేశించినట్టి కొన్ని ప్రాజెక్టులలో "కార్డ్" (కంప్యూటర్ సహాయక రిజిస్ట్రేషన్ శాఖ పరిపాలన), ఎం.పి.హెచ్.ఎస్. (బహుళ ప్రయోజక కుటుంబ సర్వే ప్రాజెక్టు), "ట్విన్స్" (జంటనగరాల నెట్‌వర్క్ సర్వీసులు) ప్రాజెక్టు చేరివున్నాయి. ఆంధ్రప్రదేశ్ సచివాలయ క్యాంపస్ నెట్‌వర్క్ (ఎ.పి. క్యాన్), ఆంధ్రప్రదేశ్ స్టేట్ వైడ్ నెట్‌వర్క్ (ఎ.పి.స్వాన్), వీడియో కాన్ఫరెన్సింగ్ సదుపాయాలు సమకూర్చడం ప్రారంభమయ్యాయి.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగం అద్భుతమైన ప్రగతి, మన సమాజానికి వేర్వేరు మార్గాలలో ప్రయోజనం చేకూరుస్తున్నది. మొట్టమొదటిగా, ఇది అనేకమంది ప్రజలకు ఉపాధి వసతిని కల్పిస్తుంది. రెండవది , ప్రభుత్వపాలనను పారదర్శకంగా, సమర్థవంతంగా, పౌరజీవనం స్నేహవంతంగా చేస్తూ విప్లవాత్మక మార్పులు తెస్తుంది. మూడవది, ప్రజల జీవితాలను మార్చేందుకు వారికి వైజ్ఞానిక సమాజంలోకి ప్రవేశానికి వీలు కల్పించేందుకు, వారిని కొత్త విశ్వగ్రామంలో భాగస్వామ్య పౌరులుగా చేసేందుకు ఇది సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగిస్తుంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, దారిద్ర్యాన్ని నిర్మూలించేందుకు అత్యంత ప్రబలమైన సాధనంగా ఉపకరించడం అత్యంత ముఖ్యమైనది.

పర్యాటక రంగం ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నది. ప్రపంచ పర్యాటక సంస్థ పర్యాటక రంగంలో అత్యంత ప్రముఖుల సహకారంతో రాష్ట్రంలో సమగ్ర పర్యాటకాభివృద్ధి కోసం ఒక బృహత్ ప్రణాళికను అభివృద్ధి చేసి, అమలుపరచడానికి నా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తున్నది. విజన్ డాక్యుమెంట్‌లో పర్యాటక రంగాన్ని గ్రోత్‌ఇంజన్‌గా సమర్పించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌ను అత్యంతానుకూల పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలను చేపట్టడమవుతుంది.

కొన్ని మాసాల క్రితం ప్రకటించడం జరిగి, మధ్యలో ఎన్నికల కారణంగా ప్రారంభించడానికి వీలు పడనట్టి కొన్ని పథకాలను ఇప్పుడు నూతనోత్సాహంతో చేపట్టడం జరిగింది. డ్వాక్రాగ్రూపుల నుండి ఎంపిక చేసిన పది లక్షల మంది గ్రామీణ పేద మహిళలకు వర్తింపజేసేందుకు ఉద్దేశించిన దీపం పథకం. గ్రామీణస్త్రీల స్థితిగతులను మెరుగుపరచడానికి, నికృష్టజీవన విధానాన్ని తొలగించడానికి, అటవీ వంటచెరకుపై ఆధారపడకుండ అట్టి పరిస్థితిని నివృత్తిచేసి, తద్వారా పర్యావరణ సంరక్షణకు దోహదపడడానికి ఈ పథకాన్ని ఉద్దేశించడమైనది. ఇప్పటివరకెన్నడూ ఊహించని విధంగా, ఈ పథకం మహిళలను ఉత్తేజితులను చేసి, ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ విధంగా, ఇంతవరకూ పేదల ఆహారభద్రతను సమకూర్చడంపై దృష్టిని కేంద్రీకరించిన రాష్ట్ర ప్రజాపంపిణీ విధానం పూర్తిగా ఒక విన్నూత పరిమాణానికి చేరుకున్నది.

గత నాలుగు సంవత్సరాలలో సాహసవంతమైన ప్రయోగాలు చేయడంలోను, ఆచరణ యోగ్యమైన నూతన మార్పులను తేవడంలోను ఆంధ్రప్రదేశ్ దేశం మొత్తం మీద మిక్కిలి ఆదర్శవంతమైన స్థానాన్ని పొందింది. ఈ పరివర్తనా స్ఫూర్తి అన్ని అభివృద్ధి కార్యకలాపాలలోకి చొచ్చుకుపోయింది. అయితే అభివృద్ధి జరగాలంటే సమాజంలో శాంతి, సామరస్యం నెలకొని ఉండటం ఎంతయినా అవసరం. ఆయా రంగాలలో రాష్ట్రం సాధించిన ప్రగతి ప్రశంసనీయమైనది. నేరపరిస్థితి సంబంధించి కాగ్నైజబుల్ నేరాలు అదుపులో ఉన్నాయి. అవి సాధారణంగా తగ్గుతున్నాయి. మతసామరస్యాన్ని కాపాడడం జరుగుతున్నది. తీవ్రవాద గ్రూపుల కార్యకలాపాలను సమర్థవంతంగా ఎదురుకోవడం

